

# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు



## ఉత్తరాంధ్రకు మహర్దశ

జూలై నుంచే భోగాపురం రన్‌వేపై విమానాలు

6

# ప్రపంచస్థాయి వైద్యసేవలే లక్ష్యం

- ఆగస్టు 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా సంజీవని
- ఇంటి వద్దే 42 వైద్యపరీక్షలు..రిపోర్ట్
- త్వరలోనే ఏఐ డాక్టర్ ద్వారా సేవలు
- మెరుగైన ప్రజారోగ్యం కోసం ఉద్యమం
- ఆరోగ్యమే సమాజానికి నిజమైన సంపద
- రాయలసీమను బంగారు సీమగా మారుస్తాం
- కర్నూలులో ఉత్పత్తి ప్రారంభించబోతున్నాం
- రూ.లక్ష కోట్లతో ఉద్యాన పంటల అభివృద్ధి
- అక్కడి నుంచే యుద్ధ విమానాలు రానున్నాయి
- పూతలపట్టు సంజీవనిలో ముఖ్యమంత్రి చంద్రబాబు

2





రాష్ట్ర ప్రజలకు ప్రపంచస్థాయి వైద్యసేవలు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యం..ప్రజారోగ్యాన్ని సంరక్షించేలా ఆగస్టు 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా సంజీవని ప్రాజెక్టు అమలు చేయనున్నామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఇంటి వద్దే 42 రకాల వైద్యపరీక్షలు నిర్వహించి రిపోర్ట్ ఇచ్చేలా చర్యలు చేపడుతున్నాం. సంజీవని కార్డు ద్వారా డిజిటల్ హెల్త్ రికార్డులనూ పర్యవేక్షిస్తాం. త్వరలోనే ఏఐ డాక్టర్ ద్వారా వైద్యసేవలు పొందేలా చర్యలు చేపడుతున్నామని వివరించారు. చిత్తూరు జిల్లా పూతల పట్టు నియోజకవర్గం యాదమరిలో సంజీవని కార్యక్రమానికి సీఎం హాజరయ్యారు.



## గొడ్డలి పార్టీ నెవర్ అగైన్

- తోక జాడిస్తే కట్ చేస్తాం
- దానికి ప్రజాస్వామ్యంలో చోటు లేదు
- రోజుకొక చిచ్చుపెట్టేందుకు నాటకం
- ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి
- పూతలపట్టులో ముఖ్యమంత్రి చంద్రబాబు

4

రాష్ట్రంలో సూపర్‌సిక్స్ పథకాలు సూపర్‌హిట్ కావటం, కూటమి చేపట్టిన అభివృద్ధి ప్రాజెక్టులను చూసి గొడ్డలి పార్టీ ఫ్రస్టేషన్‌లో ఉంది. అభివృద్ధిని ఓర్వలేక రెచ్చగొట్టే రాజకీయాలు చేస్తోంది.. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించారు. నోరు తెరిస్తే అబద్ధాలు.. ఆ పార్టీ నైజం. ప్రజాస్వామ్యంలో దానికి చోటులేదు..సమాజానికి హానిక రం..తోక జాడిస్తే కట్ చేస్తాం.. గొడ్డలి పార్టీ నెవర్ ఎగైన్ అంటూ వ్యాఖ్యానించారు.

## పండుగగా మహానాడు

హైబ్రిడ్ మహానాడు

కౌంట్‌డౌన్ 3

- కలిసికట్టుగా విజయవంతం చేయాలి
- క్లస్టర్ల బలోపేతానికి ఇదో మంచి అవకాశం
- కేఎస్ఎస్, బూత్, గ్రామ, అనుబంధ కమిటీ సభ్యులను కార్యక్రమానికి ఆహ్వానించాలి
- నారా లోకేష్ దిశానిర్దేశం

క్లస్టర్ స్థాయిలో మహానాడు విజయవంతానికి అందరం కలిసికట్టుగా పనిచేయాలని టీడీపీ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ పిలుపునిచ్చారు. ఈ నెల 27,28 తేదీల్లో క్లస్టర్ స్థాయిలో జరగనున్న మహానాడు సన్నద్ధతపై 1875 క్లస్టర్ ఇన్‌ఛార్జిలతో లోకేష్ వర్చువల్‌గా సమావేశమయ్యారు. చరిత్రలో నిలిచి పోయేలా మహానాడు విజయవంతానికి అంకితభావంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. త్వరలో స్థానిక సంస్థలు ఎన్నికలు రాబోతున్నాయి. ఇందుకు వేదికగా మహానాడును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

6





## రాజారెడ్డి రక్తచరిత్ర!



- క్రిమినల్ పాలిటిక్స్‌కు ఆయనే ఆద్యుడు
- ఫ్యాక్షన్‌కు బీజం వేసింది వైఎస్ కుటుంబమే
- పులివెందులలో అకృత్యాలపై త్వరలోనే పుస్తకం
- వ్యవస్థలపైనే.. జగన్‌రెడ్డి గొడ్డలివేటు
- ఆయన నేర చరిత్ర కలిగిన నిందితుడు
- మంచోడినంటూ సర్టిఫికెట్లు ఇచ్చుకుంటే నమ్మరు
- విధ్వంసం, హత్యా రాజకీయాలకు ఇవే సాక్ష్యాలు
- నాటి ఘటన గుర్తుచేసిన పయ్యావుల కేశవ్

7 13



పులివెందులలో రాజారెడ్డి ఫ్యాక్షన్ చరిత్ర ప్రజలకు తెలుసు..క్రిమినల్ పాలిటిక్స్‌కు ఆయనే ఆద్యుడు.. లింగాల మండలం పార్నపల్లిలో రాజకీయ ప్రత్యర్థులైన టీడీపీకి చెందిన జొన్నలగడ్డ సోదరులు ఇళ్లను డైనమైట్లతో రాజారెడ్డి పేల్చేశారు. నాటి అరాచక విధ్వంసకాండకు.. బాంబుల సంస్కృతికి ఇవే సాక్ష్యాలని మూడున్నర దశాబ్దాల క్రితం జరిగిన ఘటనకు చెందిన ఫొటోలను ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ విడుదల చేశారు.

## అబద్ధం.. అరాచకమే జగన్ సిద్ధాంతం



- అభివృద్ధిని డైవర్ట్ చేసేందుకే
- మూడు నెలలకోసారి ప్రెస్‌మీట్
- బాబాయి హత్య కేసులో
- జగన్ తడబాటు ఎందుకు?
- నిజం బయటపడుతుందనే భయమా?
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

8



## సంజీవని వైద్యసేవలపై ఫీడ్ బ్యాక్


- యాదమరి పీహెచ్‌సీలో సీఎం చంద్రబాబు వైద్య సేవల పరిశీలన
- ప్రజల నుంచి నేరుగా అభిప్రాయ సేకరణ
- డిజిటల్ విధానం, రోగుల మ్యాపింగ్,
- నిపుణులు, వైద్యులతో వర్చువల్‌గా మీటింగ్
- గ్రామస్థాయికి అత్యుత్తమ వైద్యమే లక్ష్యం

3



# ఆగస్టు 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా సంజీవని

- ప్రజలకు ప్రపంచస్థాయి వైద్యసేవలే లక్ష్యం
- ఇంటి వద్దే 42 వైద్య పరీక్షలు..రిపోర్ట్
- త్వరలోనే ఏఐ డాక్టర్ ద్వారా సేవలు
- మెరుగైన ప్రజారోగ్యం కోసం ఉద్యమం
- ఇల్ నెస్ నుంచి వెల్ నెస్ దిశగా ఏపీ
- ఆరోగ్యమే సమాజానికి నిజమైన సంపద
- రాయలసీమను బంగారు సీమగా మారుస్తాం
- కర్నూల్లో బంగారం ఉత్పత్తి ప్రారంభించబోతున్నాం
- రూ.లక్ష కోట్లతో ఉద్యాన పంటల అభివృద్ధి
- అక్కడి నుంచే యుద్ధ విమానాలు రానున్నాయి
- పూతలపట్టు సంజీవనిలో ముఖ్యమంత్రి చంద్రబాబు



పూతలపట్టు/చిత్తూరు(చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ప్రపంచస్థాయి వైద్యసేవలు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. దీనికోసం రాష్ట్రంలో ప్రజారోగ్యాన్ని సంరక్షించేలా సంజీవని కార్యక్రమం అమలు చేయనున్నట్టు వెల్లడించా రు. ఈ ఏడాది ఆగస్టు 15 నుంచి సంజీవని ప్రాజెక్టు ఏపీ వ్యాప్తంగా అమలు అవుతుందని ప్రకటించారు. చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం యాదమరిలో నిర్వహించిన సంజీవని కార్యక్రమానికి ముఖ్యమంత్రి హాజరయ్యారు. సంజీవని కేవలం ఒక సాఫ్ట్‌వేర్ మాత్రమే కాదని, ఇది ఓ సమగ్ర డిజిటల్ పబ్లిక్ హెల్త్ ఆపరేటివ్ సిస్టమ్ అని అభివర్ణించారు. ఇల్ నెస్ నుంచి వెల్ నెస్ దిశగా ఏపీ అడుగులు వేస్తోందని స్పష్టం చేశారు. సంజీవని ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన సిటిజెన్ వెల్ నెస్ మిషన్ అని వ్యాఖ్యానించారు. ప్రివెంటివ్, ప్రిడిక్టివ్, క్యూరేటివ్ అనే మూడు సూత్రాల ఆధారంగా ఈ వ్యవస్థ పని చేస్తుందని సీఎం అన్నారు. ముందస్తుగా గుర్తించటం, వ్యాధి రాకముందే నివారణ, చికిత్సల ద్వారా ప్రజారోగ్యాన్ని కాపాడతామని స్పష్టం చేశారు. వ్యక్తిగత డిజిటల్ హెల్త్ రికార్డులను వైద్యులు నిరంతరం పర్య వేక్షించేలా ఈ వ్యవస్థ సేవలందిస్తుందని వెల్లడించారు. కుప్పంలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభమైన సంజీవని కార్యక్రమం... ఈ ఏడాది మార్చి నుంచి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా అమల్లో ఉంది. ఈ ఏడాది ఆగస్టు 15 నుంచి ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమ లు చేయాలని నిర్ణయించామని ప్రకటించారు. 42 వైద్య పరీక్షలను ఇంటి వద్దే నిర్వహించి రిపోర్టులు ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. ప్రజారోగ్యానికి అవసరమైన ప్రతీ అంశా న్ని సంజీవని ప్రాజెక్టు ద్వారా పర్యవేక్షిస్తామని తెలిపారు. డాక్టర్ అప్పాయింట్మెంట్, వర్చువల్ కనెక్ట్ ద్వారా వైద్య సలహాలు, సంజీవని కార్డు ద్వారా డిజిటల్ హెల్త్ రికార్డుల పర్యవేక్షిస్తామని వివరించారు. త్వరలోనే ఏఐ డాక్టర్ ద్వారా వైద్యసేవలు పొందేలా చర్యలు చేపడుతున్నామని స్పష్టం చేశారు.

**వైద్యరంగానికి ఎక్కువ నిధులు**

వైద్య ఖర్చులు భరించలేక కుటుంబాలు ఆర్థికంగా చితికి పోయాయని, ఆ ఇబ్బందులను తప్పించడానికే ప్రజా ప్రభుత్వం సంజీవనిలాంటి వినూత్న ప్రాజెక్టు తీసుకువచ్చిందని తెలిపారు. రాష్ట్రంలో విద్య-వైద్య రంగాలకు ప్రజా ప్రభుత్వం ఎప్పుడూ అధిక ప్రాధాన్యత ఇస్తుందని వివరించారు. మెరుగైన ప్రజారోగ్యం కోసం ఉద్యమం చేపట్టామని చెప్పారు. ఈసారి బడ్జెట్‌లో వైద్యారోగ్య రంగానికి రూ.19,305 కోట్లు కేటాయించినట్టు వివరించారు. 15వ ఆర్థిక సంఘం నుంచి అత్యధికంగా రూ.2,601 కోట్ల ఆరోగ్య గ్రాంట్లు పొందిన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని తెలిపారు. యూనివర్సల్ హెల్త్ పాలసీ కింద రాష్ట్రంలో పేదా ధనికా తేడా లేకుండా ప్రతీ ఒకొక్కరికి రూ. 2.50 లక్షల విలువైన వైద్య సేవలు అందిస్తామన్నారు. రూ.25 లక్షల వరకూ ఎన్టీఆర్ వైద్య సేవ, సీఎం రిలీఫ్ ద్వారా వైద్య ఖర్చులు భరించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. పేదలకు సైతం మెరుగైన వైద్యం అందిం చేందుకు.. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని ఖాళీలు భర్తీ చేస్తున్నామని వివరించారు. మంచి అలవాట్లు, ఆహారం, వ్యాయా మం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సీఎం పిలుపునిచ్చారు. ఆహారమే ఔషధం - వంటశాలే ఔషధ శాల అని మరోమారు సీఎం స్పష్టం చేశారు. ప్రజారోగ్యంతో పాటు వారి భవిష్యత్తు కోసం ప్రజా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని వివరించారు.

**శ్రీశైలం మల్లన్న నుంచి తిరుపతి వెంకన్న వరకూ కృష్ణా నీరు**

సమాజంలో ప్రతిఒక్కరూ పర్యావరణాన్ని పరిరక్షించటంతో పాటు ప్రతీ నీటి బొట్టునూ సంరక్షించుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. రాష్ట్రంలో సమర్థ నీటి నిర్వహణ ద్వారా జల నవరులను కాపాడుతున్నామని.. భూగర్భ జలాలు కూడా పెంచగలిగామని తెలిపారు. సముద్రంలో వృథాగా పోయే జలాల ను సద్వినియోగం చేసుకుంటూ ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, చెరువులు అన్నింటినీ నింపగలిగామని వివరించారు. హంద్రీ-నీవా కాలువతో రాయలసీమ జిల్లాల్లోని చివరి ప్రాంతాలకు నీరు తీసుకెళ్లామని అన్నారు. అన్నమయ్య జిల్లాలో ప్రభుత్వ యంత్రాం గం తీసుకున్న చర్యలతో భూగర్భ జలాలు పెరిగాయని,

(తరువాయి 3లో..)





# ఆగస్టు 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా సంజీవని

(2వ పేజీ తరువాయి..)

ఈ కారణంగానే అక్కడ పచ్చదనం పెరిగి ఉష్ణోగ్రతలు తగ్గినట్టు నివేదికలు చెబుతున్నాయని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో ఉష్ణోగ్రతలు తీవ్రస్థాయిలో నమోదు అవుతున్నాయని పిడుగురాళ్లలో 49 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డు అయిందని అన్నారు. వర్షపాతం తక్కువ కురుస్తుందన్న అంచనాలు ఉన్న నేపథ్యంలో నీటిని పొదుపుగా వాడు కోవాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల పూర్తి చేసే సంకల్పంతో ఉన్నామని దీనిపై ఇప్పటికే క్యాలెండర్ విడుదల చేసినట్టు తెలిపారు. నీవా పనులు పూర్తి చేసి పూతలపట్టు మీదుగా చిత్తూరు వరకు కృష్ణా నీటిని తీసుకు వస్తామన్నారు. శ్రీశైలం మల్లన్న నుంచి తిరుపతి వెంకన్న వరకూ నీటిని తరలిస్తా మని చెప్పారు. గాలేరు-నగరి కోడూరు వరకు, మల్లెమడుగు బాలాజీ రిజర్వాయర్- 2028 డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామ న్నారు. సోమశిల, స్వర్ణముఖి లింక్ కెనాల్-జూన్ 2028 పూర్తి అవుతుందని వెల్లడించారు.

**రాయలసీమ ఇక ఫైటర్ జెట్ల తయారీ కేంద్రం**

23 నెలల్లో 23 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకువచ్చామని... రాష్ట్రంలోని 23 లక్షల మందికి యువతకు ఉద్యోగాలు వస్తాయని సీఎం స్పష్టం చేశారు. రాయలసీమలోని పుట్టపర్తిలో 5 జనరేషన్ యుద్ధ విమాన తయారీ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశామని... యుద్ధాల్లో పాల్గొనే జెట్ ఫైటర్ యుద్ధ విమానాల తయారీ కేం ద్రంగా పుట్టపర్తి మారబోతోందని తెలిపారు. రాయలసీమను డిఫెన్స్ హబ్‌గా చేస్తామన్నారు. యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించటమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమన్నారు. విశాఖ లో గూగుల్ డేటా సెంటర్, కర్నూలులో డ్రోన్, అనంతపురంలో ఏరోస్పేస్, స్పేస్ సిటీ, ఎలక్ట్రానిక్ సిటీ లాంటివి ఏర్పాటు కానున్నాయని వివరించారు. తిరుపతిలోనే త్వరలోనే బుల్లెట్ మోటార్ సైకిల్ తయారీ పరిశ్రమ ఏర్పాటు కాబోతోందన్నారు. రాయలసీమలో ఉక్కు పరిశ్రమ, సిమెంట్ ఫ్యాక్టరీలతో పాటు వచ్చే నెల కర్నూల్లో బంగారం ఉత్పత్తి చేసే గనులను కూడా ప్రారంభించబోతున్నట్టు సీఎం తెలిపారు. రూ.లక్ష కోట్లతో రాయలసీమలో ఉద్యాన పంటలను అభివృద్ధి చేస్తాం. ప్రభుత్వం నుంచి రూ.40 వేల కోట్లు, రూ.60 వేల కోట్ల ప్రైవేటు పెట్టుబడులు కూడా వస్తాయన్నారు. పశ్చిమాసి యాలో యుద్ధం కారణంగా గ్యాస్ కొరత, పెట్రోలు డీజిల్ ధరలు పెరిగినా... సమస్య తాత్కాలికమేనని పేర్కొన్నారు. మహిళల కోసం కూటమి సర్కారు తల్లికి వందనం, స్త్రీశక్తి, దీపం 2 లాంటి పథకాలు అమలు చేసిందన్నారు. వన్ ఫ్యామిలీ వన్ ఎంటర్‌ప్రెన్యూర్‌తో పాటు చట్ట సభల్లో మహిళా రిజర్వేషన్ల సాధన లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. మహిళలపై జరిగే నేరాల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం హెల్తీ వెల్తీ హ్యాపీ ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా పనిచేస్తుందని స్పష్టం చేశారు. అనంతరం ప్రజా వేదిక ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే మురళి ఇతర ప్రజాప్రతినిధులు, వైద్యారోగ్యశాఖ, చిత్తూరు జిల్లా ఉన్నతాధి కారులు పాల్గొన్నారు.










# సంజీవని వైద్యసేవలపై ఫీడ్ బ్యాక్

- **యాదమరి పీహెచ్‌సీలో ముఖ్యమంత్రి చంద్రబాబు**
- **ప్రజల నుంచి నేరుగా అభిప్రాయ సేకరణ**
- **డిజిటల్ విధానం, రోగుల మ్యాపింగ్ పరిశీలన**
- **నిపుణులు, వైద్యులతో వర్చువల్‌గా మీటింగ్**
- **గ్రామస్థాయికి అత్యుత్తమ వైద్యమే లక్ష్యమని వెల్లడి**

పూతలపట్టు/చిత్తూరు(చైతన్యరథం): చిత్తూరు జిల్లా యాదమరి మండలంలోని సంజీవని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం సందర్శించారు. సంజీవని కార్యక్రమంలో పాల్గొనడానికి పూతలపట్టు వచ్చిన ఆయన తన పర్యటనలో భాగంగా పీహెచ్‌సీలో కొత్తగా ప్రవేశపెట్టిన సంజీవని డిజిటల్ వైద్యసేవల పనితీరును ల్యాబ్ డెమోల ద్వారా పరిశీలించారు. ఓ పెషంట్ పీహెచ్‌సీకి వచ్చి వైద్యం చేయించు కుని మందులు తీసుకెళ్లే ప్రక్రియను మొత్తం పరిశీలించారు. ఈ ప్రక్రియలో భాగంగా సంజీవని ద్వారా టెక్నాలజీని అనుసంధానిం చి ఎలాంటి వైద్యం అందిస్తున్నారనే అంశాన్ని స్వయంగా పరిశీ లించారు. పీహెచ్‌సీలోని వివిధ విభాగాలను సందర్శించి సిబ్బం దితో మాట్లాడారు. సంజీవని ద్వారా రోగులకు తాము ఎలాంటి సేవలను అందిస్తున్నామనే అంశాన్ని ముఖ్యమంత్రికి ఆరోగ్య కేంద్రంలోని సిబ్బంది వివరించారు.

**ఓపీ నుంచి ఫార్మసీ వరకు ప్రతి విభాగం పరిశీలన**

ఓ పేషెంట్ పీహెచ్‌సీకి వస్తే పేషెంట్ కేర్ కోఆర్డినేటర్ డెస్క్ వద్ద చేపట్టే నమోదు ప్రక్రియను ముఖ్యమంత్రి పరిశీలించారు. పీసీసీ డెస్క్ ప్రతినిధి ఈ డిజిటల్ విధానాన్ని సీఎంకు వివరించా రు. డిజిటల్ క్యూ మేనేజ్‌మెంట్ సిస్టమ్, విజిట్ రికార్డుల జనరేష న్, రోగుల సేవలను మ్యాపింగ్ చేసే విధానాన్ని వివరించారు. పీహెచ్‌సీ డ్యాష్ బోర్డులో ఉన్న మొత్తం రిజిస్ట్రేషన్లు, రోజువారీ కన్సల్టేషన్లు, గర్భిణీలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల ట్రాకింగ్ వంటి వాటిని సీఎం పరిశీలించి... వాటి పర్యవేక్షణ తీరుపై అధికారు లతో చర్చించారు. ఆ తర్వాత స్టాఫ్ నర్స్ స్టేషన్‌ను సీఎం సంద ర్శించారు. బీపీ, ఎత్తు, బరువు, టెంపరేచర్, హార్ట్ బీట్, పల్స్ రేట్ వంటి వివరాలను డిజిటల్ పద్ధతిలో నమోదు చేస్తున్న ప్రక్రియను పరిశీలించారు. అనంతరం సంజీవని ప్లాట్‌ఫామ్‌లో ఏఐ అసిస్టెడ్ కన్సల్టేషన్ విధానాన్ని వీక్షించారు. అక్కడ ఉన్న మెడికల్ ఆఫీసర్ రోగి పాత చరిత్రను సేకరించడం, నర్సులు రికార్డు చేసిన వైటల్స్ ను తనిఖీ చేయడం, ఏఐ సపోర్ట్, ఆటోమేటెడ్ డాక్యుమెంటేషన్, డిజిటల్ ప్రిస్క్రిప్షన్ జనరేషన్ వంటి ప్రక్రియలను లైవ్‌లో ముఖ్య మంత్రికి చూపించారు.

ఈ ఏఐ టెక్నాలజీ వల్ల డాక్యుమెంటేషన్ భారం తగ్గి రోగులపై ఎక్కువ శ్రద్ధ పెట్టేందుకు వీలవుతుందని డాక్టర్ వివరించారు. ఆ తర్వాత ఫార్మసీ విభాగాన్ని సీఎం సంద ర్శించారు. ఫార్మసీలో డిజిటల్ ప్రిస్క్రిప్షన్లను చూసి మందుల పంపి ణీ చేసే విధానాన్ని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఫార్మసీ విధుల్లో భాగంగా తాము రోజు వారీ చేసే పని విధానాన్ని ఫార్మసీ సిబ్బంది వివరించారు. ఇక పీహెచ్‌సీలోని వర్చువల్ రూమ్ నుంచి సంజీవని ప్లాట్‌ఫామ్ ద్వారా కనెక్ట్ అయి కుప్పం ఏరియా హాస్పి టల్, బెంగళూరు టాటాఎండీకి నిపుణులైన వైద్యులతో వర్చువల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రామీణ ప్రాంత రోగులకు సుదూర ప్రయాణాల భారం తప్పిస్తూ డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ ద్వారా అత్యా ధునిక వైద్య నిపుణుల సేవలను నేరుగా స్థానిక పీహెచ్‌సీలకే చేర వేస్తున్న విధానాన్ని ముఖ్యమంత్రికి వివరించారు. అత్యాధునిక సాంకేతికత విధానం గ్రామీణ ఆరోగ్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తుందని చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశా రు. పీహెచ్‌సీలో వైద్యసేవలు పొందుతున్న రోగులు, వారి బంధు వులతో సంభాషించారు. టెక్నాలజీని అనుసంధానించి అమలు చేస్తున్న సంజీవని ప్రాజెక్టు ఏ విధంగా ఉందని అడిగి తెలుసుకు న్నారు. వైద్యసేవలతో పాటు ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షే మ, అభివృద్ధి కార్యక్రమాల అమలు ఎలా ఉందని ఫీడ్ బ్యాక్ తీసు కున్నారు. తమకు అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం వంటి పథకాలు తమకు అందుతున్నాయని.. పథకాల అమలు బాగుంద ని వారు వివరించారు. స్త్రీ శక్తి పథకం ద్వారా ఉచితంగా ప్రయా ణించగలుగుతున్నామని లబ్ధిదారులు తెలిపారు.





# గొడ్డలి పార్టీ నెవర్ అగైన్

# తోక జాడిస్తే కట్ చేస్తాం

**- దానికి ప్రజాస్వామ్యంలో చోటు లేదు**
**- రోజుకొక చిచ్చుపెట్టేందుకు నాటకం**
**- ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి**
**- పూతలపట్టులో ముఖ్యమంత్రి చంద్రబాబు**




పూతలపట్టు/చిత్తూరు(చైతన్యరథం): రాష్ట్రంలో సూపర్‌సిక్స్ పథకాలు సూపర్‌హిట్ కావటంతో పాటు కూటమి చేపట్టిన అభివృద్ధి ప్రాజెక్టులను చూసి గొడ్డలి పార్టీ ఫ్రస్టేషన్‌లో ఉందని ముఖ్య మంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం యాదమరిలో నిర్వహించిన సంజీవని కార్యక్ర మానికి చంద్రబాబు హాజరయ్యారు. అభివృద్ధిని ఓర్వలేక గొడ్డలి పార్టీ గంగవెర్రులెత్తుతోంది.. రాష్ట్రంలో ప్రజల ప్రాణాలు కాపాడే రాజకీయాలు ఒకవైపు ప్రజలను భయపెట్టే, మోసం చేసే రాజకీ యాలు ఇంకోవైపు ఉన్నాయి.. ప్రజలు జాగ్రత్తగా గమనించాలి. నోరు తెరిస్తే అబద్ధాలు చెబుతున్న వ్యక్తులు మీడియా ముందు కొచ్చి మంచోడినంటూ మాటలు చెబుతున్నారు.. ఇది గొడ్డలి పార్టీ నైజమని తెలిపారు. గొడ్డలి పార్టీ చేసిన 11 నిర్వాకాలు, అరాచక ఘటనలను ప్రజలకు వివరించారు. ప్రజాస్వామ్యంలో గొడ్డలి పార్టీలకు చోటులేదు..సమాజానికి ఆ పార్టీ హానికరం.. తోక జాడిస్తే కట్ చేస్తాం..గొడ్డలి పార్టీ నెవర్ ఎగైన్ అంటూ వ్యాఖ్యా నించారు.

**వైసీపీ చేసిన 11 నిర్వాకాలు, అరాచకాలు**

1.వివేకా హత్యలో నాటకాలు ఆడారు. నంగనాచి కబుర్లు చెప్పారు. అంతిమ లబ్ధిదారు ఎవరనేది ప్రతిఒక్కరికీ తెలుసు. 2.కోడికత్తి డ్రామా..గులకరాయి డ్రామా ప్రజలందరికీ జ్ఞాపకం ఉంది. ప్రజలను మోసం చేసే ఎత్తుగడ, దుర్మార్గానికి పరాకాష్ట. 3.దళిత డ్రైవర్ సుబ్రమణ్యం హత్య, డోర్ డెలివరీ చేసిన నిందితు డికి అండదండలు ఇచ్చారు. 4.మాస్క్ అడిగిన దళిత డాక్టర్ సుధాకర్‌పై దాడి చేసి వేధించి ప్రాణాలు తీశారు. 5.కుటుంబ బంధాలపై గొడ్డలి వేటు వేశారు. ఆస్తి ఇవ్వకుండా తల్లికి, చెల్లికి అన్యాయం చేశారు. ఇంట్లో న్యాయం చేయకుండా బయట ఎలా న్యాయం చేస్తాడు. 6.హిందూ దేవుళ్లపై దాడులు చేశారు. అపవిత్ర కార్యక్రమాలు, కుట్రలు. తప్పుడు ప్రచారాలు చేశారు. 7. పోలవ రం, అమరావతి, పెట్టుబడులు, అభివృద్ధిపై గొడ్డలి పార్టీ వేటు వేసింది. 8.నందం సుబ్బయ్య, చంద్రయ్య, జల్లయ్యల పీకలు కోసి నడిరోడ్డుపై చంపేసి రక్తదాహం తీర్చుకున్నారు. 9.గంజాయి బ్యాచ్‌లకు ప్రోత్సాహం ఇచ్చారు. వాళ్ల కార్యకర్తలు రప్పా రప్పా రంకెలు వేశారు. జంతు రక్తంతో కటౌట్‌కు అభిషేకాలు చేశారు. 10. కారు కింద వారి పార్టీ కార్యకర్త సింగయ్యను తొక్కించారు... కడపలో పెద్ద దస్తగిరిని చంపేశారు. 11.కులాలు, మతాలు, ప్రాం తాల మధ్య చిచ్చుకు రోజుకో నాటకం. పాస్టర్లతో దాడి డ్రామాలు చేస్తూనే ఉన్నారని మండిపడ్డారు. ఐదేళ్ల పాటు రాష్ట్రంలో ప్రతిఒక్కరికీ నిద్ర లేకుండా చేశారు. ప్రజలకు నరకం చూపిం చారు. కనీసం నోటీసు కూడా ఇవ్వకుండా తనను అరెస్టు చేసి జైల్లో పెట్టారని ఆరోపించారు. ప్రజలందరిలోనూ భయాందోళన లు కల్పించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వస్తూనే స్వేచ్ఛ కల్పించామని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం హెల్తీ వెల్తీ హ్యాపీ ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా పనిచేస్తుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.
















# మహానాడు, పార్టీ బలోపేతంపై దిశానిర్దేశం

## పూతలపట్టులో శ్రేణులతో చంద్రబాబు సమావేశం



పూతలపట్టు/చిత్తూరు(చైతన్యరథం): పూతలపట్టు పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నియోజకవర్గ కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసే అంశంపై చంద్రబాబు కార్యకర్తలకు, జిల్లా, నియోజకవర్గంలోని పార్టీని యంత్రాంగానికి దిశా నిర్దేశం చేశారు. త్వరలో జరగబోయే మహానాడు కార్యక్రమాన్ని విజయ వంతం చేసేలా ప్రతిఒక్కరూ పనిచేయాలని ముఖ్యమంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సహా జిల్లా పార్టీ అధ్యక్షుడు షణ్ముఖరెడ్డి, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ సహా పలువురు ముఖ్య నేతలు పాల్గొన్నారు.










# పండుగ వాతావరణంలో మహానాడు





- **కలిసికట్టుగా విజయవంతం చేయాలి**
- **క్లస్టర్ల బలోపేతానికి ఇదో మంచి అవకాశం**
- **కేఎస్ఎస్, బూత్, గ్రామ, అనుబంధ కమిటీ సభ్యులను కార్యక్రమానికి ఆహ్వానించాలి**
- **ఇన్‌ఛార్జిలకు నారా లోకేష్ దిశానిర్దేశం**

అమరావతి (చైతన్యరథం): క్లస్టర్ స్థాయిలో మహానాడు విజయ వంతానికి అందరం కలిసికట్టుగా పనిచేయాలని టీడీపీ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ పిలుపునిచ్చారు. ఈ నెల 27,28 తేదీల్లో క్లస్టర్ స్థాయిలో జరగనున్న మహానాడు సన్నద్ధతపై రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న తెలుగుదేశం పార్టీ 1875 క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌లతో మంత్రి నారా లోకేష్ ఆన్‌లైన్‌లో సమావేశమయ్యారు. మహానాడు అనేది కేవలం పార్టీ కార్యక్రమం కాదు..తెలుగుదేశం బలం, త్యాగం, క్రమశిక్షణ, సంస్థాగత స్ఫూర్తికి ప్రతిబింబం. తెలుగుజాతి ప్రగతి, తెలుగు ప్రజల అభ్యున్నతి కోసం ఏర్పడిన తెలుగుదేశం. కొవిడ్ సమయంలో మహానాడు నిర్వహించుకోలేకపోతే వర్చువల్ గా ఏర్పాటు చేసుకున్నాం. అనంతరం ఒంగోలులో మహానాడును అద్భుతంగా నిర్వహించుకుని ఎన్నికలకు వెళ్లాం. ఘనవిజయం సాధించాం. ఈ సారి మహానాడును 'స్త్రీ శక్తి మహానాడు థీమ్'తో నిర్వహించుకుంటున్నాం. మహిళలను పెద్దఎత్తున ప్రోత్సహించా లనే లక్ష్యంతో ముందుకువెళుతున్నాం. అందరం కలిసికట్టుగా మహానాడును విజయవంతం చేయాలి. నెల్లూరులో ఘనంగా మహానాడు పండుగను నిర్వహించాలనుకున్నాం. అంతర్జాతీయ పరిస్థితుల నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ పిలుపుమేరకు ఇంధన పొదుపు చర్యల్లో భాగంగా ఈ సారి మహానాడును హైబ్రిడ్ విధానంలో నిర్వహించుకుంటున్నాం. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగే మహానాడులో పొలిట్ బ్యూరో, జాతీయ, రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొంటారు. రాష్ట్రవ్యాప్తంగా క్లస్టర్ కేంద్రం గా మహానాడును వర్చువల్‌గా నిర్వహించుకుంటున్నామని తెలిపారు.

### ప్రతి క్లస్టర్‌కు పార్టీ నుంచి మెటీరియల్

మీ క్లస్టర్ పరిధిలో ఉన్న కుటుంబ సాధికార సారధి దగ్గరి నుంచి బూత్ ఇన్‌ఛార్జ్, గ్రామ పార్టీ అధ్యక్షులు, గ్రామ కమిటీ, క్లస్టర్ కమిటీ సభ్యులు మహానాడులో పాల్గొనాలి. క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌కు ఎక్కువ బాధ్యత ఇవ్వాలనేది జాతీయ అధ్యక్షుల వారి ఆదేశం. క్లస్టర్ మోడల్‌లో మనం ముందుకు వెళ్లాలని ఈ వ్యవస్థను ఏర్పా టు చేసుకున్నాం. క్లస్టర్ బలోపేతానికి ఇదో మంచి అవకాశం. అందరితో అనుబంధం ఏర్పడుతుంది. మహానాడు నిర్వహణపై ఇప్పటికే మార్గదర్శకాలు అందజేశాం. ప్రతి క్లస్టర్‌కు పార్టీ నుంచి మెటీరియల్ అందజేస్తాం. స్థలం ఎంపిక చేసుకోవడంతో పాటు ఎల్ఈడీ టీవీ, స్పీకర్లు, సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉంచుకోవాలి. మై టీడీపీ యాప్ ద్వారా హాజరును నమోదు చేస్తారని చెప్పారు.

### మహిళలు భాగస్వామ్యం అయ్యేలా చూడాలి

క్లస్టర్ పరిధిలో నిర్వహించే మహానాడు విజయవంతానికి ప్రతిఒక్కరూ అంకితభావంతో పనిచేయాలి. ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జ్ లతో సమన్వయం చేసుకోవాలి. పార్టీ పరంగా కూడా అన్ని విధాల సహాయ సహకారాలు అందజేస్తాం. మహిళలు పెద్దఎత్తున భాగ స్వామ్యం అయ్యేలా చూడాలి. ప్రతి కార్యకర్త బాధ్యతగా తీసుకో వాలి. అనుబంధ విభాగాలను కూడా ఆహ్వానించాలి. కుటుంబ సాధికార సారధి, అనుబంధ విభాగాలు, కమిటీ సభ్యులకు, బూత్, గ్రామ కమిటీ సభ్యులకు ఆహ్వానాలు పంపాలి. ఇదో మంచి అవ కాశంగా భావించి రాష్ట్రవ్యాప్తంగా కదలిక తీసుకురావాలి. నూటికి నూరుశాతం క్లస్టర్ స్థాయిలో మహానాడు నిర్వహించాలనేది పార్టీ అధ్యక్షులు చంద్రబాబు ఆదేశం. తూచా తప్పకుండా పాటించాలని సూచించారు.

### ప్రజలతో మమేకం కావాలి

పండుగ వాతావరణంలో మహానాడు నిర్వహించేలా కృషి చేయాలి. తెలుగుదేశం పార్టీలో వ్యక్తులు శాశ్వతం కాదు. వ్యవస్థ శాశ్వతం. ఆ వ్యవస్థను బలోపేతం చేసేందుకే క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌గా పార్టీ అవకాశం కల్పించింది. ఈ బాధ్యతను మనం స్వీకరించి అమలు చేయాలి. ఏ కార్యక్రమం అయినా క్రమశిక్షణ, పట్టుదల, అంకితభావంతో పనిచేయాలి. గత 23 నెలలుగా నేను సుమారు 60 నియోజకవర్గాల్లో పర్యటించాను. దాదాపు 25 నియోజక వర్గాల్లో కార్యకర్తల సమావేశాలు ఏర్పాటు చేశాం. అందరూ సంక్షే మం, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు నేతలు ప్రజలతో మమేకం కావాలని పేర్కొన్నారు.

### పనిచేసే వారికి ప్రాధాన్యం

అందరూ కలిసికట్టుగా పనిచేసే మహానాడు చరిత్రలో మిగిలి పోయే కార్యక్రమంగా నిర్వహించాలి. నామినేటెడ్ పదవుల్లో పని చేసే వారికి ప్రాధాన్యత ఇచ్చాం. మై టీడీపీ యాప్ ద్వారా పనిచేసే వారిని గుర్తిస్తున్నాం. నియోజకవర్గ పర్యటనల్లో సీఎం, నేను ముందుగా కార్యకర్తలను కలుస్తున్నాం. ప్రజాప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తవుతుంది. త్వరలో స్థానికసంస్థలు ఎన్నికలు రాబో తున్నాయి. ఇందుకు సన్నద్ధం కావాల్సిన అవసరం ఉంది. అంద రూ క్షేత్రస్థాయికి వెళ్లి ప్రజలతో మమేకం కావాలి. ఇందుకు వేదిక గా మహానాడును వినియోగించుకోవాలి. అందరూ కలిసికట్టుగా మహానాడును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజక వర్గ ఇన్‌ఛార్జ్‌లు, జోనల్ కోఆర్డినేటర్లు, పార్లమెంట్ పార్టీ అధ్యక్షు లు, ప్రధాన కార్యదర్శులు, మండల, పట్టణ, డివిజన్ పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.

# ఉత్తరాంధ్రకు మహర్దశ..

## జూలైనుంచే భోగాపురం రన్‌వేపై విమానాలు




విశాఖపట్నం (చైతన్య రథం): ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల స్వప్నం నెరవేరబోతోంది. విజయనగరం జిల్లా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం జూలైనుంచే అందుబాటులోకి వచ్చే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇప్పటికే కొన్ని విమానయాన సంస్థలు జూలై 8నుంచి తమ విమానాలను భోగాపురంనుంచే నడుపుతామని ప్రకటించాయి. ప్రముఖ సింగపూర్ ఎయిర్‌లైన్స్ అనుబంధ సంస్థ స్కూట్ తన వెబ్‌సైట్‌లో ప్రయాణికులకు అడ్వైజరీ జారీ చేసింది. పాత విశాఖ విమానాశ్రయంనుంచి కాకుండా, 50 కిలోమీటర్ల దూరంలోని కొత్త విమానాశ్రయంనుంచే సర్వీసులు నడుస్తాయని స్పష్టం చేసింది. దీన్నిబట్టి జూలై మొదటి వారానికే కమర్షియల్ ఆపరేషన్స్ మొదలవడం నిశ్చయంగా కనిపిస్తోంది.

### భోగాపురం ఎయిర్‌పోర్ట్ -కీలక విశేషాలు

జూన్ నెలాఖరుకల్లా పనులు పూర్తి చేస్తామని ఇప్పటికే సీఎం చంద్రబాబు నాయుడు, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ధృవీకరించారు. ప్రారంభోత్సవానికి ప్రధాని నరేంద్ర మోదీ అపాయింట్‌మెంట్ కోరిన రాష్ట్ర ప్రభుత్వం –జూలై 5, 8 తేదీలు, ఆగస్టు 17 లేదా 19 తేదీలను ప్రతిపాదించింది. జూలై 5న మోదీ చేతుల మీదుగా ప్రారంభమవుతుందని ప్రభుత్వ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

### నిర్మాణ వివరాలు:

విస్తీర్ణం: 2,203 ఎకరాలు. అంచనా వ్యయం: రూ.4,592 కోట్లు. నిర్మాణ సంస్థ: జీఎంఆర్ గ్రూప్.

### సామర్థ్యం:

మొదటి దశ: ఏడాదికి 60 లక్షలమంది ప్రయాణికులు.
భవిష్యత్తు లక్ష్యం: ఏడాదికి 4 కోట్లమంది ప్రయాణికులు
ప్రత్యేకతలు: ప్రపంచంలోనే అతిపెద్ద విమానాలు ఎయిర్‌బస్ ఏ380 దిగగలిగే 3.8 కి.మీ. రన్‌వే. అంతర్జాతీయస్థాయి కార్గో టెర్మినల్. విమానాల మరమ్మతుల సదుపాయాలు. జాతీయ రహదారికి అనుసంధానంగా భారీ ట్రంపెట్ జంక్షన్
ప్రభావం: భోగాపురం విమానాశ్రయం అందుబాటులోకి వస్తే విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు మహర్దశ పట్టినట్లే. ఐటీ, పారిశ్రామిక, పర్యాటక రంగాలు జెట్ వేగంతో దూసుకుపోవడం తథ్యంగా కనిపిస్తోంది.

# వ్యవస్థలపైనే.. జగన్ గొడ్డలివేటు!

- ప్రతి వ్యవస్థ... ప్రతి రంగం... ప్రతి ప్రాంతం కునారిల్లింది
- జగన్ బాధితుడు కాదు... నేర చరిత్ర కలిగిన నిందితుడు
- రాష్ట్రంలో ఫ్యాక్షన్, నేరమయ రాజకీయాలకు బీజం వేసింది వైఎస్ కుటుంబమే
- పులివెందులలో రాజారెడ్డి అకృత్యాలపై త్వరలోనే పుస్తకం
- మంచోడినంటూ జగన్ సెల్ఫ్ సర్టిఫికెట్లు ఇచ్చుకుంటున్నాడు
- తండ్రిని ముద్దాయిని చేసిన వారికి పదవులిచ్చి జగన్ సత్కరించారు
- వైఎస్ ఫ్యామిలీ చరిత్రను యువత తెలుసుకోవాలి... వాస్తవాలు గుర్తించాలి
- తన క్రిమినల్ చర్యలను కప్పిపుచ్చుకునేందుకే శాంతిదూతలా నటన
- ఉమ్మడి ప్రెస్ కాన్ఫరెన్సులో ఆర్థిక మంత్రి పయ్యావుల, బీజేపీ ఎంపీ రమేష్

విజయవాడ (చైతన్య రథం): జగన్ ఎన్నటికీ బాధితుడు కాదని... ఆయనో నిందితుడని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తీవ్ర ఆరోపణలు చేశారు. తాను మంచోడినని చెప్పుకుంటూ జగన్ మోహన్‌రెడ్డి సెల్ఫ్ సర్టిఫికెట్లు ఇచ్చుకుంటున్నారని ఎద్దేవా చేశారు. శనివారం విజయవాడ ఆర్ అండ్ బి గెస్ట్ హౌసులో అనకాపల్లి బీజేపీ ఎంపీ సీఎం రమేష్‌తో కలిసి ప్రెస్‌కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వీరిద్దరూ ఇటీవల జగన్ చేసిన కామెంట్లపై విరుచుకుపడ్డారు. పులివెందులలో రాజారెడ్డి చేసిన అకృత్యాల్లో కొన్నింటిని వివరించారు. రాజారెడ్డి చేసిన అకృత్యాలు నేటి తరానికి అర్థమయ్యే విధంగా పుస్తకాన్ని వేసే ఆలోచనలో ఉన్నామన్నారు. ఈ సందర్భంగా ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ... "జగన్ బెంగళూరు ప్యాలెస్‌నుంచి ఆంధ్రప్రదేశ్‌కు వచ్చినప్పుడల్లా సరికొత్త, వింత వాదనలను తెరపైకి తెస్తుంటారు. గతంలో తనను సన్మానించాలని కోరిన జగన్, నిన్నటికి నిన్న ప్రెస్‌మీట్ పెట్టి తనకంటే ఉత్తముడు, మంచోడు లోకంలోనే లేడంటూ సొంతంగా 'సెల్ఫ్ సర్టిఫికేట్' ఇచ్చుకున్నారు. సొంత బాబాయ్ వైఎస్ వివేకాపై గొడ్డలిపోటు వేసి గుండెపోటుగా చిత్రీకరించేందుకు ప్రయత్నించిన జగన్ చరిత్ర అందరికీ తెలిసిందే. వివేకా హత్య కేసులో ఏం జరిగిందో ఇవాళ నిక్కరు వేసుకునే చిన్న పిల్లాడిని అడిగినా స్పష్టంగా చెబుతాడు. అలాంటి సున్నితమైన అంశాల్లో కూడా జగన్ పచ్చి అబద్దాలు ఆడుతూ పబ్బం గడుపుకుంటున్నారు" అని పయ్యావుల మండిపడ్డారు.

**ఫ్యాక్షనిజానికి ఆద్యులు వైఎస్ కుటుంబమే**

"ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో నేరమయ సంస్కృతిని ప్రవేశపెట్టింది, ఫ్యాక్షన్ రాజకీయాలకు బీజం వేసింది వైఎస్ కుటుంబమే. గతంలో కేవలం కొన్ని వర్గాలు, కుటుంబాలకు మాత్రమే పరిమితమైన వ్యక్తిగత కక్షలను, ఫ్యాక్షనిజాన్ని వ్యవస్థీకృతం చేసి రాజకీయాల్లోకి విస్తరింపజేసిన ఘనత జగన్ తాత రాజారెడ్డిదే. 1989లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాయలసీమలో ఫ్యాక్షనిజానికి అధికారిక అండదండలు లభించాయి. నాటి ఎన్నికల్లో పులివెందుల నియోజకవర్గంలోని పార్నపల్లి గ్రామంలో తెలుగుదేశం పార్టీకి భారీ మెజార్టీ వచ్చిందన్న ఒకే ఒక్క కారణంతో, ఆ గ్రామానికి చెందిన టీడీపీ నాయకుల ఇళ్లకు డ్రిల్లింగ్ చేసి, డైనమైట్లు పెట్టి పేల్చివేసిన భయానక చరిత్ర రాజారెడ్డిది. ఆ దారుణ ఘటనను రాయలసీమ ప్రజలు ఇప్పటికీ మరిచిపోలేదు. తమ రాజకీయ ప్రత్యర్థులపై పథకం ప్రకారం దాడులు చేయించి, అదే సమయంలో తాము వేరే ప్రాంతంలో ఉన్నట్లు కృత్రిమంగా ఎలిబీ సృష్టించుకునే సరికొత్త నేర సంస్కృతి వైఎస్ కుటుంబంతోనే రాష్ట్రంలో ఆరంభమైంది. లింగాల మండలంలో టీడీపీకి చెందిన ముగ్గురు ముఖ్య నాయకులను తీవ్రంగా భయభ్రాంతులకు గురి చేశారు. ఇలాంటి అకృత్యాలు పులివెందుల నియోజకవర్గంలో పదుల సంఖ్యలో జరిగాయి. రాజారెడ్డి కాలం నుంచి పులివెందులలో సాగిన ఈ అరాచకాలు, హత్య రాజకీయాలపై త్వరలోనే సమగ్ర ఆధారాలతో కూడిన ఒక పుస్తకాన్ని తీసుకువచ్చే ఆలోచన చేస్తున్నాం" అని మంత్రి పయ్యావుల ప్రకటించారు.

**నాడు విధ్వంసం... నేడు నిర్మాణం**

"ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాకే రాయలసీమలో ఫ్యాక్షనిజాన్ని రూపుమాపారు. శాంతిభద్రతలు అదుపులోకి వచ్చాయి. వైఎస్ కుటుంబం మొదలుపెట్టిన ఫ్యాక్షన్ ముఠా సంస్కృతిని నియంత్రించడానికి 30 ఏళ్లు పట్టింది. జగన్ అధికారంలో ఉన్నప్పుడు ప్రతి వ్యవస్థ, ప్రతి రంగం, ప్రతి ప్రాంతం, శాంతిభద్రతలు, పరిశ్రమలు, పోలవరం, అమరావతిపైనా గొడ్డలి వేటు వేశారు. అందుకే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని గొడ్డలి పార్టీ అని పిలవాల్సి వస్తోందని విమర్శించారు. అందుకే గొడ్డలి పార్టీ నెవ్వర్ ఎగైన్ అనే ప్రజలకు పదేపదే చెబుతున్నాం. సమాజంలో ఒక తరానికి చంద్రబాబు నాయుడు ఐటీ, ఇతర రంగాల ద్వారా ఉపాధి అవకాశాలు సృష్టిస్తే, జగన్ మాత్రం ఉన్న పరిశ్రమలను తరిమేసి యువత భవిష్యత్తును అంధకారం చేశారు. గత ప్రభుత్వంలో



అచ్చెన్నాయుడు అరెస్ట్ నుంచి చంద్రబాబు అరెస్ట్ వరకు కేవలం రాష్ట్రంలో భయోత్పాతాన్ని సృష్టించేందుకే జగన్ ప్రయత్నించారు. నాడు జగన్ పొక్లెయిన్లను విధ్వంసానికి వాడితే... నేడు కూటమి ప్రభుత్వం అదే పొక్లెయిన్లను, బుల్ డోజర్లను రాష్ట్ర పునర్నిర్మాణానికి, అభివృద్ధికి వినియోగిస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు 800 పరిశ్రమలను గ్రౌండ్ చేయడానికి చంద్రబాబు ప్రభుత్వం శరవేగంగా అడుగులు వేస్తోంది. తద్వారా యువతకు పెద్దపీట వేయబోతున్నాం. ప్రత్యేకించి యువత వైఎస్ జగన్ గురించి.. వైఎస్ ఫ్యామ్లీ విధ్వంసం గురించి తెలుసుకోవాలి.. విశ్లేషించాలి" అని పయ్యావుల వివరించారు.

**తండ్రిని ముద్దాయిని చేసింది జగనే..**

"వైఎస్ రాజశేఖర్ రెడ్డిని కోర్టు కేసుల్లో ముద్దాయిగా మార్చింది స్వయంగా జగన్ మోహన్ రెడ్డే. ఈ నిజాన్ని ఉండవల్లి అరుణ్ కుమార్ సైతం బహిరంగంగానే వెల్లడించారు. ఆనాడు కోర్టులో వైఎస్సార్‌ను ముద్దాయిగా చేర్చిన లాయర్ పొన్నవోలు సుధాకర్ రెడ్డికి జగన్ తన ప్రభుత్వంలో అడిషనల్ అడ్వకేట్ జనరల్ వంటి ఉన్నత పదవి ఇచ్చి గౌరవించారు. గతంలో వైఎస్సార్ మరణం వెనుక రిలయన్స్ సంస్థ హస్తం ఉందని నానా యాగి చేశారు. ఆ తర్వాత అదే సంస్థకు చెందిన వ్యక్తికి వైఎస్సార్సీపీ తరపున రాజ్యసభ పదవి ఎలా ఇచ్చారు. వైఎస్సార్ మరణించిన బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. వైఎస్ మరణం వెనుక జగన్ పాత్ర ఉందని అన్నారు. దానికి జగన్ సమాధానం చెప్పగలరా..? నాడు వైఎస్సార్ పాదయాత్రలో తీవ్ర అస్వస్థతకు గురైనప్పుడు తల్లి విజయమ్మ వెళ్లి పరామర్శించారు తప్ప, జగన్ ఎందుకు వెళ్లలేదు...? నాడు మాజీ ఎంపీ లగడపాటి రాజగోపాల్ సైతం వైఎస్ మరణంపై మొదట విచారించాల్సింది జగన్ మోహన్ రెడ్డినేనని చెప్పారు. వివేకానందరెడ్డిని చంపిందెవరో ఆయన సొంత కుమార్తె సునీతమ్మ ఇవాళ స్పష్టంగా చెబుతుంటే జగన్ ఎందుకు ఉలిక్కిపడుతున్నారు. నేరం చేయడమే నైజంగా మార్చుకున్న గొడ్డలి పార్టీ సమాజానికి తీవ్ర హానికరం" అని మంత్రి పయ్యావుల హెచ్చరించారు.

**శాంతిదూతలా నటిస్తోన్న జగన్: ఎంపీ సీఎం రమేష్**

మీడియా సమావేశంలో అనకాపల్లి బీజేపీ ఎంపీ సీఎం రమేష్ మాట్లాడుతూ... "జగన్ మోహన్ రెడ్డి ఒక నటుడు, క్రిమినల్. జగన్ క్రిమినల్ అనే పచ్చి నిజం ప్రజల్లోకి బలంగా చొచ్చుకుపోవడంతో, ఆ నింద నుంచి తప్పించుకునేందుకు, ప్రజలను పక్కదారి పట్టించేందుకు ఇప్పుడు హఠాత్తుగా శాంతి దూత ముసుగు వేసుకుని నటిస్తున్నారు. క్రిమినల్ ముద్ర అనేది రాష్ట్రానికి మంచి పనులు చేస్తే పోతుంది కానీ, ప్రెస్ మీట్లలో కూర్చుని పచ్చి అసత్యాలు చెబితే పోదు. కరడు గట్టిన నేరస్థులకు కూడా తట్టని కుట్రలు, కుతంత్ర ఆలోచనలతో వైఎస్ కుటుంబం పులివెందులలో అరాచక సామ్రాజ్యాన్ని నిర్మించింది. జగన్ తాత రాజారెడ్డిపై నాడు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే పోలీస్ రికార్డుల్లో అధికారికంగా రౌడీ షీట్ నమోదై ఉంది. ఒక కులాన్ని అడ్డం పెట్టుకుని దొంగతనాలు చేయించి, ఒక మైనింగ్ యజమానిని దారుణంగా అంతమొందించి, ఆ గనులను అక్రమంగా దక్కించుకుని రాజారెడ్డి డబ్బు కూడగట్టుకున్నిరు. పులివెందులలో రాజారెడ్డి చేసిన అరాచకాలకు పార్నపల్లి గ్రామంలో నేటికీ సజీవ సాక్ష్యాలు ఉన్నాయి. తన స్వార్థ రాజకీయ లబ్ధి కోసం రాజారెడ్డి ఎందరినో హతమార్చారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి, వైఎస్ వివేకానందరెడ్డిల మరణాలను జగన్ తన రాజకీయ ప్రయోజనాల కోసం వేర్వేరుగా చిత్రీకరిస్తున్నారు. స్వయంగా సెల్ఫ్ గోల్ వేసుకున్నారు. వివేకా హత్య కేసులో సీబీఐ లోతుగా దర్యాప్తు చేసి వైఎస్ భాస్కర్ రెడ్డిని అరెస్ట్ చేసింది. ఈ దారుణ హత్య వెనుక జగన్ మోహన్ రెడ్డి హస్తం ఉందా లేదా అనే అంశంపై రాష్ట్రంలో ఓపెన్ పోల్ పెట్టాలి. ఒకవేళ ఆ పోల్‌లో జగన్‌కు ఎటువంటి సంబంధం లేదని తేలితే రాజకీయాల నుంచే శాశ్వతంగా తప్పుకుంటా. ప్రజలకు జగన్ హత్యా రాజకీయాలపై పూర్తి అవగాహన వచ్చేసింది. అందుకే ఇప్పుడు తాను చాలా మంచివాడినని చెప్పుకుంటూ జగన్ నాటకాలు ఆడుతున్నారు. ప్రొఫెసర్ నాగేశ్వర్ వంటి వారు కూడా పొంతన లేని వ్యాఖ్యలు చేస్తూ సమాజంలో తమకున్న క్రెడిబిలిటీని పూర్తిగా కోల్పోతున్నారు" అని ఎంపీ సీఎం రమేష్ స్పష్టం చేశారు.

## లండన్‌లో మందులు వేసినా
# జగన్ పిచ్చి పోలేదు

### -మంత్రి అనగాని సత్యప్రసాద్ ధ్వజం



మంగళగిరి (చైతన్య రథం): మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిలో ఇంకా సైకో పోకడలు పోవడం లేదని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ తీవ్రంగా విమర్శించారు. మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో గ్రీవెన్స్ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.

**తమ చరిత్ర ప్రజలకు తెలుసు**

వైసీపీ అధ్యక్షుడు తాజాగా తాను అమాయకుడిని, అహింసావాదిని అని చెప్పుకోవడంపై మంత్రి తీవ్రంగా స్పందించారు. రాయలసీమలో వారి కుటుంబం చేసిన దారుణాలు, హత్యలు ఏ ఇంటి గడప అడిగినా చెప్తారని ఆయన అన్నారు. రాజారెడ్డి పోలికలు తనకు వచ్చాయని గర్వంగా చెప్పుకున్న వ్యక్తి వైసీపీ అధ్యక్షుడేనని గుర్తు చేశారు.

**హత్యలు, అరాచకాల చరిత్ర**

తండ్రి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో అధికారాన్ని అడ్డంపెట్టుకుని తన వ్యాపారానికి అడ్డు వచ్చిన ప్రతి ఒక్కరినీ హత్య చేసిన వ్యక్తి జగన్ అని మంత్రి ఆరోపించారు. పరిటాల రవి సహా అనేకమందిని హత్య చేశారని, ఐదేళ్ల పాలనలో చంద్రయ్యలాంటి విధేయులను కోసి చంపిన సంఘటనలు తాము కళ్లారా చూశామని గుర్తు చేశారు. అమరనాథ్ గౌడ్, సుధాకర్, డోర్ డెలివరీ చేసిన వ్యక్తి సహా ఎందరో బలైపోయారని వివరించారు.

**కుటుంబంపైనే కత్తి**

తల్లిని, చెల్లిని ఆస్తి కోసం తరిమేసిన వ్యక్తి అని మంత్రి మండిపడ్డారు. బాబాయ్ హత్య కేసులో సీబీఐ విచారణకు వస్తే, బంధువైన ఎంపీని కాపాడేందుకు అధికార యంత్రాంగాన్ని దుర్వినియోగం చేసి సీబీఐ అధికారులపై దాడులకు పాల్పడినారని ఆరోపించారు. ముఖ్యమంత్రిగా ఐదేళ్లు చేసి కూడా బాబాయ్ హంతకుడిని పట్టుకోలేకపోవడం వెనుక ఆయనకు అన్నీ తెలుసని తేల్చి చెప్పారు.

**11 సీట్లు కూడా రావు**

పక్కనే ఉండే పార్టీ నాయకులకు కూడా నమ్మకం కలగని స్థితిలో వైసీపీ 11 సీట్లకు పడిపోయిందని అనగాని హెచ్చరించారు. రాష్ట్రంలో ప్రస్తుతం అభివృద్ధి, సంక్షేమం జరుగుతోందని, పెట్టుబడులు వస్తున్నాయని, యువత సంతోషంగా ఉందని ఆయన చెప్పారు. జగన్ ప్రతిపాదించిన 'మావిగన్' పేరు వినగానే చిన్నపిల్లలు కూడా నవ్వుతున్నారని చురకపెట్టారు.

# అబద్ధం.. అరాచకమే


## జగన్ రాజకీయ సిద్ధాంతం

- అభివృద్ధిని డైవర్ట్ చేసేందుకే మూడు నెలలకోసారి ప్రెస్‌మీట్
- బాబాయి హత్య కేసులో జగన్ తడబాటు ఎందుకు...?
- నిజం బయటపడుతుందనే భయమే కారణం
- ఐదేళ్ల కక్షసాధింపులు, శవ రాజకీయాలకు ప్రజలిచ్చిన తీర్పే 11 సీట్లు
- 2029లో జగన్‌కు ప్రజలు శాశ్వత రాజకీయ సన్యాసం ఖాయం చేస్తారు
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

అమరావతి (చైతన్య రథం): అబద్ధాలే ఆయుధంగా, అరాచకాలే రాజకీయంగా ముందుకు సాగిన వ్యక్తి జగన్ మోహన్ రెడ్డి అని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తీవ్రస్థాయిలో విమర్శించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజల్లో వస్తున్న సానుకూల స్పందనను మళ్లించేందుకే జగన్ రెడ్డి మూడు నెలలకు ఒకసారి ప్రెస్‌మీట్లు పెట్టి రాజకీయ డ్రామాలకు తెరలేపుతున్నారని మండిపడ్డారు.

**అభివృద్ధిని చూసి ఓర్వలేక జగన్ డ్రామాలు**

ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ... గత మూడు నెలల్లో రాష్ట్రానికి క్యారియర్, రాయల్ ఎన్‌ఫీల్డ్, ఏఎంసీఏ వంటి ప్రతిష్ఠాత్మక పెట్టుబడులు వచ్చాయని, ఎస్‌ఏఈఎల్ సంస్థ కార్యకలాపాలు ప్రారంభమయ్యాయని, జాబ్ క్యాలెండర్ విడుదల చేశామని, విశ్వవిద్యాలయాల్లో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు ఇచ్చామని గుర్తుచేశారు. రాయలసీమకు రూ.లక్ష కోట్లతో ఉద్యానవన హబ్ ప్రకటించిన విషయాన్ని ప్రస్తావిస్తూ... రాష్ట్రాభివృద్ధి బాటలో దూసుకుపోతుంటే ఓర్వలేక జగన్ రెడ్డి



ప్రెస్‌మీట్ పేరుతో గంటల తరబడి అసత్య ప్రచారం చేసి మళ్లీ బెంగళూరుకు పారిపోతున్నారని ఎద్దేవా చేశారు.

ఐదేళ్ల పాలనలో రాష్ట్ర ప్రజలకు ఒక్క శాశ్వత అభివృద్ధి పని చేయని జగన్... ఇప్పుడు తానే రాష్ట్రాన్ని ఉద్ధరించానని చెప్పుకోవడం హాస్యాస్పదమన్నారు. అరాచకాలు, కక్షసాధింపులు, ఫ్యాక్షన్ రాజకీయాలు, శవ రాజకీయాలకు ప్రజలు ఇప్పటికే తీర్పు ఇచ్చారని, అందుకే వైఎస్సార్సీపీని 11 సీట్లకే పరిమితం చేశారని పేర్కొన్నారు. ప్రజలు అభివృద్ధికి, విధ్వంసానికి మధ్య తేడాను స్పష్టంగా గుర్తించారని అన్నారు.

**బాబాయి హత్య కేసులో జగన్ తడబాటు ఎందుకు?**

బాబాయి హత్య కేసుపై జగన్ వైఖరిలోని తడబాటును ప్రజలు గమనిస్తున్నారని పల్లా శ్రీనివాసరావు వ్యాఖ్యానించారు. "గుండెపోటు" అని మొదట చెప్పింది జగన్ కాదా? "నారాసుర రక్త చరిత్ర" అంటూ ప్రచారం చేసింది జగన్ కాదా? సీబీఐ విచారణ కోరింది కూడా జగన్ కాదా? ఐదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు నిజాన్ని బయటపెట్టకుండా ఎందుకు మౌనం వహించారని ప్రశ్నించారు. ఇప్పుడు మళ్లీ అదే కేసును చంద్రబాబుపై నెట్టేందుకు ప్రయత్నించడం వెనుక అసలు భయం ఏమిటో ప్రజలకు అర్థమవుతోందన్నారు.

**శవ రాజకీయాలు వైఎస్సార్ కుటుంబానికే సొంతం**

తండ్రి శవం ఎదురుగా పెట్టుకుని రాజకీయాలు చేసిన చరిత్ర వైఎస్సార్ కుటుంబానిదేనని, ఇప్పుడు అదే రాజకీయ సంస్కృతిని కొనసాగిస్తూ ప్రజలను మభ్యపెట్టాలని జగన్ ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో నడుస్తోంది "రాజారెడ్డి రాజ్యాంగం" కాదని... డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగమని స్పష్టం చేశారు. ప్రజలు ఇక ఫ్యూడల్ రాజకీయాలను నమ్మే పరిస్థితిలో లేరని, 2029 ఎన్నికల్లో జగన్‌కు శాశ్వత రాజకీయ సన్యాసం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు.

# సీమలో రక్తం పారించిన చరిత్ర మీది

- జగన్‌పై మంత్రి సవిత ఆగ్రహం
- రాయలసీమలో ఫ్యాక్షనిజం రాజారెడ్డితోనే మొదలు
- వివేకా హంతకులు వైసీపీలోనే ఉన్నారు
- జగన్ నోట శాంతి వచనాలు విని నవ్వుతున్న జనాలు
- రాయలసీమకు వైఎస్ ఫ్యామిలీ చేసిందేమీ లేదు
- చంద్రబాబుతోనే సీమ అభివృద్ధి
- లోకేశ్ గురించి మాట్లాడే అర్హత జగన్‌కు లేదని వ్యాఖ్య



పెనుకొండ/ శ్రీసత్యసాయి (చైతన్య రథం): "రాయలసీమలో రక్తం ఏరులై పారించిన చరిత్ర జగన్‌ది. నీ తాతది, నీ తండ్రిది.. నీ బాబాయ్ హంతకులు, దళితులను పొట్టన బెట్టుకున్నవారు నీ పార్టీలోనే ఉన్నారు కదా.. మహాత్మాగాంధీ, గౌతమ బుద్ధుడిలా నువ్వు శాంతి వచనాలు పలికితే రాష్ట్రంలో నమ్మేవాళ్లెవరూ లేరు" అని జగన్‌పై రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ మంత్రి సవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. జగన్ సైకో పాలనతో ఐదేళ్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పాలయ్యారన్నారు. రాయలసీమలో ఫ్యాక్షనిజాన్ని అంతమొందించి, ఇక్కడి బిడ్డలను ఐటీ, ప్రభుత్వ ఉద్యోగులుగా, వ్యాపారులుగా తీర్చిదిద్దిన ఘనత సీఎం చంద్రబాబుదేనన్నారు. మంత్రి నారా లోకేశ్ గురించి మాట్లాడే అర్హత జగన్ కు లేదన్నారు. పెనుకొండ పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి సవిత మాట్లాడారు. తాడేపల్లి ప్యాలెస్ లో శుక్రవారం నిర్వహించిన జగన్ ప్రెస్ మీట్ ను చూసి జనాలు నవ్వుకుంటున్నారన్నారు. మహాత్మా గాంధీ, గౌతమ బుద్ధుడిలా జగన్ రెడ్డి శాంతి వచనాలు పలికించడం చూసి, చిన్న పిల్లలతో పాటు రాజకీయ అవగాహన లేని వారు సైతం నవ్వుతున్నారన్నారు. రాయలసీమలో ఫ్యాక్షన్ కు నాందిపలికింది రాజారెడ్డి అని ఆరోపించారు. జగన్, ఆయన తండ్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి, తాత రాజారెడ్డి చరిత్ర అందరికీ తెలిసిందేనన్నారు.. ఫ్యాక్షన్ నైజంతో రాయలసీమలో రక్తం ఏరులై పారించారని, వారి రక్త దాహానికి బడుగు, బలహీన వర్గాల వారు, రాజకీయ ప్రత్యర్థులు బలైపోయారని అన్నారు. శవ రాజకీయాలు చేయడంలో జగన్ తరవాతే ఎవరైనా అని వైసీపీ నేత బొత్స సత్యనారాయణ గతంలో అనలేదా..? అని ప్రశ్నించారు. తండ్రి శవాన్ని రాజకీయ ఉనికి కోసం ఉపయోగించుకోలేదా..? అని జగన్ ను మంత్రి సవిత నిలదీశారు. తల్లిని, చెల్లెళ్లను సైతం ఏడిపిస్తున్నారని మండిపడ్డారు. బాబాయ్ హంతకులు, దళిత సామాజిక వర్గానికి చెందిన డ్రైవర్ సుబ్రహ్మణ్యాన్ని పొట్టన బెట్టుకున్న వ్యక్తి వైసీపీలోనే ఉన్నారని మండిపడ్డారు. ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ అయిదేళ్ల పాటు రాష్ట్ర ప్రజలను తీవ్ర ఇబ్బందులు పాల్జేశారన్నారు. జగన్ గాని, ఆయన తాత రాజారెడ్డిగాని, తండ్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డిగాని రాయలసీమకుగాని, పులివెందుల అభివృద్ధికి గాని ఏం చేశారు..? అని మంత్రి సవిత నిలదీశారు. అన్నమయ్య డ్యామ్ కొట్టుకుపోయిన ఘటనలో అధికారంలోకి ఉండి కూడా జగన్ ఏమీ పట్టించుకోలేదని మంత్రి సవిత ఆగ్రహం వ్యక్తం చేశారు.

**చంద్రబాబుతోనే రాయలసీమ అభివృద్ధి**

రాయలసీమ అభివృద్ధికి సీఎం చంద్రబాబునాయుడు అహర్నిశలూ కృషి చేస్తున్నారని మంత్ర సవిత కొనియాడారు. కియాలాంటి అంతర్జాతీయ కార్ల పరిశ్రమను తీసుకొచ్చారన్నారు. రాయల్ ఎన్ ఫీల్డ్ పరిశ్రమతో పాటు ఏరో స్పేస్ పరిశ్రమను నెలకొల్పుతున్నారన్నారు. హార్టీకల్చర్ హబ్ గా, సోలార్ హబ్ గా, పారిశ్రామిక హబ్ గా రాయలసీమను అభివృద్ధి చేస్తున్నారన్నారు. రాయలసీమలో ఫ్యాక్షనిజాన్ని అంతమొందించి, ఇక్కడి బిడ్డలను ఇంజనీర్లుగా, డాక్టర్లుగా, ఐటీ ఉద్యోగులుగా తీర్చిదిద్దిన ఘనత కూడా సీఎం చంద్రబాబునాయుడిదేనన్నారు. రాయలసీమలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి అధిక నిధులు కేటాయిస్తున్నారన్నారు. సీఎం చంద్రబాబునాయుడు రాయలసీమ అభివృద్ధి ప్రదాత అయితే, జగన్ ద్రోహిగా నిలబడ్డారన్నారు.

**ఆ అర్హత జగన్‌కు లేదు**

కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలో రాష్ట్రంలో అభివృద్ధితో పాటు సంక్షేమానికి అధిక ప్రాధాన్యమిస్తున్నామని మంత్రి సవిత తెలిపారు. రాష్ట్ర ఐటీ, విద్య శాఖ మంత్రి నారా లోకేశ్ రాష్ట్రాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. రాష్ట్రానికి రూ.25 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు రావడంలో మంత్రి నారా లోకేశ్ కీలకంగా వ్యవహరించారన్నారు. గాడితప్పన విద్య వ్యవస్థను ప్రక్షాళన చేసి, ఏపీ విద్యా వ్యవస్థను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దుతున్నారన్నారు. దేశంలోనే ఏపీని అగ్ర పథాన నిలుపుతున్న మంత్రి నారా లోకేశ్ గురించి మాట్లాడే అర్హత జగన్ కు లేదని మంత్రి సవిత తేల్చి చెప్పారు. రాజకీయ ఉనికి కోసం జగన్ మరోసారి శవ రాజకీయాలకు తెరలేపారని, ఆయనను ఎవరూ పట్టించుకోవడం లేదని మంత్రి సవిత తెలిపారు.

**చెత్త ఊడ్చి... చేతులతో ఎత్తి...**

అంతకుముందు శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ పట్టణంలో నిర్వహించిన ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమంలో మంత్రి సవిత పాల్గొని చెత్త ఊడ్చారు. స్వయంగా మంత్రి తన చేతులతో చెత్త తీసి డస్ట్ బిన్ లో వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, క్లీన్ పెనుకొండ – గ్రీన్ పెనుకొండకు ప్రజలు సహకరించాలని పిలుపునిచ్చారు. పరిసరాల పరిశుభ్రతతోనే అభివృద్ధి సాధ్యమని నమ్మిన వ్యక్తి సీఎం చంద్రబాబునాయుడన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆపరేషన్ క్లీన్ స్వీప్ పేరుతో పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతి నెలా మొదటి వారంలో రోడ్లు, పబ్లిక్ ప్రదేశాల పరిశుభ్రత, రెండో వారంలో కాల్వల శుభ్రత, మూడో వారంలో చెత్త వేరు చేయడంపై అవగాహన, నాలుగో వారంలో పబ్లిక్ టాయిలెట్ల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు. పట్టణాలు పరిశుభ్రంగా ఉండాలంటే ప్రభుత్వం ఒక్కటే కాదు ప్రజల భాగస్వామ్యం కూడా ఎంతో అవసరం. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకునే బాధ్యత తీసుకోవాలి"అని మంత్రి సవిత పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.



# ఆపరేషన్ క్లీన్ స్వీప్!

- నాలుగు వారాల పరిశుభ్రతా యజ్ఞానికి మంత్రి నారాయణ శ్రీకారం
- మున్సిపాలిటీలను పరిశుభ్రంగా మార్చడమే లక్ష్యం
- పారిశుధ్య కార్మికులతో కలిసి రోడ్లు ఊడ్చిన మంత్రి.. డివైడర్లకు పెయింటింగ్
- అన్న క్యాంటీన్‌లో ప్రజలతో కలిసి అల్పాహారం చేసిన నారాయణ




విజయవాడ (చైతన్య రథం): రాష్ట్రాన్ని పరిశుభ్రంగా, డంప్‌యార్డ్ రహితంగా తీర్చిదిద్దే లక్ష్యంతో మున్సిపల్ వ్యవహారాల శాఖ నాలుగు వారాల ప్రత్యేక స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని అమలు చేస్తోందని మున్సిపల్ వ్యవహారాల మంత్రి పి. నారాయణ తెలిపారు. విజయవాడ రైల్వేస్టేషన్ సమీపంలోని సాంబమూర్తి రోడ్డులో గల కుర్మయ్య బ్రిడ్జి వద్ద నిర్వహించిన ఆపరేషన్ క్లీన్ స్వీప్ ప్రారంభ కార్యక్రమాన్ని మంత్రి నారాయణ, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్. సురేష్ కుమార్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్, విజయవాడ నగర పాలక సంస్థ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ జి. లక్ష్మీశ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ బి. అనిల్ కుమార్ రెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర, ఆపరేషన్ క్లీన్ స్వీప్ బ్రాండ్ అంబాసిడర్ డాక్టర్ జి. సమరంలతో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ మాట్లాడుతూ... ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన పెంపొందించేందుకు ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మొదటి వారంలో రోడ్లు, పబ్లిక్ ప్రదేశాల శుభ్రత చేపడతారన్నారు. రెండో వారంలో ప్రజల భాగస్వామ్యంతో కాలువల క్లీనింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తారు. మూడో వారంలో ఇళ్లు, కమర్షియల్ సంస్థల వద్ద చెత్త వర్గీకరణ (సెగ్రిగేషన్)పై అవగాహన కల్పిస్తారు. నాలుగో వారంలో పబ్లిక్ టాయిలెట్ల శుభ్రత కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రభుత్వంతో పాటు ప్రజల భాగస్వామ్యం కూడా ఉండాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 2024 అక్టోబర్ 2న మచిలీపట్నంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. ప్రతి మూడో శనివారం ఒక జిల్లాను సందర్శిస్తూ ముఖ్యమంత్రి స్వయంగా ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారన్నారు.

గత ప్రభుత్వం రాష్ట్రంలో వదిలేసిన సుమారు 153 లక్షల టన్నుల లెగసీ వ్యర్థాలలో, భూమిపైన ఉన్న 85 లక్షల టన్నుల చెత్తను అధికారులు రికార్డు స్థాయిలో ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు 2025 అక్టోబర్ 2 నాటికి ఏడాదిలోనే తొలగించారు. మిగిలిన భూగర్భ చెత్తను కూడా వచ్చే జూన్ చివరి నాటికి పూర్తిగా క్లియర్ చేసే దిశగా వేగంగా పనులు కొనసాగుతున్నాయన్నారు. రాష్ట్రంలో చెత్తను విద్యుత్‌గా మార్చే "వేస్ట్ టు ఎనర్జీ" ప్రాజెక్టులకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, ప్రస్తుతం విశాఖపట్నం, గుంటూరు ప్రాంతాల్లో ప్లాంట్లు పనిచేస్తుండగా, మరో ఆరు ప్లాంట్ల నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. ఇవి రాబోయే రెండేళ్లలో పూర్తై చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేయనున్నాయన్నారు.

అలాగే ప్లాంట్లు లేని మిగిలిన 123 మున్సిపాలిటీల్లో చెత్తను ఎప్పటికప్పుడు ప్రాసెస్ చేసే విధంగా టెండర్లు పిలిచారన్నారు. వచ్చే నెల జూన్ చివరి నాటికి ఈ ప్రక్రియ పూర్తవుతుందని అధికారులు తెలిపారన్నారు. రాష్ట్రంలో భవిష్యత్తులో డంప్‌యార్డ్‌లు లేకుండా చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్ మాట్లాడుతూ... రాష్ట్రంలో స్వచ్ఛాంధ్ర ఉద్యమాన్ని ప్రజల భాగస్వామ్యంతో విస్తృతంగా అమలు చేస్తూ, ఆంధ్రప్రదేశ్‌ను పరిశుభ్రతలో దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. రాష్ట్రంలో ఎనిమిది వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లు, 107 వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టామని చెప్పారు. డోర్ టు డోర్ చెత్త సేకరణను సమర్థవంతంగా అమలు చేస్తూ, 2,000 ఎలక్ట్రిక్ వాహనాలను వినియోగంలోకి తీసుకువచ్చినట్లు తెలిపారు.

ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమం ద్వారా ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన పెంచుతున్నామని పేర్కొన్నారు. గత సంవత్సరం స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల్లో రాష్ట్రానికి ఐదు అవార్డులు లభించాయని, ఈసారి మరింత మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ స్వచ్ఛ సూపర్ లీగ్‌లో స్థానం సంపాదించుకోవడం సంతోషకరమని పేర్కొంటూ, స్వర్ణాంధ్ర –స్వచ్ఛాంధ్ర లక్ష్య సాధనకు అందరూ సమిష్టిగా పనిచేస్తున్నారని తెలిపారు.

స్వర్ణాంధ్ర సాధనలో స్వచ్ఛాంధ్ర కీలక పాత్ర పోషిస్తుందని మున్సిపల్ వ్యవహారాల శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ మాట్లాడుతూ... నగర పరిశుభ్రత కేవలం పారిశుధ్య కార్మికుల బాధ్యత మాత్రమే కాదని, ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. విజయవాడలో 3,600 మంది శానిటేషన్ సిబ్బంది ప్రతిరోజూ కష్టపడి పనిచేస్తున్నారని, వారికి ప్రజలు సహకరించాలని కోరారు. చెత్తను రోడ్లపై, కాలువల్లో వేయకుండా డస్ట్‌బిన్లలో వేయాలని సూచించారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమంలో భాగంగా రెడ్, యెల్లో స్పాట్ల నిర్మూలన, డ్రైన్ల శుభ్రత, పబ్లిక్ టాయిలెట్ల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టామని తెలిపారు. బహిరంగ మూత్ర విసర్జన నివారణకు వినూత్న చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ప్రజలు, వ్యాపారులు, బల్క్ వేస్ట్ జనరేటర్లు అందరూ బాధ్యతగా వ్యవహరిస్తేనే విజయవాడను మరింత పరిశుభ్రమైన నగరంగా తీర్చిదిద్దగలమని సురేష్ కుమార్ పేర్కొన్నారు.

స్థానిక ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ... స్వచ్ఛాంధ్ర సాధనలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. వ్యాపారులు, విద్యా సంస్థలు, స్వయం సహాయక సంఘాలు, ఎన్జీవోలు, యువతతో పాటు సమాజంలోని ప్రతి వర్గం పరిశుభ్రత కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. స్వచ్ఛాంధ్ర ద్వారా ప్రజల ఆరోగ్యం మెరుగుపడి, వారి ఆదాయం పెరిగి రాష్ట్ర అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమర్థవంతంగా అమలు చేయాలంటే ముందుగా పరిశుభ్రమైన ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించాలని ముఖ్యమంత్రి ఆకాంక్షిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థలు, టెర్రస్ గార్డెన్ గ్రూపులు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, నగర ప్రజలు, నగరపాలక సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

## 8 కిలోమీటర్లు కాలినడకన వెళ్లి గర్భిణికి పురుడు పోసిన 108 సిబ్బంది

### అరకు ఏజెన్సీలో సేవా స్ఫూర్తి చాటిన బృందం.. పండంటి మగబిడ్డకు జన్మ

అరకు (చైతన్య రథం): అరకు ఏజెన్సీ ప్రాంతంలోని మారుమూల గిరిజన గ్రామంలో 108 అంబులెన్స్ సిబ్బంది సేవా తత్వానికి నిదర్శనంగా నిలిచారు. రోడ్డు సౌకర్యం లేకపోవడంతో గర్భిణి వద్దకు చేరుకోవడానికి 108 సిబ్బంది సుమారు 8 కిలోమీటర్లు కాలినడకన ప్రయాణించి సకాలంలో వైద్య సహాయం అందించారు. అనంతగిరి మండలంలోని దూర ప్రాంత గిరిజన గ్రామానికి చెందిన గర్భిణికి అకస్మాత్తుగా ప్రసవ వేదన ప్రారంభమవడంతో కుటుంబీకులు 108 సేవలకు సమాచారం అందించారు. గ్రామానికి రహదారి లేకపోవడంతో అంబులెన్స్ ఒక దశవరకు మాత్రమే వెళ్లగలిగింది. పరిస్థితి అత్యవసరమని గుర్తించిన ఈఎంటి మరియు పైలట్ వైద్య పరికరాలతో కాలినడకన గ్రామానికి చేరుకుని గర్భిణికి అత్యవసర వైద్య సేవలు అందించారు. సిబ్బంది అప్రమత్తతతో అక్కడికక్కడే సురక్షితంగా ప్రసవం నిర్వహించగా గర్భిణి పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం తల్లి, శిశువును భద్రంగా తరలించి మెరుగైన వైద్య సేవలు అందించారు. ప్రస్తుతం తల్లి, శిశువు ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నారని వైద్య సిబ్బంది తెలిపారు. ప్రాణాలకు ప్రాధాన్యతనిస్తూ మారుమూల ప్రాంతాల్లోనూ సేవలు అందిస్తున్న 108 సిబ్బంది సేవలను గ్రామస్థులు అభినందించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు అండగా నిలుస్తున్న 108 సేవలు మరోసారి మానవత్వాన్ని చాటాయని స్థానికులు పేర్కొన్నారు.

## అధికారం పోగానే.. దిగజారుడు రాజకీయం!

### జగన్ శవ రాజకీయాలపై వెల్లువెత్తుతున్న విమర్శలు



అమరావతి (చైతన్య రథం): రాజకీయ పబ్బం గడుపుకోవడం కోసం.. సానుభూతి ఓట్లకోసం ఎంతటి దిగజారుడు ఆరోపణలకైనా వైఎస్ జగన్‌రెడ్డి వెనుకాడరని మరోసారి రుజువైంది. అధికారం దూరమై, పార్టీ ఉనికి ప్రశ్నార్థకంగా మారిన ప్రస్తుత తరుణంలో ఆయన మళ్లీ పాత పల్లవి అందుకోవడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. రాజకీయ ప్రయోజనాల కోసం కన్న తండ్రి మరణాన్ని సైతం ఆయుధంగా వాడుకుంటున్నారంటూ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మొన్నటి ప్రెస్‌మీట్‌లో జగన్.. ఏకంగా తన తండ్రి, వైఎస్ రాజశేఖరరెడ్డి మరణం వెనుక కుట్ర ఉందంటూ ఆరోపణలు తెరపైకి తెచ్చారు. నాడు అసెంబ్లీలో చంద్రబాబు చేసిన వ్యాఖ్యల వల్లే తన తండ్రి చనిపోయారన్నట్లుగా జగన్ మాట్లాడటం ఆయన దిగజారుడుతనానికి పరాకాష్ట. ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి.

### ఐదేళ్ల అధికారంలో ఏం చేశారు?

వైఎస్సార్ మరణించి దాదాపు 17 సంవత్సరాలు గడిచాయి. ఈ కాలంలో జగన్‌మోహన్ రెడ్డి స్వయంగా ఐదేళ్లు ముఖ్యమంత్రిగా పాలన సాగించారు. చేతిలో పూర్తి అధికారం, పోలీసు వ్యవస్థ ఉన్న ఆ ఐదేళ్లలో తండ్రి మరణంపై ఆయన ఎలాంటి దర్యాప్తునకు ఆదేశించలేదు. విచారణ సంస్థలను కదిలించలేదు. అప్పుడు మౌనంగా ఉన్న జగన్‌కు –అధికారం కోల్పోయిన వెంటనే అనుమానాలు రావడం వెనుక ఉన్న రాజకీయ లెక్కను ప్రజలు అర్థం చేసుకుంటున్నారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

### వైఫల్యాలు కప్పిపుచ్చుకునే వ్యూహమా?

అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత రాష్ట్రంలో వైసీపీ శ్రేణులు నైతికంగా కుంగిపోయాయి. పార్టీ ఉనికి ప్రశ్నార్థకంగా మారిన ఈ తరుణంలో ప్రజల దృష్టిని మళ్లించేందుకే జగన్ ఉద్దేశపూర్వకంగా సెంటిమెంట్ కార్డు తెరపైకి తెచ్చారని విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. చంద్రబాబుపై నిందలు వేయడం ద్వారా సానుభూతి సంపాదించడంతోపాటు, తన పాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడమే ఆయన అసలు వ్యూహమని విశ్లేషకుల మాట.

### సింపతీ కార్డు మళ్లీ పనిచేస్తుందా?

గతంలో సానుభూతి రాజకీయాలు ఒక్కోసారి ఫలించి ఉండవచ్చు. కానీ పదే పదే అదే సెంటిమెంట్‌ను వాడటం వల్ల ప్రజలు ఇకపై నమ్మే స్థితిలో లేరు. అధికారంలో ఉన్నప్పుడు నిస్సహాయంగా ఉండి, ప్రతిపక్షంలోకి వెళ్లిన వెంటనే బురదజల్లే రాజకీయాలు చేయడం రాజకీయ పతనానికి దారితీస్తుందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

# రీ సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

**రాష్ట్ర సర్వే, సెటిల్మెంట్, ల్యాండ్ రికార్డ్స్ డైరెక్టర్ కూర్మనాథ్**



*బాపులపాడు (చైతన్యరథం): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూ రీ సర్వే, గ్రౌండ్ ట్రూథింగ్, విలేజ్ సర్వేయర్ లాగిన్, ఈ-కేవైసీ ప్రక్రియలను మరింత వేగవంతం చేయాలని రాష్ట్ర సర్వే, సెటిల్మెంట్, ల్యాండ్ రికార్డ్స్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ అధికారులను ఆదేశించారు. బాపులపాడు మండలం మల్లవల్లిలో గ్రౌండ్ ట్రూథింగ్, వేలేరు, వీరవల్లి గ్రామాల్లో సర్వేయర్ లాగిన్ లో జరుగుతున్న డేటా ఎంట్రీలను శనివారం ఉదయం ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. సర్వే సిబ్బంది చేస్తున్న గ్రౌండ్ ట్రూథింగ్, ఈ-కేవైసీ ప్రక్రియలను దగ్గరుండి గమనించిన డైరెక్టర్ అక్కడున్న రైతులు, రెవెన్యూ, సర్వే సిబ్బందితో ముఖాముఖి మాట్లాడారు. క్షేత్ర స్థాయిలో ఎదురవుతున్న పలు సాంకేతిక, భూ సమస్యలపై సుదీర్ఘంగా సమీక్షించారు. రీ సర్వే ప్రక్రియ అత్యంత పారదర్శకంగా సాగుతోందని చెప్పడానికి నిదర్శనంగా మల్లవల్లిలో డైరెక్టర్ కూర్మనాథ్ సమక్షంలోనే సిబ్బంది రైతుల భూ కమతాలను సర్వే చేసి డేటా సేకరించారు. తమ కళ్ల ముందే అధికారులు సర్వే చేస్తుండటంపై స్థానిక రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కూర్మనాథ్ మాట్లాడుతూ ప్రజలు, రైతుల సమక్షంలో పనులు చేపట్టి పూర్తి చేస్తేనే అత్యుత్తమ ఫలితాలు వస్తాయన్నారు. భూ రికార్డుల ప్రక్షాళన, రైతులకు కచ్చితమైన భూ హక్కులు కల్పించడమే లక్ష్యంగా రాత్రింబవళ్లు శ్రమిస్తున్న రెవెన్యూ, సర్వే సిబ్బంది సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మల్టీ జోన్-1 ఆర్జేడీ సీహెచ్‌వీఎస్‌ఎన్ కుమార్, సర్వే శాఖ జిల్లా సహాయ సంచాలకుడు లక్ష్మణరావు, మచిలీపట్నం జిల్లా ఇన్‌స్పెక్టర్, బాపులపాడు మండల తహసీల్దారు బి.మురళీకృష్ణ, మండల సర్వేయరు సీహెచ్ ఫణికుమార్, రెవెన్యూ, సర్వే శాఖల సిబ్బంది, పెద్ద ఎత్తున రైతులు పాల్గొన్నారు.*



# సీఎం ముఖ్య అతిథిగా 25న ఎంఎస్ఎంఈ గ్రోత్ సమ్మిట్

- **సదస్సు ఏర్పాట్లపై మంత్రి కొండపల్లి సమీక్ష**
- **విజయవాడ అంబేద్కర్ కళావేదికలో కార్యక్రమం**
- **ఏర్పాట్లు పగడ్బందీగా జరగాలని సూచనలు**



విజయవాడ (చైతన్య రథం): ప్రతి ఇంటికి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయాలన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి లక్ష్యం మేరకు ఎంఎస్ఎంఈ పని చేస్తుందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం సీఎం అధ్యక్షతన విజయవాడ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళావేదికలో జరిగే ఎంఎస్ఎంఈ గ్రోత్ సమ్మిట్ కార్యక్రమ ఏర్పాట్లను శనివారం మంత్రి పలు శాఖల అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ఎంఎస్ఎంఈ ద్వారా ఎన్నో వినూత్న కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. ఈ క్రమంలోనే సోమవారం ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న గ్రోత్ సమ్మిట్‌ను అన్నిశాఖల అధికారులు విజయవంతం చేయాలని మంత్రి సూచించారు. ఎంఎస్ఎంఈ ఔత్సాహికులను కార్యక్రమంలో ఎలా సమీకృతం చేస్తూ ముందుకు తీసుకువెళ్లాలనే అంశంపై మంత్రి చర్చించారు. గ్రోత్ సమ్మిట్ విషయంలో తీసుకోవాల్సిన పలు జాగ్రత్తలను మంత్రి అధికారులకు సూచించారు. ట్రాఫిక్, పార్కింగ్, సీఎం షెడ్యూల్ గురించి సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏపీ పరిశ్రమల శాఖ సెక్రటరీ డాక్టర్ యువరాజ్, వీసీ మరియు ఎండీ ఏపీఐఐసీ దినేష్‌కుమార్, ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఈవో విశ్వ, విజయవాడ ఆర్డీవో, ఐ అండ్ పీఆర్ శాఖ, పోలీస్ శాఖనుంచి ఏడీసీపీ మురళీకృష్ణ, డీఎస్పీ మానస, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

# అజరామరం 'వేటూరి' సాహిత్యం

***విశాఖలో 16వ సంస్మరణ సభ***





**ముఖ్య అతిథులుగా హాజరైన స్పీకర్ అయ్యన్నపాత్రుడు, హోం మంత్రి అనిత, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు**

విశాఖపట్నం (చైతన్యరథం): తెలుగు సినీ గేయ ప్రపంచంలో వేటూరి సుందరరామమూర్తి ముద్ర చెరిపేయలేనిదని, ఆయన కలం నుంచి జాలువారిన ప్రతి అక్షరం ఒక ఆణిముత్యమని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత కొనియాడారు. విశాఖపట్నంలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో 'ఆత్రేయ స్మారక కళా పీఠం' ఆధ్వర్యంలో వేటూరి 16వ సంస్మరణ సభ, సాహితీ పురస్కార ప్రధాన వేడుక శనివారం వైభవంగా జరిగింది. ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, హోం మంత్రి వంగలపూడి అనిత, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు జ్యోతిప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా వేటూరి రాసిన పాటల సంకలన పుస్తకాలను స్పీకర్, హోం మంత్రి సంయుక్తంగా ఆవిష్కరించారు.

సభలో హోం మంత్రి అనిత మాట్లాడుతూ.. "వేటూరి 150కి పైగా సినిమాలకు సుమారు ఆరువేల అద్భుతమైన పాటలు రాశారు. క్లాసికల్ 'శంకరాభరణం' సినిమా నుంచి మోడ్రన్ 'ఆనంద్' చిత్రం వరకు ఆయన చూపించిన వైవిధ్యం అసమానమైనది. నా సొంత నియోజకవర్గమైన పాయకరావుపేటలో ప్రతి సంవత్సరం వేటూరి సంస్మరణ సభను అధికారికంగా, ఘనంగా నిర్వహిస్తున్నాం" అని పేర్కొన్నారు. వేటూరి సాహిత్యం రాబోయే తరాల రచయితలకు దిక్సూచిగా నిలుస్తుందని సభలో పాల్గొన్న ప్రముఖులు కొనియాడారు.

# భానుడి విశ్వరూపం



- **కానుమోలులో రికార్డు స్థాయిలో 45.8 డిగ్రీల ఉష్ణోగ్రత**
- **నేడు 214 మండలాల్లో వడగాల్పుల ప్రభావం**
- **ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్న విపత్తుల నిర్వహణ సంస్థ**

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో ఎండ తీవ్రత కొనసాగుతుందని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ సూచించారు. శనివారం కృష్ణా జిల్లా కానుమోలులో 45.8 డిగ్రీలు, అనకాపల్లి జిల్లా మాకవరపాలెంలో 45.5 డిగ్రీలు అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయన్నారు. రాష్ట్రంలోని 28 జిల్లాలకు గాను 13 జిల్లాల పరిధిలోని 95 మండలాల్లో 42 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయని ఆయన వెల్లడించారు. ప్రజలు వీలైనంత వరకు ఉదయం 11 నుంచి సాయంత్రం 4 మధ్య ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని సూచించారు. తప్పనిసరి ప్రయాణాల్లో మంచినీరు వెంట తీసుకుని వెళ్లాలన్నారు. ఆదివారం 21 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, 214 మండలాల్లో వడగాల్పులు ప్రభావం చూపే అవకాశం ఉందని తెలిపారు. వడగాల్పులు, అధిక ఉష్ణోగ్రతల నమోదయ్యే మండలాల పూర్తి వివరాల లింక్: https://apsdma.ap.gov.in/files/5dcb3b1755e32ba3f3f8a4347dad5f8b.pdf ఆదివారం నాడు ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 45-46 డిగ్రీల వరకు, మన్యం, అల్లూరి సీతారామరాజు, పోలవరం, కాకినాడ, అనకాపల్లి, కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, తిరుపతి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 42-44 డిగ్రీల వరకు, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్ కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 40-42 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని ప్రఖర్ జైన్ వెల్లడించారు.

మరోవైపు ఛత్తీస్‌గఢ్, ఒడిశా మీదుగా ఉత్తరాంధ్ర వరకు ద్రోణి కొనసాగుతోందన్నారు. దీని ప్రభావంతో నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్ కడప, అన్నమయ్య జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, మన్యం, అల్లూరి జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఉరుములతో వర్షం పడేటప్పుడు పొలాల్లో పనిచేసే రైతులు, పశుకాపరులు చెట్ల కింద నిలబడరాదని... వెంటనే సురక్షిత భవనాల్లోకి వెళ్లాలని సూచించారు.

శనివారం కృష్ణా జిల్లా కానుమోలులో 45.8, అనకాపల్లి జిల్లా మాకవరపాలెంలో 45.5, ఏలూరు జిల్లా కుక్కునూరు, పోలవరం జిల్లా కూనవరం, పల్నాడు జిల్లా శ్రీనగర్‌ల్లో 45, ఎన్టీఆర్ జిల్లా తొర్రగుడిపాడులో 44.6, తూర్పు గోదావరి జిల్లా చిట్యాలలో 44.3, విశాఖ రూరల్లో 42.8, అల్లూరి జిల్లా రామరాజుపాలెం, కాకినాడ జిల్లా కోటనందూరులో 42.6, మార్కాపురం జిల్లా నందనామారెళ్లలో 42.5, ప్రకాశం జిల్లా కొండపిలో 42.4, గుంటూరు జిల్లా రాయపడిలో 42.3 డిగ్రీల చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ఎండ తీవ్రత దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రఖర్ జైన్ సూచించారు. ముఖ్యంగా వృద్ధులు, గర్భిణులు, బాలింతలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఎండలో బయటకు వెళ్లేటప్పుడు చెవుల్లోకి వేడిగాలి వెళ్లకుండా జాగ్రత్త పడాలని, గుండె సంబంధిత వ్యాధులు, షుగర్, బీపీ ఉన్నవారు ఎండలో తిరగరాదని సూచించారు. నిమ్మకాయ నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు, మంచినీరు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు.

# ఆత్మకూరులో 'మహానాడు'కు సర్వం సిద్ధం

**- మంత్రి ఆనం రామనారాయణరెడ్డి**

ఆత్మకూరు (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే "మహానాడు" పండుగను ఆత్మకూరు నియోజకవర్గంలో అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వెల్లడించారు. మహానాడు విజయవంతం చేయడంపై ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల టీడీపీ నేతలు, కార్యకర్తలతో ఆయన ఒక ముఖ్య సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడు తూ.. "ఇది మనందరి పండుగ... మన మనసు నిండుగా జరిగే వేడుక. పార్టీ శ్రేణులంతా ఉరకలెత్తే ఉత్సాహంతో ఈ పసుపు పండుగకు సన్నద్ధం కావాలి" అని పిలుపునిచ్చారు.

రాష్ట్రవ్యాప్తంగా ఆధునిక టెక్నాలజీని ఉపయోగించి దాదాపు 1,850కి పైగా కేంద్రాల్లో మహానాడును ఘనంగా నిర్వహించేందుకు పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్టు మంత్రి తెలిపారు. ప్రతి క్లస్టర్ కేంద్రంలోనూ భారీ ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేస్తున్నామని, వీటి ద్వారా జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు, జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు నారా లోకేష్ ప్రసంగాలను కార్యకర్తలు నేరుగా వీక్షించేలా లైవ్ స్ట్రీమింగ్



(ప్రత్యక్ష ప్రసారం) సౌకర్యం కల్పించామన్నారు.

ఆత్మకూరు నియోజకవర్గంలోని ఒక మున్సిపాలిటీ, ఆరు మండలాల పరిధిలో పార్టీ శ్రేణులను సమన్వయం చేస్తూ మొత్తం 11 ప్రత్యేక క్లస్టర్లు ఏర్పాటు చేసినట్టు మంత్రి ఆనం వివరించారు. ప్రతి క్లస్టర్‌కు ప్రత్యేక కో-ఆర్డినేటర్లను నియమించి బాధ్యతలు అప్పగించారు.

**మండలాల వారీగా మహానాడు వేదికల వివరాలు:**

మర్రిపాడు మండలం: ఇక్కడ రెండు క్లస్టర్లు ఏర్పాటు చేశారు. మొదటిది కృష్ణాపురం పీఏసీఎస్ సమీపంలో, రెండవది మర్రిపాడు మండల కేంద్రంలోని బాబా గార్డెన్స్ వద్ద వేదికలను సిద్ధం చేశారు.

అనంతసాగరం మండలం: చిలకలమర్రి మల్లెంకొండయ్య స్వామి ఆలయం సమీపంలో మొదటి క్లస్టర్, అనంతసాగరం నేషనల్ ఫంక్షన్ హాల్ వద్ద రెండవ క్లస్టర్ ఏర్పాట్లు పూర్తయ్యాయి.

ఆత్మకూరు రూరల్, టౌన్: ఆత్మకూరు రూరల్ పరిధి, లోని శ్రీధర్ గార్డెన్స్ కన్వెన్షన్ హాల్ వద్ద, ఆత్మకూరు పట్టణం లో రవితేజ కళ్యాణ మండపంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఏఎస్ పేట మండలం: కామాక్షి కళ్యాణమండపంలో మొదటి క్లస్టర్, చిరమన గ్రామంలో రెండవ క్లస్టర్ కేంద్రాలను ఏర్పాటు చేసి పార్టీ శ్రేణులను అనుసంధానిస్తున్నారు.

సంగం మండలం: లక్ష్మీవెంకటేశ్వర కళ్యాణ మండపంలో మొదటి క్లస్టర్, సిద్దిపురం సచివాలయం సమీప ప్రాంతంలో రెండవ క్లస్టర్ కార్యక్రమాలు జరుగుతాయి

చేజర్ల మండలం: ఇక్కడ ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ వెనుక భాగంలో మహానాడు క్లస్టర్ కేంద్రం సిద్ధం చేశారు.

టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ మహానాడు పండుగను విజయవంతం చేయాలని మంత్రి రామనారాయణరెడ్డి పిలుపునిచ్చారు.

## మే 25న తాలిం-ఏ-హునర్ టాలెంట్ టెస్ట్ ఫలితాలు

**- మంత్రి ఫరూక్ చేతుల మీదుగా ఫలితాల విడుదల**
**- ఏపీ వక్ఫ్ బోర్డు ఛైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్**



విజయవాడ (చైతన్య రథం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో నిర్వహించిన తాలిం-ఏ-హునర్ టాలెంట్ టెస్ట్ మూల్యాంకన ప్రక్రియ విజయవంతంగా ముగిసిందని రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ తెలిపారు. టాలెంట్ టెస్ట్‌కు సంబంధించిన ప్రాథమిక సమాధాన కీ ఇప్పటికే విడుదల చేశామని, విద్యార్థులు దానిని సంబంధిత వెబ్‌సైట్‌లో పరిశీలించుకోవచ్చని తెలిపారు. పరీక్షను కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు, పూర్తి పారదర్శకతతో నిర్వహించామని, అలాగే మూల్యాంకన ప్రక్రియను కూడా అదేస్థాయి భద్రతా ప్రమాణాలు, నిష్పక్షపాత విధానం, పారదర్శకతతో పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. పరీక్ష ఫలితాలను మే 25న మైనారిటీ సంక్షేమ, న్యాయ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్ చేతుల మీదుగా అధికారికంగా విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. విద్యార్థుల ఎంపిక పూర్తిగా మెరిట్ ఆధారంగానే జరుగుతుందని, ఫలితాల విడుదల అనంతరం ఎంపికైన విద్యార్థులకు తదుపరి ప్రక్రియకు సంబంధించిన పూర్తి వివరాలను తెలియజేస్తామని అబ్దుల్ అజీజ్ వెల్లడించారు.

## క్లీన్ అండ్ గ్రీన్‌కి కూటమి అధిక ప్రాధాన్యత

***- భవిష్యత్తు తరాలకు పర్యావరణ ప్రకృతి: మంత్రి స్వామి***



మార్కాపురం /కనిగిరి (చైతన్య రథం): రాష్ట్రంలో క్లీన్ అండ్ గ్రీన్‌కి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు. శనివారం మార్కాపురం జిల్లా కనిగిరిలో ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమంలో మంత్రి డిఎస్ బీవీ స్వామి స్థానిక ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డితో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వయంగా చీపురుతో చెత్త ఊడ్చి ఆర్టీసీ బస్టాండ్ పరిసరాల్ని మంత్రి శుభ్రం చేశారు. స్వచ్ఛతపై ప్రజలతో ప్రతిజ్ఞ చేయించిన అనంతరం మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ... రాష్ట్రంలో మున్సిపాలిటీల్లో నెలపాటు ఆపరేషన్ క్లీన్ స్వీప్ – ఒక రాష్ట్రం ఒక పరిశుభ్రత లక్ష్యం కార్యక్రమం నిర్వహిస్తాం. రాష్ట్రంలో క్లీన్ అండ్ గ్రీన్ కి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోంది. వైసీపీ హయాంలో ఎక్కడి చెత్తను అక్కడే వదిలేసి.. అదేదో వారసత్వ సంపదలాగా మా ప్రభుత్వానికి అప్పగించారు. చెత్తపై పన్ను వేసి ప్రజలను వేధించిన చెత్త ప్రభుత్వం గత వైసీపీ ప్రభుత్వం. స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యంలో ప్రజలంతా భాగస్వాములు కావాలి. మొక్కలు నాటడం, చెట్లను పెంచడం ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతగా తీసుకోవాలి. భవిష్యత్తు తరాలకు పరిశుభ్రమైన, పర్యావరణ ప్రకృతిని అందిద్దామని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి పిలుపు నిచ్చారు.

# సెకండరీ ఆసుపత్రుల్లో సంక్లిష్ట శస్త్రచికిత్సలు

- **రిఫరల్స్ తగ్గించి.. రోగుల ఆరోగ్యానికి వైద్యుల భరోసా**
- **వైద్య, ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ అభినందనలు**
- **32 వైద్య బృందాలకు ప్రశంసా లేఖలు పంపిన డీఎస్‌హెచ్**
- **ధర్మవరం ఏరియా ఆసుపత్రిలో లాప్రోస్కోపిక్ సర్జరీలు**

అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలోని సెకండరీ ప్రభుత్వ ఆసుపత్రులు ఒక్కో విజయగాథను లిఖిస్తున్నాయి. పరిమిత సౌకర్యాలు ఉన్నప్పటికీ నిబద్ధత గల వైద్యులు కేసులను పెద్దాసుపత్రులకు రిఫర్ చేయకుండా స్థానికంగానే క్లిష్టమైన శస్త్రచికిత్సలు నిర్వహిస్తూ రోగులకు ఆర్థిక భారం, సమయం మిగిలిస్తున్నారు. ఈ ఏడాది జనవరి 31 నుంచి ఇటీవల వరకు 32 సంక్లిష్ట శస్త్రచికిత్సలు జరిగినట్లు డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ (డీఎస్‌హెచ్) కేవీఎన్ చక్రధరబాబు వెల్లడించారు. అదనంగా జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలులో 18 ఆసుపత్రులు ఉత్తమ పనితీరు కనబరిచాయి. ప్రతిభ చూపిన వారికి మొత్తం 50 అభినందన లేఖలు పంపినట్లు ఆయన తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఈ విజయాలను ప్రశంసిస్తూ ఇదే స్ఫూర్తిని నిరంతరం కొనసాగించాలని, సహచరులు కూడా ఇదేవిధంగా స్పందిస్తే రోగుల ఆరోగ్యానికి భరోసా మరింత పెరుగుతుందని ఆకాంక్షించారు.

**గిరిజన ప్రాంతాల్లో అరుదైన శస్త్రచికిత్సలు**

గిరిజన ప్రాంతమైన రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో టీచింగ్ ఆసుపత్రుల స్థాయి శస్త్రచికిత్స టోటల్ నీ రీప్లేస్‌మెంట్ విజయవంతంగా జరిగింది. అలాగే చింతపల్లి ఏరియా ఆసుపత్రిలో రెక్టల్ ప్రొలాప్స్ (మలద్వారం నుంచి పేగు బయటకు రావడం) శస్త్రచికిత్స విజయవంతమైంది. అదే ఆసుపత్రిలో గర్భాశయం వద్ద భారీ కణితితో



బాధపడుతున్న మహిళకు హిస్టరెక్టమీ శస్త్రచికిత్స కూడా నిర్వహించారు.

**అరకులో 9 కిలోల కణితి తొలగింపు**

అరకు ఏరియా ఆసుపత్రిలో ఓ మహిళ కడుపు నుంచి ఏకంగా 9 కిలోల కణితిని విజయవంతంగా తొలగించారు. ఇది సెకండరీ ఆసుపత్రుల స్థాయిలో అత్యంత సాహసోపేతమైన శస్త్రచికిత్సగా నిలిచింది.

**సిజేరియన్ తర్వాత సహజ ప్రసవం**

అన్నమయ్య జిల్లా రాజంపేట ఏరియా ఆసుపత్రి వైద్యులు మరో విజయం సాధించారు. తొలి కాన్పు సిజేరియన్ విధానంలో జరిగిన మహిళ రెండో కాన్పుకు వచ్చినప్పుడు -ఆమెకు సహజ ప్రసవం జరిగేలా వైద్యులు, నర్సులు కలిసి కృషి చేసి లక్ష్యం సాధించారు. అనకాపల్లి జిల్లా ఆసుపత్రిలో అయితే 4.8 కిలోల బరువున్న శిశువు సహజ ప్రసవం ద్వారా జన్మించింది.

**స్కిన్ ట్రాన్స్‌ప్లాంట్, అరుదైన హెర్నియా శస్త్రచికిత్సలు**

అనకాపల్లి జిల్లా నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో ఓ రోగికి అరుదైన స్కిన్ ట్రాన్స్‌ప్లాంట్ శస్త్రచికిత్స జరిగింది. రోగి శరీరంపై 26% చర్మాన్ని ఒక చోట తొలగించి మరో చోట అమర్చారు. ఇదే ఆసుపత్రిలో అరుదైన స్పైజిలియన్, ఆబురేటర్, సయాటిక్ హెర్నియా రిపేర్లు కూడా విజయవంతమయ్యాయి. తెనాలి జిల్లా ఆసుపత్రిలో వేర్వేరు ప్రమాదాల్లో గాయపడిన ఇద్దరు మహిళలకు సంక్లిష్ట శస్త్రచికిత్సలు నిర్వహించి ఆర్థో వైద్యులు ప్రాణాలు కాపాడారు.

**16 నెలల్లో 511 కంటి శస్త్రచికిత్సలు**

ఎమ్మిగనూరు ఏరియా ఆసుపత్రిలో కంటి వైద్యులు 16 నెలల వ్యవధిలో 511 క్యాటరాక్ట్ శస్త్రచికిత్సలు నిర్వహించి అసాధారణ కృషి చేశారు.

**ధర్మవరంలో లాప్రోస్కోపిక్ సర్జరీలు**

ధర్మవరం ఏరియా ఆసుపత్రిలో కేవలం 10 రోజుల్లో 4 లాప్రోస్కోపిక్ శస్త్రచికిత్సలు విజయవంతమయ్యాయి. రూ. 37 లక్షల విలువైన అత్యాధునిక లాప్రోస్కోపిక్ పరికరాలు ఇక్కడ అందుబాటులో ఉండటంతో కుట్లు లేని ఈ శస్త్రచికిత్సల ద్వారా రోగులు వేగంగా కోలుకుంటున్నారు.

**జాతీయ కార్యక్రమాల్లో ఉత్తమ పనితీరు**

జాతీయ ఆరోగ్య కార్యక్రమాలైన అభా, ఎన్‌క్వాస్, ఎన్‌బీఎస్‌సీయూ, ఎస్‌ఎన్‌సీయూ, ఎన్‌సీడీ తదితర కార్యక్రమాల అమలులో 18 ఆసుపత్రులు ఉత్తమ ప్రతిభ కనబరిచాయి. వాటిలో ధర్మవరం ఏరియా ఆసుపత్రి, పార్వతీపురం జిల్లా ఆసుపత్రి, ఎంసీహెచ్ ఆదోని, అనపర్తి ఏరియా ఆసుపత్రి, పెద్దాపురం సీహెచ్‌సీ, అనకాపల్లి జిల్లా ఆసుపత్రి ముఖ్యమైనవి.

చైతన్యరథం

## చంద్రబాబు పాలనలోనే

# బడుగులకు నాణ్యమైన వైద్యం

- ముఖ్యమంత్రి సహాయ నిధితో పేదలకు ఆర్థిక భరోసా
- రాష్ట్రాభివృద్ధి, పేదల సంక్షేమమే కూటమి ధ్యేయం
- ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

అద్దంకి (చైతన్య రథం): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలనలోనే బడుగు, బలహీన వర్గాలకు నాణ్యమైన విద్య, వైద్యం అందుతుందని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. మంత్రి గొట్టిపాటి శనివారం అద్దంకి నియోజకవర్గంలో పర్యటించారు. ముందుగా సంతమాగులూరు మండలంలోని పుట్టావారిపాలెం క్యాంప్ కార్యాలయంలో 140మంది సీఎంఆర్‌ఎఫ్ లబ్ధిదారులకు రూ.62,02,865., విలువైన చెక్కులు, ఎల్‌ఓసీలను మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ



నిధి సహాయంతో పేదలకు ఆర్థిక భరోసా లభిస్తుందన్నారు. రాష్ట్ర అభివృద్ధి, పేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం పాలన సాగుతుందన్నారు. అద్దంకి నియోజకవర్గంలోనే ఇప్పటి వరకు 3078 మందికి రూ.25.93 కోట్ల విలువైన చెక్కులు, ఎల్‌ఓసీలను అందజేసినట్లు ఆయన వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా వందల కోట్ల రూపాయిల సీఎంఆర్‌ఎఫ్ నిధులతో లక్షలాది మంది లబ్ధిపొందారని తెలిపారు.

**తాగునీటి సరఫరాకు వాటర్ ట్యాంకర్లు..**

అద్దంకి పర్యటనలో భాగంగా స్థానిక రిజిస్టార్ కార్యాలయాన్ని మంత్రి గొట్టిపాటి సందర్శించారు. ఉద్యోగుల కార్యాకలాపాలు, విధులు, ప్రజలకు అందుతున్న సేవలు, ఇతర అంశాలపై ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. భవన స్థితిగతులపైనా మంత్రి ఆరా తీశారు. ప్రభుత్వానికి మంచి పేరు తీసుకు వచ్చే విధంగా కార్యాలయాలకు వచ్చే ప్రజలకు సేవలందించాలని సిబ్బందికి ఆయన సూచించారు. అనంతరం అద్దంకి మున్సిపాలిటీలో తాగునీటి సరఫరా కోసం అధికారులు ఏర్పాటు చేసిన రెండు వాటర్ ట్యాంకర్లను మంత్రి గొట్టిపాటి ప్రారంభించారు. వేసవితో పాటు, రాబోయే రోహిణీ కార్తెలో ప్రజలకు ఎటువంటి తాగునీటి ఇబ్బందులూ లేకుండా సరఫరా ఉండేలా చూడాలని అధికారులకు స్పష్టం చేశారు. అదే విధంగా అద్దంకి టౌన్ లో ప్రజలకు ఇబ్బంది లేకుండా చలి వేంద్రాలుతో పాటు మజ్జిగ పంపిణీ చేయించాలని సూచించారు. కార్యక్రమంలో కూటమి నేతలతో పాటు అధికారులు పాల్గొన్నారు.

# దివ్యాంగుల జీవితాల్లో చంద్రబాబు వెలుగులు

***మార్కాపురంలో దివ్యాంగులకు త్రీ వీలర్ బైక్‌ల పంపిణీ : మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి***



మార్కాపురం (చైతన్య రథం): దివ్యాంగులకు మేలు చేసే విషయంలో సీఎం చంద్రబాబు నాయుడు ఎప్పుడూ ముందే ఉంటారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి స్పష్టం చేశారు. శనివారం మార్కాపురం జిల్లా మార్కాపురంలో దివ్యాంగులకు ఉచితంగా త్రీ వీలర్ మోటార్ బైక్‌లు మంత్రి డిఎస్ బీవీ స్వామి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... దివ్యాంగులకు మేలు చేసే విషయంలో సీఎం చంద్రబాబు ఎప్పుడూ ముందే ఉంటారు. రూ.17.5 కోట్లతో రాష్ట్రంలో 1750 మంది దివ్యాంగులకు ఉచితంగా త్రీ వీలర్ బైక్‌లు పంపిణీ చేస్తున్నాం. దేశంలో ఎక్కడాలేని విధంగా పెద్ద మొత్తంలో దివ్యాంగులకు ప్రతి నెలా రూ.6 వేలు, రూ.15 వేలు పింఛన్ ఇస్తున్నాం. దివ్యాంగ శక్తి పథకంతో దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాం. చరిత్రలో ఎన్నడు లేని విధంగా రూ. 4.38 కోట్లతో దివ్యాంగ హాస్టళ్లకు మరమ్మతులు చేస్తున్నాం. దివ్యాంగుల కోసం బాపట్లలో ప్రత్యేకంగా డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేస్తున్నాం. దివ్యాంగుల కోసం విశాఖలో రూ. 200 కోట్లతో పారా స్పోర్ట్స్ స్టేడియం నిర్మిస్తున్నాం. ప్రతి జిల్లాలో దివ్యాంగ భవన్ లు నిర్మిస్తాం. దివ్యాంగ బ్యాక్లాగ్ పోస్టులు భర్తీ చేస్తున్నాం, త్వరలో నియామక పత్రాలు అందజేస్తాం. దివ్యాంగుల కోసం కలెక్టరేట్లలో ప్రత్యేకంగా లిఫ్ట్ లు ఏర్పాటు చేస్తున్నాం. దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపే ఇంద్రధనస్సు హామీలన్నీ అమలు చేస్తాం. విభిన్న ప్రతిభావంతులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు డిసబుల్ కమిషన్ ఏర్పాటు చేసినట్లు త్వరలో దీనికి పూర్తి స్థాయి అధికారులను నియమిస్తాం. అంతేకాకుండా ప్రతి జిల్లాలో ఆటిజం సెంటర్లు ఏర్పాటు చేసి వాటికి ప్రత్యేక డాక్టర్లను నియమిస్తామని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తెలిపారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల -వయోవృద్ధుల సహాయ సంస్థ చైర్మన్ జి. నారాయణస్వామి, మార్కాపురం గిద్దలూరు, కనిగిరి ఎమ్మెల్యేలు కందుల నారాయణరెడ్డి, ముత్తుముల అశోక్ రెడ్డి, ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, ఎర్రగొండపాలెం తెదేపా ఇన్చార్జి గూడూరు ఎరిక్షన్ బాబు, జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, డిఆర్‌ఓ వెంకట శివరామిరెడ్డి, ఆర్డీవో ప్రభాకర్, డిజేబుల్ వెల్ఫేర్ ఏడి సువార్తమ్మ, జనసేన ఇన్చార్జి ఇమ్మడి కాశీనాథ్, భాజపా జిల్లా అధ్యక్షులు కృష్ణారావు, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఫోర్జరీతో పట్టా భూమి మాయం!

- మాజీ సర్పంచ్‌పై గ్రీవెన్స్‌లో ఫిర్యాదు
- వారసత్వ భూమిని అక్రమంగా ఆన్‌లైన్..
- "దిక్కున్న చోట చెప్పుకో"మంటూ బెదిరింపులు
- పసుపు-కుంకుమల భూమిపై మరిది కన్ను..
- పొలానికి దారివ్వకుండా అన్నదమ్ముల వేధింపులు..
- ప్రజలనుంచి అర్జీలు స్వీకరించిన మంత్రి అనగాని
- భూవివాదాలు, అన్యాయాల పరిష్కారానికి గ్రీవెన్స్ పెద్దపీట

మంగళగిరి (చైతన్య రథం): టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాలనుంచి వచ్చిన పలువురు పౌరులు తమ భూవివాదాలు, అన్యాయాలపై అర్జీలు సమర్పించారు. రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, ఏపీ షెడ్యూల్డ్ ట్రైబ్స్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు అర్జీలను స్వీకరించి.. సమస్యల పరిష్కారానికి కృషి చేశారు.

**నకిలీ సంతకాలతో పట్టా భూమి కాజేత**

పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా బోగోలుకు చెందిన పద్మలత తమ పూర్వీకులనుంచి వారసత్వంగా వచ్చిన సర్వే నంబర్లు 188, 189/2లోని పట్టా భూమిని స్థానిక మాజీ సర్పంచ్ అనుచరులు అక్రమంగా హస్తగతం చేసుకున్నారని ఆరోపించారు. తమ ప్రమేయం లేకుండా నకిలీ సంతకాలు సృష్టించి రెవెన్యూ రికార్డుల్లో ఆ భూమిని 'గ్రామకంఠం' కింద మార్చి, తమ పేర్లపై రిజిస్ట్రేషన్ కూడా చేయించుకున్నారని వివరించారు. దీనికి సంబంధించిన అధికారిక రిజిస్ట్రేషన్ నకలును ఆధారంగా సేకరించామని, వారిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని నేతలను కోరారు.

**బంధువుల బెదిరింపులతో పొలానికి వెళ్లలేకపోతున్నాం**

మార్కాపురం జిల్లా రాచర్ల మండలం చెర్లోపల్లి గ్రామానికి చెందిన పాశం రవి సర్వే నంబర్ 938/38లోని ఒక ఎకరం వ్యవసాయ భూమి వివాదాన్ని వినతిపత్రంలో వివరించారు. తాత నుంచి తండ్రికి, తండ్రి నుంచి తనకు వారసత్వంగా సంక్రమించిన ఈ భూమిని తమ కుటుంబమే సాగు చేసుకుంటోందని పేర్కొన్నారు. అయితే తన తండ్రికి బంధువులయ్యే యాళూరి మర్రిరెడ్డి, యాళూరి తిరుపతిరెడ్డి అక్రమంగా ఆన్‌లైన్‌లో భూమిని తమ పేర్లపై మార్చుకున్నారని ఆరోపించారు. తాను నిలదీయగా "ఎక్కడైనా చెప్పుకో, పేర్లు తీయం" అంటూ బెదిరిస్తున్నారని వాపోయారు. వీరిలో ఒకరు గిద్దలూరు డిపోలో ఆర్టీసీ కండక్టర్‌గా పనిచేస్తూ తన పలుకుబడిని దుర్వినియోగం చేస్తున్నారని అభియోగం మోపారు.

**పుట్టింటి ఆస్తిపై మరిది వేధింపులు**

కృష్ణా జిల్లా కృత్తివెన్ను మండలం పెద్ద చందాలి గ్రామానికి చెందిన బసాని వీర్ల వెంకమ్మ తన పుట్టింటి వారు 1976లో పసుపు-కుంకుమల కింద రాసిచ్చిన 35 సెంట్ల భూమిపై మరిది భవానీ పూర్ణచంద్రరావు వేధింపులకు పాల్పడుతున్నాడని వినతిపత్రంలో తెలిపారు. ఆ ఆస్తిపై ఎలాంటి హక్కు లేకపోయినా శారీరకంగా, మానసికంగా తీవ్రంగా వేధిస్తూ ప్రాణాపాయం కలిగిస్తున్నాడని ఆందోళన వ్యక్తం చేశారు. తమ కుటుంబానికి ప్రశాంతత కరువైందని, వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

**అన్నదమ్ముల అడ్డంకి... నాలుగేళ్లుగా పంట వేయలేదు**

ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి మండలం మంగోల్లు గ్రామానికి చెందిన నంబూరి లక్ష్మీనారాయణ తమ పొలానికి దారి లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. తండ్రి పంచిన 1.60 ఎకరాల భూమిలో తనకు దక్కిన క్రింది భాగానికి అన్నదమ్ముల పొలం గుండా వెళ్లాల్సి ఉంటుందని, కుటుంబ గొడవల కారణంగా గత నాలుగేళ్లుగా వారు దారి అడ్డుకుంటున్నారని పేర్కొన్నారు. కూలికి వచ్చిన వారిని కూడా బెదిరించి వెళ్లగొడుతున్నారని చెప్పారు. 25-12-2024న వత్సవాయి పోలీస్ స్టేషన్‌లో వీడియో ఆధారాలతో ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు కేసు నమోదు కాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**పట్టా ఉన్నా స్థలం అప్పగించని అధికారులు**

సత్యసాయి జిల్లా ఆమడగూరు మండలం కమ్మవారిపల్లె గ్రామానికి చెందిన పద్మావతి 2014లో ప్రభుత్వం కేటాయించిన 2 సెంట్ల నివాస పట్టాకు సంబంధించిన వ్యవహారాన్ని వినతిపత్రంలో వివరించారు. పక్క గ్రామానికి చెందిన తోటి అక్కులప్ప, నరసమ్మ దంపతులు ఆ స్థలంపై వివాదం లేపారని, 2021 నుంచి పలు కార్యాలయాల్లో అర్జీలిచ్చినా ప్రయోజనం లేకపోయిందని తెలిపారు. 2023లో పొజిషన్ పట్టా ఇచ్చినా క్షేత్రస్థాయిలో స్థలం అప్పగించలేదని, రాజీ కోసం రూ. 60,000 చెల్లించినా ఆ మహిళ మళ్లీ బెదిరింపులకు దిగుతోందని వాపోయారు. సరిహద్దు రాళ్లు, గోడలు కూల్చివేసి ఆక్రమణకు ప్రయత్నిస్తున్నారని, నిరుపేద కుటుంబంగా రూ. 20,000కు పైగా ఖర్చయినా న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.



**సొంత తమ్ముడే నట్టేట ముంచాడు**

ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం కొణిజెర్ల గ్రామానికి చెందిన రామయ్య తనకు ఎదురైన మోసాన్ని వివరించారు. వ్యవసాయ నష్టాలు, అప్పుల కారణంగా ఆర్థిక ఇబ్బందుల్లో ఉండగా, బ్యాంకు రుణం పొందేందుకు సొంత ఇంటిని తమ్ముడు కంచేటి వెంకటేశ్వర్లు పేరుపై రిజిస్ట్రేషన్ చేశామని తెలిపారు. పెద్దమనుషుల సమక్షంలో జరిగిన ఒప్పందం మేరకు 28-04-2026న రూ. 2,00,000 రుణం మంజూరై తమ్ముడి ఖాతాలో జమ అయిందని, కానీ డబ్బులు చేతికి రాగానే తమ్ముడి బుద్ధి మారిందని ఆరోపించారు. "ఈ డబ్బులకు నీకు సంబంధం లేదు" అని పిల్లలతో కలిసి వేధిస్తున్నాడని తెలిపారు. ఒప్పంద పత్రాలు తన దగ్గర ఉన్నాయని, న్యాయం చేయాలని కోరారు.

**కోర్టు తీర్పు ఉన్నా ఫైలు ముందుకు కదలడం లేదు**

పల్నాడు జిల్లా దుర్గికి చెందిన రామావత్ శ్రీను నాయక్ అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలంలోని 1.95 ఎకరాల భూమి రిజిస్ట్రేషన్ వ్యవహారాన్ని వినతిపత్రంలో పేర్కొన్నారు. కొనుగోలు చేసిన తర్వాత విక్రేత మరణించడంతో వారసులపై దావా వేయగా 23-01-2021న కోర్టులో రాజీ కుదిరిందని తెలిపారు. కింది స్థాయి రెవెన్యూ అధికారులందరూ రిజిస్ట్రేషన్‌కు అనుకూలంగా నివేదికలు సమర్పించినా పాడేరు ఆర్డీఓ కార్యాలయంలో ఫైలు నిలిచిపోయిందని ఆవేదన చెందారు. కార్యక్రమంలో భూవివాదాలతో పాటు పెన్షన్లు, రేషన్ కార్డులు, ఇళ్ల నిర్మాణాలు, అనారోగ్య సమస్యలపై పలువురు అర్జీలు సమర్పించారు. మరికొందరు ఉద్యోగాల కోసం రెజ్యూమేలు అందజేశారు. నేతలు అర్జీలను స్వీకరించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# శిథిలాలు మాట్లాడుతున్నాయి!

## వైఎస్ రాజారెడ్డి ఫ్యాక్షన్ విధ్వంసానికి 35 ఏళ్ల తర్వాత ఫొటో సాక్ష్యాలు

## పార్నపల్లి బాంబు దాడికి ఆధారాలు చూపిన మంత్రి పయ్యావుల

మంగళగిరి (చైతన్య రథం): నడిరాత్రి వేళ... ప్రశాంతంగా నిద్రిస్తున్న ఆ పల్లెటూరు ఒక్కసారిగా గుండెలు పేలిపోయే శబ్దంతో ఉలిక్కిపడింది. భూమి కంపించింది. ఆకాశాన్ని తాకేలా ఎగసిపడిన మంటలు, క్షణాల్లో దట్టమైన పొగ ఆ ప్రాంతాన్ని కమ్మేసాయి. యుద్ధ విమానాలు దాడి చేసినట్టుగా... క్షణాల్లో ఇళ్లు నేలమట్టమైపోయాయి. ఈ దృశ్యాలలోని ఈ నిశ్శబ్ద ఛాయాచిత్రాలు, దశాబ్దాల క్రితం జరిగిన ఒక భయంకర రాత్రివేళ సాగిన నరమేధానికి, విధ్వంసానికి మూగ సాక్ష్యాలు. ఆ దృశ్యాలను నిశితంగా గమనిస్తే గుండె జలదరిస్తుంది.

ఒకప్పటి అందమైన ఇల్లు.. ప్రత్యర్థుల బాంబుల ధాటికి కేవలం ఇటుకలు, సిమెంట్ ముక్కల కుప్పగా మారింది. శత్రువుల ఇళ్లను కూల్చడం కాదు, వారి ఉనికిని సైతం భూస్థాపితం చేయాలనే క్రూరత్వం ఆ శిథిలాల్లో కనిపిస్తోంది. లోపలి పడకగదిలోని దృశ్యం మరింత భీతావహంగా ఉంది. ఒకపక్క విరిగిపోయిన మంచం... దానికి సరిగ్గా వెనుక ఉన్న గోడకు ఒక భారీ రంధ్రం. డైనమైట్ల తీవ్రతకు దృఢమైన గోడలు సైతం తట్టుకోలేక తునాతునకలయ్యాయి. ఆ రంధ్రం గుండా అవతలి శూన్యం కనిపిస్తుంటే, ఆ సమయంలో అక్కడ ఉన్న అమాయకులు ఏమైపోయారో అనే ఊహే ఒళ్లు గగుర్పొడిచేలా చేస్తుంది. ఇంటి బయట పడివున్న ఒక మోటార్ సైకిల్... పేలుడు ధాటికి ఇనుప ముక్కల కుప్పలా నలిగిపోయింది. ఒక వాహనమే అంతలా ఛిద్రమైందంటే, ఆ పేలుడు సృష్టించిన ఇంపాక్ట్ ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇదేదో తెలుగు ఫ్యాక్షన్ యాక్షన్ సినిమాలోని సీనో, లేదా నక్సల్స్ /టెర్రరిస్టుల దాడో కాదు. ఒకప్పుడు రాయలసీమను పట్టి పీడించిన రాక్షస ఫ్యాక్షనిజం సృష్టించిన భీభత్సం.

**తెరవెనుక అసలు సూత్రధారులు...**


ఈ దారుణ విధ్వంసం వెనుక ఉన్న ఆ క్రూర



చారిత్రక సత్యాన్ని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ఈ ఫోటోల ద్వారా బహిర్గతం చేశారు. ఈ భీభత్సానికి కారణం మరెవరో కాదు... నాటి పులివెందుల ఫ్యాక్షన్ లీడర్ వైఎస్ రాజారెడ్డి. దాదాపు 40 ఏళ్ల క్రితం, తనకు మరియు తన కొడుకు రాజకీయ భవిష్యత్తుకు అడ్డు వస్తున్నారనే ఒకే ఒక్క కారణంతో, లింగాల మండలం పార్నపల్లిలో టీడీపీకి చెందిన జొన్నలగడ్డ సోదరులు సత్యనారాయణ, సూర్యనారాయణల ఇళ్లను డైనమైట్లతో పేల్చివేయించిన ఘాతుకానికి ఇవే సజీవ సాక్ష్యాలు!

నేడు వైఎస్ రాజారెడ్డి వర్ధంతి సందర్భంగా బయటపడిన ఈ భయంకరమైన విజువల్స్, ఒకప్పుడు వైఎస్ కుటుంబం సాగించిన బాంబుల సంస్కృతిని, నాడు రాయలసీమ గడ్డపై సాగిన అరాచక పాలనను మరోసారి కళ్లముందు ఉంచుతున్నాయి. పులివెందులలో వైఎస్ రాజారెడ్డి రౌడీ, హత్యా రాజకీయాలపై వివరాలు వెల్లడించిన మంత్రి పయ్యావుల కేశవ్ –అనంతరం ఈ చిత్రాలను విడుదల చేశారు. క్రిమినలైజేషన్ ఆఫ్ పాలిటిక్స్‌కు వైఎస్ రాజారెడ్డే ఆద్యుడంటూ మంత్రి కేశవ్ విమర్శలు గుప్పించారు. నాటి అరాచక విధ్వంసకాండకు.. బాంబుల సంస్కృతికి ఇవిగో సాక్ష్యాలంటూ మూడున్నర దశాబ్దాల క్రితం జరిగిన ఘటనకు చెందిన ఫోటోలను మంత్రి పయ్యావుల మీడియాకు రుజువులిచ్చారు.











## విలువలున్న మనుషులే బలమైన సమాజాన్ని నిర్మిస్తారు

### ‘ఆర్ట్ ఆఫ్ లివింగ్’ వేదికపై మంత్రి కొల్లు రవీంద్ర

బెంగళూరు (చైతన్యరథం): బెంగళూరులోని అంతర్జాతీయ ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఇంటర్నేషనల్ సెంటర్లో జరిగిన ప్రత్యేక సత్సంగంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎక్సైజ్, గనులు, భూగర్భ శాఖ ల మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొన్నారు. ‘ది ఆర్ట్ ఆఫ్ లివింగ్’ సంస్థ స్థాపించి 45 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని, సంస్థ వ్యవస్థాపకులు, ఆధ్యాత్మిక గురువు రవిశంకర్ 70వ జన్మదిన వేడుకల్లో భాగస్వామ్యమవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ విలువలున్న మనుషులే బలమైన సమాజాన్ని, బలమైన దేశాన్ని నిర్మిస్తారన్నారు. 2014 నాటి రాష్ట్ర విభజన సమయంలో తలెత్తిన సంక్లిష్ట సమస్యల పరిష్కారానికి గురుదేవ్ రవిశంకర్ అందించిన అమూల్యమైన సూచనలు తమలో నూతనోత్తేజం నింపాయని గుర్తు చేసుకున్నారు. 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు తాము గురుదేవుల ఆశీస్సులు తీసుకున్నామని, సుమారు 50 వేల ఓట్ల భారీ మెజారిటీతో చారిత్రాత్మక విజయాన్ని అందుకోగలిగానని మంత్రి సంతోషం వ్యక్తం చేశారు.

“ప్రతి ఒక్కరిలోనూ ఒక అంతర్గత శక్తి దాగి ఉంటుంది, దాన్ని సరైన సమయంలో గుర్తించడమే



మనిషికి అసలైన పరీక్ష... మన జీవితంలో ఎంత మందిని స్పృశించాం, ఎంతమంది మనస్సులను బలోపేతం చేశాం, సమాజంలో ఎలాంటి మార్పు తీసుకువచ్చామనేదే మనకు అసలైన సంతృప్తి ఇస్తుంది.” అని రవీంద్ర అన్నారు.

ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఐటీ మంత్రి నారా లోకేష్ గురుదేవుల జ్ఞానాన్ని, వారి విలువైన సందేశాలను దేశ నిర్మాణానికి బలమైన పునాదిగా మార్చుకున్నారని కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. తన సొంత నియోజకవర్గమైన మచిలీపట్నంలో మరోసారి పర్యటించాలని గురుదేవులకు మంత్రి హృదయపూర్వక ఆహ్వానం పలికారు.

## కుటుంబంతో ప్రధాని మోదీని కలిసిన కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు



న్యూఢిలీ(చైతన్యరథం): కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు శనివారం కుటుంబంతో కలిసి ప్రధాని నరేంద్ర మోదీని కలిశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి తల్లి ప్రధాన మంత్రికి మొక్కను బహుకరించారు. కుటుంబంతో కలిసి ప్రధాని మోదీని కలవటంపై కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఎక్స్‌లో ఓ భావోద్వేగ పోస్ట్ పెట్టారు. ఆ పోస్టుల ‘ఈ రోజు మా కుటుంబానికి జీవితాంతం గుర్తుండిపోయే ఓ భావో ద్వేగ క్షణం. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కుటుంబ సమేతంగా కలిసే అదృష్టం కలగడం ఎంతో ఆనందంగా, గర్వం గా భావిస్తున్నాను. ఆయన అసాధారణ వ్యక్తిత్వం, ఆప్యాయత మా కుటుంబంలోని మూడు తరాలను ఒకేలా ఆకట్టుకుంది. ప్రజల హృదయాల్లో ఆయన ఎందుకు అపారమైన ఆదరణ పొందారో ఆ క్షణంలో మరింత స్పష్టంగా తెలిసింది. ప్రత్యేకంగా.. ‘ఏక్ పేడ్ మా కే నామ్’ అనే మహత్తర ఆలోచనకు ప్రేరణగా నా తల్లి ప్రధానమంత్రికి మొక్కను బహుకరించడం మా కుటుంబానికి ఎంతో మధురమైన, గర్వకారణమైన క్షణంగా నిలిచిపోతుంది. ఆయన చూపిన ప్రేమ, ఆప్యాయత, ఆశీస్సులకు మేమెప్పటికీ కృతజ్ఞులమే. మాతో గడిపిన అమూల్యమైన సమయానికి వారికి హృదయపూర్వక ధన్యవాదాలు’ అని తన ఆనందాన్ని పంచుకున్నారు.

# సామాజిక బాధ్యతతోనే వర్చువల్ విధానంలో మహానాడు నిర్వహణ

●ప్రధాని మోదీ పిలుపుకు స్పందనగా చారిత్రాత్మక నిర్ణయం

●ప్రతి క్లస్టర్‌లో పసుపు జెండా రెపరెపలాడాలి... మహానాడు విజయవంతం చేయాలి

●నాయకులకు కార్యకర్తలకు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దిశానిర్దేశం



నిమ్మాడ (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ నెల 27, 28 తేదీల్లో నిర్వహించే మహానాడు కార్యక్రమాన్ని ఈసారి సామాజిక బాధ్యత, ఇంధన పొదుపు, పర్యావరణ పరిరక్షణ లక్ష్యాలతో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ వర్చువల్ విధానంలో నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు మహానాడు నిర్వహణపై కీలక దిశానిర్దేశం చేశారు. దేశవ్యాప్తంగా ఇంధన సంరక్షణపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు, లక్షలాది మంది కార్యకర్తలు ఒకేచోటికి ప్రయాణించే పరిస్థితిని తగ్గిస్తూ, పర్యావరణ హిత దృక్పథంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. నెల్లూరులో భారీ స్థాయిలో మహానాడు నిర్వహణకు ఇప్పటికే ఏర్పాట్లు చేసినప్పటికీ, ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో హైబ్రిడ్ విధానాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 1,848 క్లస్టర్లలో భారీ ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేసి, అమరావతిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి జరిగే మహానాడు కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్లు వెల్లడించారు. ప్రతి నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని మహానాడును "పసుపు పండుగ"లా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. "ప్రతి క్లస్టర్ కేంద్రం పండుగ వాతావరణంలో కనిపించాలి... పసుపు జెండాలు, ఫ్లెక్సీలు, పార్టీ ఆత్మగౌరవాన్ని ప్రతిబింబించేలా ఏర్పాట్లు చేయాలి. కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం నింపేలా మహానాడు నిర్వహించాలి" అని అచ్చెన్నాయుడు సూచించారు. మహానాడులో పార్టీ భవిష్యత్ కార్యాచరణ, రాష్ట్ర పునర్నిర్మాణం, అభివృద్ధి, యువతకు ఉపాధి అవకాశాలు, రైతు సంక్షేమం, సాంకేతిక అభివృద్ధి, దేశ ప్రగతి వంటి కీలక అంశాలపై చర్చలు జరుగుతాయని తెలిపారు. మహానాడులో ప్రవేశపెట్టే 19 కీలక తీర్మానాలకు పార్టీ పొలిట్‌బ్యూరో ఇప్పటికే ఆమోదం తెలిపిందన్నారు. ప్రతి వక్త తనకు కేటాయించిన అంశంపై స్పష్టంగా, సంక్షిప్తంగా మాట్లాడాలని సీఎం చంద్రబాబు సూచించినట్లు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలు, ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లే వేదికగా ఈ మహానాడు నిలవబోతుందని పేర్కొన్నారు. నియోజకవర్గ స్థాయిలో క్లస్టర్ల వారీగా సమన్వయం పెంచుకొని, ప్రతి కార్యకర్త బాధ్యతగా పని చేసి మహానాడును చారిత్రాత్మక విజయంగా నిలపాలని మంత్రి అచ్చెన్నాయుడు పిలుపునిచ్చారు.

# అమదాలవలసలో ఆపరేషన్ క్లీన్ స్వీప్... పాల్గొన్న కూన



ఆమదాలవలస (చైతన్యరథం): ఆమదాలవలస మున్సిపాలిటీలోని జగ్గు శాస్త్రులపేట డంపింగ్ యార్డ్‌లో రూ.1.62 కోట్లతో నిర్మించనున్న ఆధునిక కంపోస్టింగ్ యూనిట్కు ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ శనివారం శంకుస్థాపన చేశారు. పట్టణ పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే అన్నారు. చెత్తను శాస్త్రీయ పద్ధతుల్లో నిర్వహించి, వ్యర్థాలను సేంద్రియ ఎరువులుగా మార్చేందుకు ఈ యూనిట్ ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్పర్సన్ తమ్మినేని గీతా విద్యాసాగర్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

**చెత్త తొలగింపుకు చర్యలు**

పారిశుద్ధ్య నిర్మూలనే ప్రధాన ధ్యేయమని ఆమదాలవలస మున్సిపల్ కమిషనర్ తమ్మినేని రవి అన్నారు. స్థానిక మున్సిపాలిటీ పరిధిలో శనివారం అధికారులతో కలిసి 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం స్థానికంగా ఉన్న రహదారులపై పేరుకుపోయిన చెత్తను తొలగించి పరిశుభ్రత చర్యలు చేపట్టారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కమిషనర్ సూచించారు.

# పరిసరాలను శుభ్రం చేసిన ఎమ్మెల్యే గంటా... ఎమ్మెల్సీ నాగబాబు



సింహాచలం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునే దిశగా ప్రజలను చైతన్యం చేయాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. సింహాచలం సమీపంలోని భైరవవాక ఆలయ పరిసరాల్లో క్లీన్ స్వీప్ స్వచ్ఛత కార్యక్రమంలో ఎమ్మెల్సీ కొణిదల నాగబాబుతో కలిసి శనివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వినియోగం ఎంత ప్రమాదకరమో పాఠశాల దశ నుంచే విద్యార్థులందరికీ తెలియజెప్పాల్సిన అవసరం ఉందన్నారు. క్లీన్ స్వీప్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ప్రతి రోజు వేలాది మంది భక్తులు భైరవవాక ఆలయ దర్శనానికి వస్తున్న నేపథ్యంలో వారికి కనీస సౌకర్యాలు కల్పించాల్సిన అవసరముందని నాగబాబు పేర్కొన్నారు. అటవీ శాఖ నిబంధనల కారణంగా ఆలయ పరిసరాల్లో ఎలాంటి పనులు చేసే అవకాశం లేకుండాపోయిందని గంటా తెలిపారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని నాగబాబు పేర్కొన్నారు. ప్లాస్టిక్ సంచుల స్థానంలో గుడ్డ సంచులు వాడాలన్నారు. పారిశుద్ధ్య కార్మికులతో కలిసి చీపుర్లతో ఆలయ పరిసరాల్లో ఉన్న చెత్తను గంటా, నాగబాబు, సిబ్బందితో కలిసి శుభ్రం చేశారు.

# అరీలోవ ప్రాంత ప్రజలకు మెరుగైన తాగునీటి సౌకర్యం



విశాఖపట్నం తూర్పు (చైతన్యరథం): జోన్ పరిధిలోని అరీలోవ వార్డు నెం.12లో ఉన్న దీనదయాళపురం ప్రాంత ప్రజలకు మెరుగైన తాగునీటి సరఫరా అందించేందుకు రూ.4 కోట్ల అంచనా వ్యయంతో చేపడుతున్న కీలక తాగునీటి మౌలిక సదుపాయాల అభివృద్ధి మరియు శంకుస్థాపన కార్యక్రమానికి విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్, విశాఖపట్నం తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు హాజరయ్యారు. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా 700 కిలోలీటర్ల సామర్థ్యంతో గ్రౌండ్ లెవెల్ సర్వీస్ రిజర్వాయర్ (GLSR), 200 కిలోలీటర్ల సంప్ కమ్ పంప్ హౌస్ నిర్మాణం చేపట్టనున్నారు. అలాగే 200 మి.మీ మరియు 300 మి.మీ వ్యాసంతో డి.ఐ పైప్‌లైన్ల ద్వారా పంపింగ్ మెయిన్, డెలివరీ మెయిన్ పనులు, హెచ్‌డీపీఈ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ మరియు అనుబంధ మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులు చేపట్టబడనున్నాయి. ఈ ప్రాజెక్ట్ ద్వారా దీనదయాళపురం, చిన్న గదిలి, సాలిపేట, నేతాజీ కాలనీ, నావల్ హాస్పిటల్ పరిసరాలు, సిద్ధార్థ బీసీ కాలనీ మరియు అరీలోవ ప్రాంతాలకు చెందిన సుమారు 5,200 గృహాలకు, దాదాపు 21 వేల జనాభాకు నాణ్యమైన తాగునీరు మెరుగైన ఒత్తిడితో అందుబాటులోకి రానుంది. ప్రాజెక్ట్ పూర్తి అయిన అనంతరం ప్రజలకు స్థిరమైన నీటి నిల్వ సదుపాయాలు కల్పించబడటంతో పాటు తాగునీటి సరఫరా మరింత విశ్వసనీయంగా మారనుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

# భారీ వర్షాలతో దెబ్బతిన్న ప్రాంతాల పరిశీలన

●తక్షణ సహాయం అందించాలని ఎమ్మెల్యే తోయక ఆదేశం



పార్వతీపురం (చైతన్యరథం): మన్యం జిల్లాలో కురిసిన భారీ వర్షాలు, ఈదురుగాలులతో నష్టపోయిన ప్రాంతాలను ప్రభుత్వ విప్ మరియు కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, జిల్లా కలెక్టర్ డా. ఎన్. ప్రభాకర రెడ్డి శనివారం నాడు పరిశీలించారు. పార్వతీపురం మన్యం జిల్లా జియమ్మవలస మండలం అలమండ గ్రామ పంచాయతీ పరిధిలోని చిన్నతోలుమండ గ్రామాన్ని సందర్శించిన వారు ఈదురుగాలులతో దెబ్బతిన్న ఇళ్లు, నేలకూలిన చెట్లు మరియు ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం బాధిత కుటుంబాలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యుత్ సరఫరా త్వరితగతిన పునరుద్ధరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే నష్టపోయిన కుటుంబాలకు తక్షణ సహాయక చర్యలు చేపట్టి అవసరమైన సహాయం అందించాలని సూచించారు. గ్రామాల్లో నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కురుపాం ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వం ఎల్లప్పుడూ బాధిత కుటుంబాలకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రజలు అధికారుల సూచనలు పాటిస్తూ జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ పర్యటనలో ఉమ్మడి విజయనగరం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దొంకాడ రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి బొంగు సురేష్, అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షులు దాసరి రామారావు, మండల కన్వీనర్ జోగి భుంజగరావు, పిఎసిఎస్ చైర్మన్ సోములు మష్టారు, శ్రీరామూర్తి నాయుడు, చంటి, రెవిన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పారదర్శక పాలనతో మెరుగైన ఫలితాలు సాధించాలి

● అధికారులకు వీఎంఆర్డీఏ ఛైర్మన్ ఎం.వి ప్రణవ్‌గోపాల్ సూచన



విశాఖపట్నం (చైతన్యరథం): పారదర్శక పాలనతో మెరుగైన ఫలితాలు సాధించాలని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎం.వి ప్రణవ్ గోపాల్ అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ఉత్తరాంధ్ర అభివృద్ధిలో వీఎంఆర్డీఏ అత్యంత కీలక భూమికను పోషిస్తోందని, ప్రజలందరూ సంస్థ చేపడుతున్న ప్రతిఒక్క అభివృద్ధి కార్యక్రమాన్ని నిశితంగా గమనిస్తున్నందున, గ్రామీణ ప్రాంతల అభివృద్ధిపై కూడా ప్రత్యేక దృష్టిసారించాలని, కాబట్టి నిబంధనల ప్రకారమే ప్రాజెక్టులు పూర్తి చేయాలని సూచించారు. శనివారం సాయంత్రం వీఎంఆర్డీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ శ్రీ తేజ్‌భరత్‌తో కలిసి విభాగాదిపతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఎంఆర్డీఏ అధికారులు ఎంతో నిబద్ధతతో పని చేస్తున్నారని, అంతే వేగంగా పనులు పూర్తి చేయాలని సూచించారు. వీఎంఆర్డీఏ లేఅవుట్‌లలో స్థలాలు కొనుగోలు చేసిన వారికి వెంటనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చిన వినతుల పరిష్కారంలో ఎలాంటి అలసత్వం లేకుండా చూడాలని ఆదేశించారు. పార్కుల నిర్వహణ మెరుగుపడాలని సూచించారు. రహదారుల నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. వీఎంఆర్డీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ శ్రీ తేజ్ భరత్ మాట్లాడుతూ... వీఎంఆర్డీఏ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో, మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనుల కోసం నిధులు కేటాయించామని, ఆయా పనుల ప్రగతిపై ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆదేశించారు. రానున్న రోజుల్లో అధునాతన సాంకేతికను ఉపయోగించుకొని ప్రతి విభాగం ద్వారా సమర్థవంతమైన పాలన అందించటం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రతిపాదించిన ప్రాజెక్టుల అమలు చేయడంపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి మురళీ కృష్ణ, ప్రధాన ఇంజనీర్ వినయ్ కుమార్, పర్యవేక్షక ఇంజనీర్లు మధుసూదనరావు, రాంబాబు, ప్రధాన ప్రణాళికా అధికారిణి దివ్యలత, డిఫ్‌ఓ శిరీష, ముఖ్య గణాంకాధికారి హరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యా వ్యవస్థలో నారా లోకేష్ విప్లవాత్మక మార్పులు : ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తీసుకొచ్చిన సంస్కరణలు ప్రభుత్వ పాఠశాలల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ఢిల్లీ విజ్ఞాన విహార యాత్రకు తీసుకెళ్తానని ఇచ్చిన హామీని నెరవేర్చిన సందర్భంగా శనివారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడారు. ఈ నెల 20న ఢిల్లీ పర్యటనకు వెళ్లిన విద్యార్థులు శుక్రవారం రాత్రి గుంటూరుకు చేరుకున్నారని తెలిపారు. భావి భారత పౌరులకు దేశ రాజధాని, ప్రజాస్వామ్య వ్యవస్థ, దేశ చరిత్ర, అభివృద్ధిపై ప్రత్యక్ష అవగాహన కల్పించాలనే లక్ష్యంతో ఈ యాత్రను నిర్వహించినట్లు చెప్పారు. అనంతరం విద్యార్థులు ఉప రాష్ట్రపతి సీపీ రాధా కృష్ణన్ తో దిగిన ఫోటో ఫ్రేములను విద్యార్థులకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి అందించి వారిని అభినందించారు.

అనంతరం ఎమ్మెల్యే గళ్ళా మాధవి మీడియాతో మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్‌లో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చర్యలు మాకు ఎంతో స్ఫూర్తినిచ్చాయి. విద్యా రంగంలో తీసుకొస్తున్న మార్పులను చూసి మేము కూడా విద్యార్థులకు జీవితాంతం గుర్తుండిపోయే అనుభవం ఇవ్వాలని నిర్ణయించుకున్నాం" అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా విద్యార్థులు ఎర్ర కోట, ఇండియా గేట్, పార్లమెంట్ హాల్, రాజ్యసభతో పాటు పలు జాతీయ ప్రాధాన్యత కలిగిన ప్రాంతాలను సందర్శించారు. ఈ పర్యటన ద్వారా దేశ పరిపాలన, రాజ్యాంగ వ్యవస్థ, ప్రజాస్వామ్య విలువలపై విద్యార్థులకు మరింత అవగాహన పెరిగిందన్నారు.

## ప్రతి క్షణం అందుబాటులో ఉంటాం : ఎమ్మెల్యే నసీర్ వెల్లడి



గుంటూరు (చైతన్యరథం): ప్రజా సమస్యలను పరిష్కరించడంతో చిత్తశుద్ధితో పని చేస్తామని తూర్పు నియోజకవర్గ కూటమి నాయకులు అన్నారు. శనివారం స్థానిక తూర్పు కార్యాలయంలో ఎమ్మెల్యే నసీర్ ఆదేశాల మేరకు కూటమి నాయకుల ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. గతంలో అర్జీలు అందజేసేందుకు వచ్చిన వారికి ప్రస్తుత స్టేటస్ తెలియజేశారు. పింఛన్ల కోసం వినతిపత్రాలు అందించడంతో వెంటనే సంబంధిత అధికారులకు సమాచారమిచ్చారు. దీంతో ఇంటి స్థలాలు, మురుగునీటి సమస్య, విద్యుత్ వంటి అంశాలపై అధికంగా వినతిపత్రాలు దాఖలయ్యాయి. మొత్తం 115 అర్జీలు వచ్చాయని కూటమి నాయకులు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుంటూరు తూర్పు నియోజవకర్గంలో ఎమ్మెల్యే నసీర్ శాసనసభ్యునిగా ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుంచి ప్రతి ప్రాంతంలో అభివృద్ధికి బాటలు వేశారన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహకారంతో అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు చేరువ చేస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యే నసీర్ ప్రజలకు 24 గంటలపాటు అందుబాటులో ఉంటూ ఏ సమస్య వచ్చినా పరిష్కారానికి చొరవ తీసుకుంటున్నారని చెప్పారు. ఆయన సూచనలతో గుంటూరు తూర్పు ప్రజలకు సేవలు అందిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వంలో ఇళ్ల స్థలాల పేరిట సెంటు ముక్కలు ఇచ్చి పేద ప్రజలకు తీవ్ర అన్యాయం చేసిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం త్వరలో పేదలకు ఇంటి స్థలాలు అందించనుందని తెలిపారు. గుంటూరు తూర్పులో అన్ని ప్రాంతాల్లో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం చేపట్టామన్నారు. ఆయా పనుల్లో నాణ్యత ఎప్పటికప్పుడు పరిశీలిస్తామని తెలిపారు. ప్రజలు ఏ సమయంలోనైనా గుంటూరు తూర్పు కార్యాలయానికి రావచ్చని చెప్పారు.

## సకాలంలో పనులు పూర్తి చేయాలి : ఎంపీ బాలశౌరి

మచిలీపట్నం (చైతన్యరథం): కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన నిధులను మంజూరు చేస్తోందని.. సకాలంలో పనులు పూర్తి చేయాలని వివిధ శాఖల అధికారులకు ఎంపీ బాలశౌరి సూచించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మచిలీపట్నం ఎంపీ బాలశౌరి ఆధ్వర్యంలో దిశ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో జిల్లాలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, పెండింగ్లో ఉన్న పనుల పురోగతిపై శాఖల వారీగా జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించి అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నీటిపారుదల, స్త్రీ శిశు సంక్షేమ శాఖలో సాధించిన ప్రగతిపై అధికారులను అభినందించారు. రైతులకు అవసరమైన విత్తనాలు, యూరియా జిల్లాలో సమృద్ధిగా ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. అదనంగా యూరియా అందించడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.



## సీఎం సహాయ నిధి... పేదలకు వరం : ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు



ఉంగుటూరు (చైతన్యరథం): సీఎం సహాయనిధి పేదలకు వరం అని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. ఉంగుటూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 63 మంది బాధితుకు సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ.28,88,409 లక్షల విలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో సీఎంఆర్ఎఫ్ ద్వారా ఇప్పటి వరకు 922 మంది బాధితులకు రూ.6,63,64,101 కోట్లు మంజూరు కృషి చేసినట్లు వివరించారు. పేదల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే ఈ సందర్భంగా తెలిపారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు (చైతన్యరథం): పట్టణానికి చెందిన ఆరుగురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను నియోజకవర్గ శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు శనివారం లబ్ధిదారులకు అందజేశారు. మొత్తం రూ.4.26 లక్షలను అందజేసిన ఆయన... ముఖ్యమంత్రి సహాయ నిధి పేదవారికి ఎంతో సహాయపడుతుందని, అడిగిన వెంటనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సీఎంఆర్ఎఫ్ నిధులు విడుదల చేయడం సంతోషంగా ఉందని, పేదవారు సైతం కార్పొరేట్ వైద్యం అందించాలనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కంఠమణి రామకృష్ణ, సూరపని చిన్ని, భావన రత్నకుమారి, పొట్రు మురళి, పొట్రు శ్రీను, పిల్లలమర్రి మురళి కృష్ణ, పెనుమాక జయరాజు, బొండాడ సత్యనారాయణ, నాలేం శ్రీనివాస్, మారిసెట్టి సతీష్, బత్తిన నాగరాజు, కల్లేపల్లి ప్రభాత్, మారిసెట్టి సతీష్, పోలిశెట్టి శివ తదితరులు పాల్గొన్నారు.



## దేవరపల్లిలో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌కు ఈ నెల 25న శంకుస్థాపన

- వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేయనున్న సీఎం చంద్రబాబు
- రూ.15కోట్లతో 3.30 ఎకరాల్లో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ క్యాంపెక్స్ ఏర్పాటు
- ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



కొత్తపేట (చైతన్యరథం): సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటు ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు కూటమి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. రాష్ట్రంలో 175 పారిశ్రామిక పార్కుల అభివృద్ధి పథకంలో ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక ఎమ్.ఎస్.ఎమ్.ఈ పార్క్ ప్రారంభించేందుకు చేపట్టిన చొరవలో భాగంగా రావులపాలెం మండలం దేవరపల్లిలో రూ.15 కోట్లతో 3.30 ఎకరాల భూమిలో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ క్యాంపెక్స్ అభివృద్ధి చేయనున్నారు. ఈ నెల 25వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వర్చువల్ విధానంలో ఈ కాంప్లెక్స్‌కు శంకుస్థాపన చేయనున్నారు. కొత్తపేట నియోజకవర్గంలో దేవరపల్లి గ్రామంలో రూ.15 కోట్లతో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ క్యాంపెక్స్ ఏర్పాటు చేస్తున్నందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## కడియంలో ఉద్యాన రైతు సౌకర్యాల కేంద్రం ప్రారంభం



కడియం (చైతన్యరథం): తూర్పుగోదావరి జిల్లా కడియం స్వర్ణ గ్రామ సచివాలయం-4లో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉద్యాన రైతు సౌకర్యాల మరియు వనరుల కేంద్రంను ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి, జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ... కడియం ప్రాంతంలోని నర్సరీ రైతులు, ఉద్యాన రైతులకు ఈ కేంద్రం ద్వారా అనేక సేవలు ఒకే చోట అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఉద్యాన రంగ అభివృద్ధికి ఇది ఎంతో దోహదపడుతుందన్నారు. జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ నర్సరీ రైతుల సాగు, ఎగుమతులు-దిగుమతులకు అవసరమైన సేవలను ఈ కేంద్రం ద్వారా అందించనున్నట్లు చెప్పారు. నర్సరీ రిజిస్ట్రేషన్, లైసెన్స్, ఐఈసీ సర్టిఫికెట్, ఏపెడా సర్టిఫికెట్, కల్టివేషన్ సర్టిఫికెట్, ఫైటో సానిటరీ సర్టిఫికెట్ తదితర కీలక ధ్రువపత్రాల ప్రక్రియలను సులభతరం చేయనున్నట్లు తెలిపారు. అలాగే ఉద్యాన శాఖ పథకాలపై రైతులకు అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఎన్. మల్లికార్జున మాట్లాడుతూ కేంద్రంలో ఉద్యాన అధికారితో పాటు ఇద్దరు ఫెసిలిటేటర్లు రైతులకు సేవలు అందిస్తారని తెలిపారు. ఆధునిక సాగు విధానాలు, మార్కెటింగ్ అవకాశాలు, ప్రభుత్వ పథకాలపై రైతులకు మార్గదర్శకత్వం అందించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఏపెడా అసిస్టెంట్ ఆర్. సుకేష్, నేషనల్ హార్టికల్చర్ బోర్డు డిప్యూటీ డైరెక్టర్ ప్రదీప్ మాట్లాడుతూ రైతులకు అన్ని విధాల సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంఐపీ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎ. దుర్గేష్, ఉద్యాన శాఖ అధికారి డి. సుధీర్, వేమగిరి హార్టికల్చర్ రీసెర్చ్ స్టేషన్ శాస్త్రవేత్తలు, ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, కడియపులంక సొసైటీ అధ్యక్షుడు గట్టి నరసయ్య, కడియం సొసైటీ అధ్యక్షులు వెలుగుబంటి నాని, మాజీ సర్పంచ్ పుల్లా రామారావు పలువురు నర్సరీ రైతులు, వివిధ పార్టీల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## అన్న క్యాంటీన్‌ను తనిఖీ చేసిన ఎమ్మెల్యే వనమాడి



కాకినాడ (చైతన్యరథం): సూర్యరావుపేట, బాలా త్రిపుర సుందరి ఆలయం వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు శనివారం ఉదయం ఆకస్మిక తనిఖీ చేపట్టారు. పేద వర్గాలకు అందిస్తున్న అల్పాహార ఏర్పాట్లను పరిశీలించారు. అల్పాహారం చేస్తున్న స్థానిక ప్రజలను వివరాలు అడిగి తెలుసుకున్న ఆయన... ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద వర్గాలకు మూడు పూటలా కడుపునిండా ఆహారం అందించాలని ఆలోచనతో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయడం జరిగిందని, గత ప్రభుత్వం అన్నా క్యాంటీన్లు మూసివేసి పేద వర్గాలకు ఆహారం లేకుండా చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తిరిగి అన్నక్యాంటీన్లును ఏర్పాటు చేయడం జరిగిందని, రూ.5 లకే ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, రాత్రికి భోజనం అందించడం గొప్ప విషయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న అన్నా క్యాంటీన్‌తో పేదల కడుపు నిండుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఇన్‌ఛార్జ్ కమిషనర్ సత్యనారాయణ, నగర పార్టీ అధ్యక్షులు మల్లిపూడి వీరు, గోపిశెట్టి బూరయ్యా, తదితరులు పాల్గొన్నారు.

జోన్ - 3 (మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు, బాపట్ల, నరసరావుపేట)

చైతన్యరథం

# ఆపరేషన్ క్లీన్ స్వీప్ ప్రజల దినచర్యగా మారాలి

- క్లీన్ స్వీప్‌లో భాగంగా చీపురు పట్టి రోడ్డు శుభ్రం చేసిన ప్రత్తిపాటి
- తాటిముంజలమ్మే చిన్నారులతో మాట్లాడి, ముంజలు కొని రుచిచూసిన ఎమ్మెల్యే



చిలకలూరిపేట (చైతన్యరథం): ప్రజల భాగస్వామ్యం, వారి బాధ్యతాయుత పనితీరుతోనే ప్రభుత్వ కార్యక్రమాలు విజయవంతం అవుతాయని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు అభిప్రాయపడ్డారు. శనివారం ఆయన చిలకలూరిపేటలో ఆపరేషన్ క్లీన్ స్వీప్‌లో పాల్గొన్నారు. స్వయంగా చీపురు పట్టిన ప్రత్తిపాటి.. స్థానిక నాయకులతో కలిసి రోడ్డు శుభ్రం చేశారు. అనంతరం ఒక కూడలిలో తాటిముంజలు అమ్ముతున్న చిన్నారులతో మాట్లాడి, ఎక్కడి నుంచి వచ్చారు. తాటికాయలు ఎక్కడ తెచ్చారు.. అన్నీ అమ్మితే ఎంత లాభం వస్తుందని వారిని ప్రశ్నించగా, పిల్లలు ఉత్సాహంగా ప్రత్తిపాటికి సమాధానమిచ్చారు. అనంతరం వారి వద్ద ముంజలు కొనుగోలు చేసి రుచిచూసిన ప్రత్తిపాటి బాగున్నాయని వారిని మెచ్చుకున్నారు.

**ప్రభుత్వ కార్యక్రమాల్ని ప్రజలు తమ సొంతపనులుగా భావించాలి**

అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆపరేషన్ క్లీన్ స్వీప్ అయినా.. స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర అయినా ప్రజల భాగస్వామ్యంతోనే విజయవంతం అవుతాయన్నారు. ప్రభుత్వం వీధులు, పట్టణాలు, గ్రామాల శుభ్రతను ఒక ప్రాజెక్టులా నిర్వహిస్తోందని, అలాంటప్పుడు ప్రజలు ఇష్టానసారం వ్యవహరిస్తే ఉపయోగం ఏముంటుందని ప్రత్తిపాటి ప్రశ్నించారు. ప్రజల సొమ్ముతో ప్రభుత్వం ఒక మంచి ఆశయంతో చేపట్టే ప్రతి కార్యక్రమం విజయవంతం కావాలంటే, దానిని ప్రజలు తమ సొంత పనిగా భావించాలన్నారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ ప్రజల దినచర్యలో భాగం కావాలన్న ప్రత్తిపాటి.. పరిశుభ్రమైన గ్రామాలు, పట్టణాలే సుస్థిర అభివృద్ధికి అసలైన ప్రామాణికాలుగా నిలుస్తాయన్నారు. హరితాంధ్ర, స్వచ్ఛాంధ్ర అనేవి కేవలం నినాదాలు కావని, ప్రజల జీవన ప్రమాణాలు పెంచే గొప్ప కార్యక్రమాలని ప్రత్తిపాటి తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన వ్యర్థాల నిర్వహణ, రీసైక్లింగ్, హరితాంధ్ర కార్యక్రమాలతో యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమాధ్ ఖాన్, ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, మండల అధ్యక్షులు జవ్వాజి మధన్ మోహన్, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు మస్తాన్ వలి, బేరింగ్ మౌలాలి, తుపాకుల అప్పారావు, మున్సిపల్ కమిషనర్ పతి శ్రీహరి, అధికారులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# దిశ సమావేశంలో గుడివాడ సమస్యలపై ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ప్రశ్నల వర్షం

- మచిలీపట్నం కలెక్టరేట్‌లో ఎంపీ బాలసౌరి అధ్యక్షతన.... దిశ కమిటీ సమావేశం
- గుడివాడ రోడ్లు, బ్రిడ్జిల సమస్యలపై ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆవేదన



మచిలీపట్నం (చైతన్యరథం): కృష్ణాజిల్లా కేంద్రమైన మచిలీపట్నం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ మీటింగ్ హాల్లో శనివారం జిల్లా అభివృద్ధి సమన్వయం మరియు పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం జరిగింది. మచిలీపట్నం పార్లమెంటు సభ్యులు వల్లభనేని బాలశౌరి అధ్యక్షతన, కలెక్టర్ బాలాజీ సమక్షంలో జరిగిన ఈ సమావేశంలో గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము నియోజకవర్గ సమస్యలను ప్రస్తావించారు. నియోజకవర్గంలో జరుగుతున్న రోడ్ల అభివృద్ధి పనుల పురోగతిని వేగవంతం చేయాలని ఎమ్మెల్యే రాము విజ్ఞప్తి చేశారు. సీఎం చంద్రబాబునాయుడు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన గుడివాడ – పోలుకొండ రహదారి పనులను వెంటనే ప్రారంభించాలని కలెక్టర్ బాలాజీని కోరారు. ప్రాధాన్యత ప్రకారం అభివృద్ధి పనుల ప్రపోజల్స్ సిద్ధం చేసేలా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలన్నారు.

**బ్రిడ్జిలపై ప్రశ్నలు:**

జిల్లాలో 50 బ్రిడ్జిలు కొత్తగా మంజూరయ్యాయని, వాటిలో గుడివాడ నియోజకవర్గానికి ఎన్ని ఉన్నాయో చెప్పాలని ఎమ్మెల్యే ప్రశ్నించారు. జిల్లాలో అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జిల పనులు చేస్తున్నామని అధికారులు తెలపగా, వాటితో పాటు గుడివాడలో శిథిలావస్థకు చేరిన బ్రిడ్జిలను కూడా నిర్మించాలని కోరారు.

**ప్రపోజల్స్‌పై అసంతృప్తి:**

గుడివాడ నియోజకవర్గంలో అధికారులు కనీసం ప్రపోజల్ విషయం కూడా తమకు చెప్పడం లేదని ఎంపీ బాలశౌరి దృష్టికి ఎమ్మెల్యే తీసుకెళ్లారు. తమకు తెలియకుండా ప్రపోజల్స్ చేయడం వల్ల క్షేత్రస్థాయిలో ప్రజలు ఇబ్బందులు పడుతున్న చోట పనులు జరగడం లేదని, సమస్యలు అలాగే ఉంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఎంపీ బాలశౌరి జోక్యం చేసుకొని సమస్య ప్రాధాన్యత ఏంటో స్థానిక ప్రజాప్రతినిధులకు తెలుస్తుందని, వారి సూచనలను తప్పక పరిగణలోకి తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజల ఇబ్బందులు గుర్తించి తాము ఇస్తున్న ప్రపోజల్స్‌ను అధికారులు పట్టించుకోవడం లేదని సభ దృష్టికి ఎమ్మెల్యే తీసుకురాగా, మరోసారి ఇలా జరగకుండా చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు.

# వినుకొండలో జీవీ ఆంజనేయులు ఆపరేషన్ క్లీన్ స్వీప్

- స్వయంగా చీపురుపట్టి వీధులను శుభ్రం చేసిన ఎమ్మెల్యే జీవీ



వినుకొండ (చైతన్యరథం): రాష్ట్ర ప్రభుత్వం, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతి నెలా మూడో శనివారం నిర్వహించే 'సాసా' (స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర) కార్యక్రమంలో భాగంగా పట్టణాలు, నగరాలను సంపూర్ణ చెత్త రహిత ప్రాంతాలుగా మార్చేందుకు అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' వినుకొండలో ఘనంగా ప్రారంభమైంది. ఈ పారిశుధ్య మహోద్యమంలో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు స్వయంగా పాల్గొన్నారు. చీపురు పట్టి వీధులను శుభ్రం చేయడంతో పాటు మొక్కలకు నీరు పోసి ప్రజా చైతన్యాన్ని రగిల్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజన్‌తో రాష్ట్ర రూపురేఖలు మారుతున్నాయని, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ద్వారా దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌ను అగ్రస్థానంలో నిలపడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని ప్రకటించారు. పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజల ఆరోగ్యానికి శ్రీకారం చుట్టవచ్చని హితవు పలికారు. గత వైసీపీ ప్రభుత్వం టన్నుల కొద్దీ వ్యర్థాలను పేరుకుపోయేలా చేసి, చెత్త మీద పన్నులు వేసిన ఒక "చెత్త ప్రభుత్వం" అని ఆయన తీవ్రంగా విమర్శించారు. స్వచ్ఛమైన వినుకొండ సాధన కోసం ప్రజలంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రాబోయే 4 వారాల పాటు సాగే ఈ ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలో.. మొదటి వారం సమస్యల గుర్తింపు–క్లీనింగ్, రెండో వారం డ్రైనేజీల పూడికతీత, మూడో వారం వ్యాపార సముదాయాలపై ప్రత్యేక నిఘా, నాలుగో వారం సమస్యాత్మక ప్రాంతాలకు శాశ్వత సుందరీకరణ పనులు చేపడతామని అధికారులు తెలిపారు. ఈ 4 వారాల సుదీర్ఘ డ్రైవ్ జూన్ 19తో ముగుస్తుందని, అనంతరం జూన్ 20న రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి అత్యంత భారీ స్థాయిలో 'మెగా క్లీన్‌లెనెస్ డ్రైవ్' నిర్వహించి ప్రపంచ రికార్డు సృష్టించాలని ప్రభుత్వం సంకల్పించిందని జీవీ ఆంజనేయులు వెల్లడించారు.

**ఇది ప్రభుత్వ కార్యక్రమం కాదు... ఇది ఒక ప్రజా ఉద్యమం**

ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనల అమలు, జరిమానాల విధింపు వంటి పూర్తి అధికారాలు కలెక్టర్లకే ఇవ్వబడ్డాయి. మున్సిపల్ అధికారులు ప్రతిరోజూ ఉదయం 6 గంటల నుంచే క్షేత్రస్థాయిలో పనులు పర్యవేక్షిస్తారని తెలిపారు. పారిశుధ్యంలో ప్రభుత్వంతో పాటు పౌరులకు 50–50 భాగస్వామ్యం ఉంది. తడి–పొడి చెత్తను విడివిడిగా మున్సిపల్ వాహనాలకే ఇవ్వాలి. వ్యాపార సంస్థలు కచ్చితంగా డస్ట్‌బిన్లు ఏర్పాటు చేసుకోవాలి. ఖాళీ స్థలాలను శుభ్రంగా ఉంచుకోకపోతే నోటీసులు ఇస్తామని స్పష్టం చేశారు. 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' అనేది కేవలం ప్రభుత్వ కార్యక్రమం కాదు, ఒక ప్రజా ఉద్యమం. జూన్ 20న జరగబోయే ప్రపంచ రికార్డు డ్రైవ్‌లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జీవీ ఆంజనేయులు కోరారు. జీడిసిసి బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, వినుకొండ పురపాలక సంఘ కమిషనర్ కోడూరి శివరామ ప్రసాద్, పురపాలక సంఘ సిబ్బంది మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గంలోని ప్రధాన డ్రైయిన్లను ఏడాదిలోగా పూర్తి చేస్తాం

●గుంటతిప్ప, పుల్లేటికట్ట డ్రైయిన్‌ను పునర్నిర్మాణం చేస్తాం : ఎమ్మెల్యే గద్దె రామమోహన్



విజయవాడ (చైతన్యరథం): తూర్పు నియోజకవర్గంలోని ప్రధాన డ్రైయిన్లైన గుంటతిప్ప, పుల్లేటికట్ట డ్రైయిన్ల నిర్మాణ పనులను ఏడాదిలో పూర్తి చేస్తామని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు. శనివారం ఉదయం తూర్పు నియోజకవర్గ పరిధిలోని 3వ డివిజన్‌లోని కరెన్సీ నగర్ బాయిన బాబ్జీ రోడ్డులోని వివేకానంద పార్కును రూ.20 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ హాజరై భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ... విజయవాడ నగరం సమగ్రాభివృద్ధికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చర్యలు తీసుకుంటున్నారని, అందుకు ఆయనకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, స్ట్రామ్ వాటర్‌కు అధిక ప్రాధాన్యత ఇచ్చి నిధులు మంజూరు చేస్తున్నారని చెప్పారు. అందుకు ప్రత్యేకంగా డీపీఆర్‌లు కూడా సిద్ధం చేస్తున్నామని, ఆ డీపీఆర్‌లను బట్టి నిర్మాణాలు చేపట్టానికి రూ.2 వేలు కోట్లు అయినా మంజూరు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కరెన్సీ నగర్‌లో ఉన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించడానికి పూర్తిస్థాయిలో తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. సంవత్సర కాలంలో ఈ ప్రాంతంలో గుంటతిప్ప, పుల్లేటికట్ట డ్రైయిన్లతో పాటుగా చిన్నపాటి డ్రైయిన్ల నిర్మాణాలను కూడా పూర్తి చేస్తామని చెప్పారు. రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేస్తున్న కృషికి అందరం మద్దతుగా నిలబడాలని కోరారు. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎలాంటి మనస్తత్వం కలిగిన వ్యక్తి అనేది ఆయన తల్లి, చెల్లితో పాటుగా ఆయన అనుచరులు బహిరంగంగా చెబుతున్నారని అన్నారు. వైసీపీ అంటేనే గొడ్డలి పార్టీ అని జగనే స్వయంగా చెబుతున్నారని, మావిగన్ అంటే మెంటల్ మావిగన్ అని ప్రజలు అంటున్నారన్నారు. పిల్లల భవిష్యత్తు కోసం అప్పులు చేసి పిల్లలను తల్లిదండ్రులు చదివిస్తున్నారని చెప్పారు. తన రాజకీయ భవిష్యత్తు కోసం రాష్ట్ర ప్రజలు, యువత భవిష్యత్తును నాశనం చేయాలని జగన్ చూడటం సరికాదని ఎమ్మెల్యే గద్దె రామమోహన్ అన్నారు.

# చంద్రబాబుతోనే స్వర్ణాంధ్ర సాకారం మాజీ ఎంపీ రాయపాటి

●సీఎం నారా చంద్రబాబుతో మాజీ ఎంపీ రాయపాటి భేటీ



గుంటూరు (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు రాష్ట్ర ప్రజల జీవితాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని మాజీ పార్లమెంట్ సభ్యులు రాయపాటి సాంబశివరావు పేర్కొన్నారు. శనివారం మాజీ ఎంపీ రాయపాటి సాంబశివరావు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును ఆయన ఏపీ సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాజీ ఎంపీ రాయపాటి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా సేవలో నిరంతరం కృషి చేస్తూ ప్రజా శ్రేయస్సు కోసం పరితపించే నాయకుడిగా రాయపాటి సాంబశివరావు సేవలను కొనియాడిన ముఖ్యమంత్రి, ఆయన కుటుంబం ప్రజాక్షేత్రంలో చురుకైన పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో అనుభవజ్ఞులైన నాయకుల సూచనలు ఎంతో అవసరమని సీఎం అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలపై వారు పరస్పరం చర్చించుకున్నారు. రాయపాటితో పాటు ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఆలూరి చంద్రశేఖర్, చార్టర్డ్ అకౌంటెంట్ పూర్ణ, చంద్రపాల్ తదితరులున్నారు.

జోన్-4
(ఒంగోలు, నెల్లూరు, రాజంపేట, తిరుపతి, చిత్తూరు)
చైతన్యరథం

# పేదలకు కంటి చూపు కోసమే విపిఆర్ నేత్ర : వేమిరెడ్డి ప్రశాంతి

●చిరమనలో ఘనంగా మంత్రి ఆనం చే విపిఆర్ నేత్ర ప్రారంభం

●విపిఆర్ నేత్రతో జిల్లాలో 56,495 మందికి పరీక్షలు

●ప్రారంభోత్సవంలో పాల్గొన్న కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



ఆత్మకూరు (చైతన్యరథం): పేదలకు కంటి చూపు అందించడమే విపిఆర్ నేత్ర సంకల్పమని ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పాల్గొని ప్రారంభించడం చాలా సంతోషదాయకమని నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు. శనివారం ఆత్మకూరు నియోజకవర్గం ఏఎస్ పేట మండలంలోని చిరమనలో విపిఆర్ నేత్ర కార్యక్రమాన్ని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డితో కలిసి ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నియోజకవర్గ స్థాయి విపిఆర్ నేత్ర కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా చిరమనలో వారికి కూటమి నాయకులు కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికి, సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎంపీ మాట్లాడుతూ... నియోజకవర్గ స్థాయిలో చిరమన నుండి విపిఆర్ నేత్రను ప్రారంభిస్తున్నామన్నారు. విపిఆర్ నేత్ర ద్వారా ఇప్పటి వరకు 56,495 మందికి కంటి పరీక్షలు నిర్వహించామన్నారు. 183 రోజులలో జిల్లాలోని 164 గ్రామ పంచాయతీలలో నిర్వహించిన కంటి పరీక్షల్లో 32,379 మందికి కళ్ల జోళ్ల అందజేశామన్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో విపిఆర్ నేత్ర ద్వారా పేదలకు సేవలు అందజేయడం జరుగుతుందన్నారు. మొదటగా విపిఆర్ నేత్రను ఉదయగిరిలో ప్రారంభించామన్నారు. దాదాపు 143 గ్రామాల్లో కంటి పరీక్షలు నిర్వహించి కళ్ళజోళ్ళు అందజేశామన్నారు. 47000 వేల మందికి పరీక్షలు నిర్వహించి దాదావు 27,000 మందికి కళ్ళజోళ్ళు అందజేయడం జరిగిందన్నారు. కోవూరు నియోజకవర్గంలో కూడా రెండో బస్సుతో విపిఆర్ నేత్ర ప్రారంభించామన్నారు. పదివేల మందికి పరీక్షలు నిర్వహిస్తే అందులో దాదాపు 6,500 మందికి కళ్ళజోళ్ళు అందజేశారు. విపిఆర్ నేత్రను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# వర్చువల్ మహానాడుపై మంత్రి నారాయణ సమీక్ష

●మహానాడును విజయవంతం చేయండి-పార్టీ శ్రేణులకు పిలుపు

●మెడికల్ కాలేజి క్యాంప్ కార్యాలయంలో మహానాడు సన్నాహక సమావేశం



నెల్లూరు (చైతన్యరథం): వర్చువల్ మహానాడును ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేయాలని సిటీ టీడీపీ నేతలకు రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ దిశానిర్దేశం చేశారు.క్లస్టర్ ల వారీగా నిర్వహించే మహానాడులో పాల్గొనే క్యాడర్‌కు ఎటువంటి లోటు పాట్లు లేకుండా చూడాలని సూచించారు. నెల్లూరు ప్రతిష్టను ఇనుమడింపచేసేలా ఏర్పాట్లు చేయాలని పిలుపునిచ్చారు. నెల్లూరు నారాయణ మెడికల్ కాలేజ్‌లోని క్యాంప్ కార్యాలయంలో శనివారం సాయంత్రం పార్టీ నాయకులతో మంత్రి నారాయణ సమీక్షా సమావేశం నిర్వహించారు. వర్చువల్ మహానాడు నిర్వహణపై సిటీ టీడీపీ నేతలకు దిశానిర్దేశం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు ఇంధన పొదుపు నేపథ్యంలో నెల్లూరులో జరగాల్సిన మహానాడును రద్దు చేసి, ఈ నెల 27,28 తేదీలలో మంగళగిరిలోని పార్టీ కేంద్రకార్యాలయం వేదికగా వర్చువల్ ద్వారా హైబ్రిడ్ మహానాడు ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబునాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ యువనేత నారా లోకేష్ నిర్ణయించారని వివరించారు. వర్చువల్ మహానాడును విజయవంతం చేసేందుకు కృషి చేయాలని సూచించారు.సిటీ నియోజక వర్గ పరిధిలోని 14 క్లస్టర్‌లలో ఎల్‌ఈడి స్క్రీన్ లు ఏర్పాటు చేసి వర్చువల్ మహానాడు వీక్షించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, నగర పార్టీ అధ్యక్షులు మామిడాల మధు, రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు ధర్మవరం సుబ్బారావు, కార్పొరేటర్లు, క్లస్టర్ ఇన్చార్జీలు, కో క్లస్టర్లు,డివిజన్ ప్రెసిడెంట్లు మరియు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

## కడపలో అభివృద్ధి శకం ప్రారంభం... రూ.3వేల కోట్ల సోలార్ ప్రాజెక్టుతో కొత్త దిశ

● హర్షం వ్యక్తం చేసిన రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ గొల్ల నరసింహ యాదవ్

తిరుపతి (చైతన్యరథం): కడప జిల్లాలో ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేపట్టిన రెండు రోజుల పర్యటన రాయలసీమ అభివృద్ధికి కొత్త ఆశలు నింపిందని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ గొల్ల నరసింహ యాదవ్ అన్నారు. తిరుపతిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గతంలో కడప జిల్లా ఫ్యాక్షన్ రాజకీయాలతో గుర్తింపు పొందిందని, ఇప్పుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అభివృద్ధి, పెట్టుబడులు, సంక్షేమ పథకాల దిశగా ముందుకు సాగుతోందన్నారు. మంత్రి లోకేష్ పర్యటన ద్వారా కడప జిల్లాకు పారిశ్రామిక ప్రాధాన్యం మరింత పెరిగిందని తెలిపారు. జమ్మలమడుగు నియోజకవర్గంలోని కొండాపురం మండలం టి.కోడూరు వద్ద 'జూజూ లిమిటెడ్' సంస్థ రూ.3 వేల కోట్ల పెట్టుబడితో నిర్మించిన 600 మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్రాజెక్టును మంత్రి లోకేష్ ప్రారంభించారని చెప్పారు. 2,400 ఎకరాల్లో నిర్మించిన ఈ ప్రాజెక్టు రాయలసీమలో భారీ పెట్టుబడులకు నాంది పలికిందన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా భూములు ఇచ్చిన రైతులకు దీర్ఘకాలిక లీజు ఆదాయం లభిస్తుందని, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని వెల్లడించారు. ఇప్పటికే నిర్మాణ దశలో స్థానికులకు ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలిపారు.

# మార్కాపురంలో దివ్యాంగులకు ఉచిత ట్రై సైకిళ్ల పంపిణీ



మార్కాపురం (చైతన్యరథం): మార్కాపురం పట్టణంలో సౌజన్య ఫంక్షన్ హాల్‌లో అర్హులైన దివ్యాంగులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మంజూరు చేసిన ఉచిత ట్రై సైకిల్ పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల బాల వీరాంజనేయ స్వామి, మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి, కనిగిరి శాసనసభ్యులు ఉగ్ర నరసింహారెడ్డి, గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుమల అశోక్ రెడ్డి, ఎర్రగొండపాలెం టీడీపీ ఇన్‌ఛార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు, మార్కాపురం జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత, జిల్లా జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు, ఇతర జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగ శక్తి పేరుతో దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించారని, దివ్యాంగులు ఇబ్బంది పడకుండా రాష్ట్రంలో 1750 మంది దివ్యాంగులకు 1700కోట్ల రూపాయలతో ఉచిత ట్రై మోటార్ సైకిళ్లను పంపిణీ చేస్తున్నామని అన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి కూటమి ప్రభుత్వం అమలు చేసిందని అని త్వరలోనే వెలిగొండ ప్రాజెక్ట్ పూర్తిచేసి ఈ ప్రాంతానికి త్రాగునీరు సాగునీరు అందిస్తామని అని తద్వారా ఫ్లోరైడ్ పిడిత ప్రాంతమైన ఈ ప్రాంతంలో ఫ్లోరైడ్ వల్ల వచ్చే జబ్బులను నిర్మూలించవచ్చునని అన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు ప్రత్యేక దృష్టి



ఒంగోలు (చైతన్యరథం): ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు అన్నారు. శనివారం ఒంగోలు ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన రెవెన్యూ గ్రీవెన్స్ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఒంగోలు రూరల్ మండలం, ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ పరిధుల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు 286 మంది హాజరై తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సంబంధిత అధికారులతో మాట్లాడిన ఎమ్మెల్యే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు, అర్బన్ తహసీల్దార్ మధుసూదన్, రూరల్ తహసీల్దార్ కృష్ణమోహన్, రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

●కావలి నియోజకవర్గ మత్స్యకారులకు రూ.48.33 లక్షల విలువైన బోట్లు, వలలు, ఇంజిన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి




కావలి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో కలిసి మత్స్యకారుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న 'ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన' పథకం ద్వారా కావలి నియోజకవర్గ మత్స్యకారులకు శనివారం భారీ స్థాయిలో సబ్సిడీపై మత్స్య పరికరాలను పంపిణీ చేశారు. కావలి పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మత్స్యశాఖ అధికారులు, పార్టీ నాయకులతో కలిసి కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి 35 మంది లబ్ధిదారులకు బోటులు, వలలు, ఇంజిన్లను అందజేశారు. కావలి రూరల్ మండల పరిధిలోని తుమ్మలపెంట, అన్నగారిపాలెం, చెన్నాయిపాలెం గ్రామాలకు చెందిన మత్స్యకారులకు మొత్తం రూ.48,33,400 విలువైన పరికరాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ... మత్స్యకారుల అభివృద్ధి మరియు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.మత్స్యకారులు ఆర్థికంగా బలోపేతం కావడానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. సముద్రంపై ఆధారపడి జీవించే కుటుంబాలకు అవసరమైన వసతులు, ఆధునిక పరికరాలు అందించడం ద్వారా వారి జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని తెలిపారు. అలాగే ఈనెల 19వ తేదీన "మత్స్యకారుల సేవలో" కార్యక్రమం సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తుమ్మలపెంట గ్రామానికి విచ్చేసిన విషయాన్ని ఎమ్మెల్యే గుర్తు చేశారు. ఒక్క పిలుపుతో స్పందించి కావలి నియోజకవర్గంలో ఉన్న వేలాది మంది మత్స్యకార కుటుంబాలు కార్యక్రమానికి హాజరై విజయవంతం చేశారని తెలిపారు. మత్స్యకారుల ఐక్యత, ప్రభుత్వంపై వారు ఉంచిన విశ్వాసం చూసి ఎంతో ఆనందం కలిగిందని అన్నారు. "మే 19వ తేదీ నా జీవితంలో మత్స్యకారుల జీవితాల్లో ఎప్పటికీ మర్చిపోలేని రోజుగా నిలిచిపోతుంది. రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమం కోసం ప్రత్యేకంగా పనిచేస్తోంది. మత్స్యకార యువత ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకుని మరింత అభివృద్ధి చెందాలని, సముద్ర వేటలో కొత్త పద్ధతులు అవలంబించి ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. కావలి నియోజకవర్గంలో ఉన్న తీర గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. ఎమ్మెల్యేగా తాను ఎల్లప్పుడూ మత్స్యకారులకు అండగా ఉంటానని ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి హామీ ఇచ్చారు.

# అభివృద్ధి పనులకు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి శ్రీకారం



నెల్లూరు (చైతన్యరథం): నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని పొట్టేపాలెం గ్రామంలో రూ.65లక్షల అభివృద్ధి పనులను టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. యువగళం పాదయాత్రలో నారా లోకేష్ బాబు మాట ఇచ్చిన ప్రకారం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 23 నెలల్లోనే 21లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులతో 657 పరిశ్రమలను ఏర్పాటు చేసి, రాబోవు రోజుల్లో నిరుద్యోగ యువతకు 21 లక్షల ఉద్యోగాలు కలిపించడం జరుగుతుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పొట్టేపాలెం గ్రామ అభివృద్ధికి రూ.4 కోట్ల 50 లక్షల నిధులు కేటాయించామని, నెల్లూరు రూరల్ మండలంలో ఇంకా ఏమైనా అభివృద్ధి పనులు ఉంటే రాబోయే రోజుల్లో చేస్తాం. ఎన్నికల వరకే రాజకీయాలు ఎన్నికలు లేని వేళ కూటమి ప్రభుత్వంలో ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులు మరియు సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికి అందే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహానాడులో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి

- వర్చువల్ విధానంలో మహానాడు విజయవంతం చేద్దాం
- పార్టీ శ్రేణులకు ధర్మవరం ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ పిలుపు
- నారా లోకేష్ టెలీ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న శ్రీరామ్



ధర్మవరం (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహానాడు కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని ధర్మవరం ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ పిలుపునిచ్చారు. మహానాడు ఏర్పాట్లపై జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ పార్టీ శ్రేణులతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన ధర్మవరం టీడీపీ కార్యాలయంలో పార్టీ నేతలతో సమావేశం నిర్వహించారు. వర్కింగ్ ప్రెసిడెంట్ టెలీ కాన్ఫరెన్స్ లో చెప్పిన అంశాలను శ్రీరామ్ శ్రేణులకు వివరించారు. పొదుపు చర్యల్లో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు ఈసారి హైబ్రిడ్ పద్ధతుల్లో మహానాడును నిర్వహించాలని పార్టీ నిర్ణయించినట్టు తెలిపారు. మంగళగిరి టీడీపీ ప్రధాన కార్యాలయంలో కొంత మందితో మహానాడును నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ నెల 27, 28వ తేదీల్లో జరగనున్న మహానాడులో సుమారు 20 తీర్మానాలను ప్రవేశపెట్టబోతున్నారని.. మహానాడు-2026ను స్త్రీ శక్తి థీమ్‌తో నిర్వహించాలని టీడీపీ పొలిట్ బ్యూరో నిర్ణయించిందన్నారు. ఒక పండుగ వాతావరణంలో నిర్వహించుకునే మహానాడులో ధర్మవరం పరిధిలోని అన్ని క్లస్టర్లలో విజయవంతం చేయలన్నారు. నియోజకవర్గంలో మొత్తం 12 క్లస్టర్లు ఉన్నాయని..ఎక్కడికక్కడ ఆయా క్లస్టర్ల పరిధిలో మహానాడుకి ఏర్పాట్లు చేయాలన్నారు. కేఎస్ఎస్, బూత్, గ్రామ స్థాయి, అనుబంధ కమిటీల సభ్యులందరినీ మహానాడుకు ప్రత్యేకంగా ఆహ్వానించి, వారందరూ పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి కార్యకర్త ఇందులో భాగస్వామ్యం అయ్యేలా చూడాలన్నారు. ఈ రెండు రోజుల్లో పార్టీ సీనియర్ నాయకులకు సన్మానం చేయనున్నట్టు తెలిపారు. మొదటి సారి వర్చువల్ విధానంలో జరుగుతున్న ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని శ్రీరామ్ పిలుపునిచ్చారు.

## హైబ్రీడ్ మోడ్ మహానాడును విజయవంతం చేయండి

- శ్రేణులకు సూచించిన కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్



కదిరి (చైతన్యరథం): "తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించే మహానాడును పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలి. పొదుపు చర్యల్లో భాగంగా తొలిసారిగా వర్చువల్ విధానంలో మహానాడు నిర్వహిస్తున్నాం." అని టీడీపీ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ వ్యాఖ్యానించారు. పార్టీలో పొదుపు చర్యలను అమలు చేయాలనే ఉద్దేశంతో.. టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు వర్చువల్ విధానంలో మహానాడు నిర్వహించాలన్న నిర్ణయం తీసుకున్నారు. ఈ పసుపు పండుగను సరికొత్త సాంకేతికతతో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని, ఈ నెల 27, 28 తేదీలలో రెండు రోజుల పాటు ఈ డిజిటల్ మహానాడు వేడుకలు జరుగుతాయని అన్నారు. పార్టీ కేంద్ర కార్యాలయం 'ఎన్టీఆర్ భవన్'లో కార్యక్రమం ఉంటుందని, ఎన్టీఆర్ భవన్ నుంచే ప్రత్యేక స్టేజీని ఏర్పాటు చేసి మహానాడు ఆన్‌లైన్ కార్యక్రమాలను పార్టీ తీర్మానాలను రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలలో క్లస్టర్ల వారీగా ప్రత్యక్ష ప్రసారం చేస్తారు. ఈ వేడుకల్లో కేడర్, క్షేత్రస్థాయి నాయకులు పాల్గొనే విధంగా అధిష్టానం ఆదేశాలు ఇవ్వడం జరిగింది. ప్రతి క్లస్టర్ పరిధిలో ఉన్నవారంతా ఈ వేడుకల్లో పాల్గొనేలా నాయకులు చొరవ తీసుకోవాలి. దీనిపై ముందే అవగాహన కల్పించాలి. ప్రతి కార్యకర్త, నాయకుడు ఈ డిజిటల్ మహానాడులో భాగస్వాములై విజయవంతం చేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పిలుపునిచ్చారు.

## ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

- అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయం నందు 42వ ప్రజాదర్బార్



అనంతపురం (చైతన్యరథం): ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ప్రాధాన్యతల వారీగా పరిష్కారమయ్యేల చర్యలు తీసుకుంటామని అనంతపురం శాసనసభ్యులు దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు. అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయం నందు 42వ ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజలనుంచి అర్జీలను ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ స్వీకరించారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులకు పంపి పరిష్కరించాలని ఎమ్మెల్యే సూచించారు.

## రాయలసీమలో రక్తం ఏరులై పారించిన చరిత్ర మీది

- రాయలసీమలో ఫ్యాక్షనిజం రాజారెడ్డితోనే మొదలు
- వివేకా హంతకులు వైసీపీలోనే ఉన్నారు
- జగన్ నోట శాంతి వచనాలు విని నవ్వుతున్న జనాలు
- లోకేశ్ గురించి మాట్లాడే అర్హత జగన్‌కు లేదు : మంత్రి సవిత



పెనుకొండ/శ్రీసత్యసాయి : రాయలసీమలో రక్తం ఏరులై పారించిన చరిత్ర నీది, నీ తాతది, నీ తండ్రిది.. నీ బాబాయ్ హంతకులు, దళితులను పొట్టన బెట్టుకున్నవారు నీ పార్టీలోనే ఉన్నారు కదా.. మహాత్మా గాంధీ, గౌతమ బుద్ధుడిలా నువ్వు శాంతి వచనాలు పఠిస్తే రాష్ట్రంలో నమ్మేవాళ్లెవరూ లేరు అని జగన్‌పై రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ శాఖ మంత్రి సవిత ఆగ్రహం వ్యక్తంచేశారు. జగన్ సైకో పాలనతో అయిదేళ్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పాలయ్యారన్నారు. రాయలసీమలో ఫ్యాక్షనిజాన్ని అంతమొందించి, ఇక్కడి బిడ్డలను ఐటీ, ప్రభుత్వ ఉద్యోగులుగా, వ్యాపారులుగా తీర్చిదిద్దిన ఘనత సీఎం చంద్రబాబుదేనన్నారు. మంత్రి నారా లోకేశ్ గురించి మాట్లాడే అర్హత జగన్‌కు లేదన్నారు. పెనుకొండ పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి సవిత మాట్లాడారు. తాడేపల్లి ప్యాలెస్‌లో శుక్రవారం నిర్వహించిన జగన్ ప్రెస్ మీట్‌ను చూసి జనాలు నవ్వుకుంటున్నారన్నారు. మహాత్మా గాంధీ, గౌతమ బుద్ధుడిలా జగన్ రెడ్డి శాంతి వచనాలు పఠించడం చూసి, చిన్న పిల్లలతో పాటు రాజకీయ అవగాహన లేని వారు సైతం నవ్వుతున్నారన్నారు. రాయలసీమలో ఫ్యాక్షన్‌కు నాందిపలికింది రాజారెడ్డి అని ఆరోపించారు. జగన్, ఆయన తండ్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి, తాత రాజారెడ్డి చరిత్ర అందరికీ తెలిసిందేనన్నారు. ఫ్యాక్షన్ నైజంతో రాయలసీమలో రక్తం ఏరులై పారించారని, వారి రక్త దాహానికి బడుగు, బలహీన వర్గాల వారు, రాజకీయ ప్రత్యర్థులు బలైపోయారని అన్నారు. శవ రాజకీయాలు చేయడంలో జగన్ తరవాతే ఎవరైనా అని వైసీపీ నేత బొత్స సత్యనారాయణ గతంలో అనలేదా..? అని ప్రశ్నించారు. తండ్రి శవాన్ని రాజకీయ ఉనికి కోసం ఉపయోగించుకోలేదా..? అని జగన్‌ను మంత్రి సవిత నిలదీశారు. తల్లిని, చెల్లెళ్లను సైతం ఏడిపిస్తున్నారని మండిపడ్డారు.

### చంద్రబాబుతోనే రాయలసీమ అభివృద్ధి

రాయలసీమ అభివృద్ధికి సీఎం చంద్రబాబునాయుడు అహర్నిశలూ కృషి చేస్తున్నారని మంత్ర సవిత కొనియాడారు. కియాలాంటి అంతర్జాతీయ కార్ల పరిశ్రమను తీసుకొచ్చారన్నారు. రాయల్ ఎన్ ఫీల్డ్ పరిశ్రమతో పాటు ఏరో స్పేస్ పరిశ్రమను నెలకొల్పుతున్నారన్నారు. హార్టీకల్చర్ హబ్‌గా, సోలార్ హబ్‌గా, పారిశ్రామిక హబ్‌గా రాయలసీమను అభివృద్ధి చేస్తున్నారన్నారు. రాయలసీమలో ఫ్యాక్షనిజాన్ని అంతమొందించి, ఇక్కడి బిడ్డలను ఇంజనీర్లుగా, డాక్టర్లుగా, ఐటీ ఉద్యోగులుగా తీర్చిదిద్దిన ఘనత కూడా సీఎం చంద్రబాబునాయుడిదేనన్నారు. రాయలసీమలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి అధిక నిధులు కేటాయిస్తున్నారన్నారు. సీఎం చంద్రబాబునాయుడు రాయలసీమ అభివృద్ధి ప్రదాత అయితే, జగన్ ద్రోహిగా నిలబడ్డారన్నారు.

### ఆ అర్హత జగన్‌కు లేదు

కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలో రాష్ట్రంలో అభివృద్ధితో పాటు సంక్షేమానికి అధిక ప్రాధాన్యమిస్తున్నామని మంత్రి సవిత తెలిపారు. రాష్ట్ర ఐటీ, విద్య శాఖ మంత్రి నారా లోకేశ్ రాష్ట్రాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. రాష్ట్రానికి రూ.25 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు రావడంలో మంత్రి నారా లోకేశ్ కీలకంగా వ్యవహరించారన్నారు. గాడితప్పన విద్య వ్యవస్థను ప్రక్షాళన చేసి, ఏపీ విద్యా వ్యవస్థను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దుతున్నారన్నారు. దేశంలోనే ఏపీని అగ్ర పథాన నిలుపుతున్న మంత్రి నారా లోకేశ్ గురించి మాట్లాడే అర్హత జగన్‌కు లేదని మంత్రి సవిత తేల్చి చెప్పారు. రాజకీయ ఉనికి కోసం జగన్ మరోసారి శవ రాజకీయాలకు తెరలేపారని, ఆయనను ఎవరూ పట్టించుకోవడం లేదని మంత్రి సవిత తెలిపారు.

### చెత్త ఊడ్చి... చేతులతో ఎత్తి...

అంతకుముందు శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ పట్టణంలో నిర్వహించిన ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమంలో మంత్రి సవిత పాల్గొని చెత్త ఊడ్చారు. స్వయంగా మంత్రి తన చేతులతో చెత్త తీసి డస్ట్ బిన్‌లో వేశారు.

## ప్రజలకు, కార్యకర్తలకు అండగా ఉండే ఏకైక పార్టీ తెలుగుదేశం

- సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత
- 15 మందికి రూ.14 లక్షల రూపాయల చెక్కుల అందజేత
- మహానాడును విజయవంతం చేయాలని శ్రేణులకు పిలుపు



రాప్తాడు (చైతన్యరథం): ప్రజలకు కష్టం వచ్చినా, కార్యకర్తలకు కష్టం వచ్చినా.. ముందుగా స్పందించేది తెలుగుదేశం పార్టీ మాత్రమేనని. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. నియోజకవర్గంలోని పలువురికి ఆమె సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. రామగిరి పంచాయతీరాజ్ శాఖ అతిథి గృహంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు. రామగిరి, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాలకు చెందిన 15మంది లబ్ధిదారులకు సుమారు 14లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆమె అందజేశారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు ఎమ్మెల్యే పరిటాల సునీతకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ... అనారోగ్యంతో ప్రైవేట్ ఆస్పత్రిల్లో చికిత్సలు పొంది ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారిని సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆదుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలకు కష్టం ఉందంటే ముఖ్యమంత్రి చంద్రబాబు వెంటనే స్పందిస్తున్నారన్నారు. ఇప్పటికే 23 నెలల్లో 1290 మందికి రూ.9.82 కోట్ల మేర సాయం అందించినట్లు చెప్పారు. గతంలో ఎప్పుడూ ఈ విధంగా సాయం అందలేదన్నారు. ప్రజలకు ఇలా కష్టకాలంలో అండగా ఉండటమే కాకుండా పార్టీ కార్యకర్తల కోసం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ ప్రత్యేకంగా చొరవ తీసుకుని ఐదు లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించినట్లు చెప్పారు. టీడీపీ సభ్యత్వం ఉన్న కార్యకర్త ఎవరైనా చనిపోతే ఐదు లక్షల వరకు వారికి ఇన్సూరెన్స్ సాయం అందుతుందన్నారు. ఈ విషయం చాలామందికి తెలియక ఆలస్యంగా స్పందిస్తున్నారని... నాయకులు చొరవ తీసుకొని ఎవరైనా చనిపోయిన వెంటనే తమ దృష్టికి తీసుకొని రావాలని ఎమ్మెల్యే సునీత సూచించారు. ఈ కార్యక్రమం అనంతరం పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈనెల 27, 28 తేదీల్లో నిర్వహించబోయే మహానాడుకు సంబంధించి ఎమ్మెల్యే సునీత కీలక సూచనలు చేశారు. పొదుపు చర్యల్లో భాగంగా ఈసారి వర్చువల్ గా మహానాడు ఉంటుందని.. ప్రతి క్లస్టర్ పరిధిలోని వారు ఈ కార్యక్రమంలో పాల్గొనాలన్నారు.

## ప్రజల సహకారంతోనే స్వచ్ఛ ధర్మవరం సాధ్యం : మంత్రి సత్యకుమార్

ధర్మవరం (చైతన్యరథం): శ్రీ సత్య సాయి జిల్లా ధర్మవరం పట్టణంలో శనివారం పురపాలక సంఘం ఆధ్వర్యంలో క్లీన్ స్వీప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పాల్గొని మాట్లాడారు. స్వచ్ఛ ధర్మవరం సాధ్యం కావాలంటే దానికి ప్రజలందరి సహకారం ఉండాలన్నారు. చెత్త ఎక్కడపడితే అక్కడ వేయకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని మంత్రి తెలిపారు.



# ప్రవాసాంధ్ర

# చైతన్యరథం



తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిన

# మహనీయుడు ఎన్టీఆర్

## ఖతార్ మినీ మహానాడు వేడుకల్లో మంత్రి కొలుసు పార్థసారథి

## దోహాలో అంబరాన్నంటిన పసుపు సంబరాలు

**దోహా (ఖతార్):** తెలుగు జాతి ఆత్మ గౌరవాన్ని ప్రపంచానికి చాటిన మహనీయుడు ఎన్టీఆర్ అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఖతార్ రాజధాని దోహాలో నిర్వహించిన మినీ మహానాడుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సమాజమే దేవాలయం-ప్రజలే దేవుళ్లు అన్న నినాదంతో తెలుగుదేశం పార్టీని స్థాపించిన ఎన్టీఆర్ సంక్షేమ పథకాల అమలుతో పేదల పాలిట దేవుడు అయ్యారన్నారు. ప్రవాస భారతీయుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా "ఎన్ఆర్ఐ గ్రీవెన్స్ సెల్" ఏర్పాటు దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రపంచంలోని ఏ ప్రాంతంలో ఉన్నా తెలుగు ప్రవాసుల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరిస్తుందన్నారు. ఏ చిన్న సమస్య వచ్చినా ప్రభుత్వం తరపున తన బృందం ద్వారా పరిష్కరించేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రస్తుతం పెట్టుబడులకు అనుకూలమైన రాష్ట్రంగా వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, యూత్-డైనమిక్ నాయకుడు నారా లోకేష్ రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడానికి విశేష కృషి చేస్తున్నారన్నారు. ప్రవాసాంధ్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టాలని పిలుపునిచ్చారు. ఏపీ భవిష్యత్తులో దేశంలోనే అత్యుత్తమ అవకాశాల కేంద్రంగా అవతరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

కాగా దోహాలో మినీ మహానాడు కనీవినీ ఎరుగని రీతిలో జరిగింది. ఎన్ఆర్ఐ టీడీపీ ఖతార్ ఆధ్వర్యంలో మద్దిపోటి నరేష్ నాయకత్వంలో జరిగిన సభకు అల్‌ఖోర్, రాస్‌లాఫాన్, దుఖాన్, మెసాయిద్, అల్‌వక్ర, దోహా ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో తెలుగు ప్రవాసులు తరలివచ్చి విజయవంతం చేశారు. సభా ప్రాంగణం మొత్తం జై ఎన్టీఆర్ నినాదాలతో మార్మోగింది. ఖతార్‌లో తెలుగు సమాజ ఐక్యత, తెలుగుదేశం పార్టీపై ఉన్న అభిమానానికి ఈ సభ నిదర్శనంగా నిలిచింది. "మా తెలుగు తల్లికి మల్లెపూదండ" గీతంతో ప్రారంభమైన సభ దేశ భక్తి, తెలుగు సంస్కృతి ప్రతిబింబించేలా సాగింది. చిన్నారుల సంప్రదాయ కూచిపూడి, భరతనాట్య నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఎన్టీఆర్ పాత్రలను ప్రతిబింబిస్తూ నిర్వహించిన సోలో అభినయాలకు విశేష స్పందన లభించింది. యుగ పురుషుడు, ఆంధ్రుల అన్న ఎన్టీఆర్ 104వ జయంతి సందర్భంగా రచించిన ప్రత్యేక గీతాన్ని మంత్రి పార్థసారథి విడుదల చేయగా ప్రేక్షకులను అలరించింది.





ఈ సందర్భంగా పలు కీలక తీర్మానాలను ప్రవేశపెట్టారు. ముఖ్యంగా దోహా నుంచి విజయవాడ, తిరుపతి, విశాఖపట్నం నగరాలకు నేరుగా విమాన సర్వీసులను వీలైనంత త్వరగా ప్రారంభించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతూ తీర్మానం చేశారు. ఖతార్, గల్ఫ్ దేశాల్లో పని చేస్తున్న బ్లూ కాలర్ కార్మికులకు ఏపీఎన్ఆర్టీఎస్ సేవలను మరింత విస్తృతం చేయాలని మంత్రికి వినతిపత్రం అందజేశారు.

ఖతార్‌లో 25 సంవత్సరాలకు పైగా సేవలందిస్తూ ఖతార్ అభివృద్ధికి తోడ్పాటుతో పాటు తెలుగు సమాజానికి విశిష్ట సేవలు అందించిన ప్రముఖులను ప్రత్యేకంగా సత్కరించారు. దీర్ఘకాలంగా సమాజ సేవలో అంకితభావంతో పనిచేసిన వారికి మంత్రి పార్థసారథి జ్ఞాపికలు అందజేసి అభినందించారు. తెలుగు సంస్కృతి, ఐక్యతను కాపాడుతూ సమాజానికి సేవలందిస్తున్న ప్రవాసుల కృషి అభినందనీయమన్నారు. ముఖ్యంగా ఖతార్‌లో తెలుగు సమాజాన్ని ఐక్యంగా ముందుకు తీసుకెళ్తున్న సీనియర్ సభ్యుల అంకితభావం యువతకు ఆదర్శమని ప్రశంసించారు.

అనంతరం కేక్ కటింగ్, సాంస్కృతిక ప్రదర్శనలు, మహానాడు సభ ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగాయి. కార్యక్రమంలో ఖతార్ టీడీపీ నాయకులు మద్దిపోటి నరేష్, పొనుగుమాటి రవి, విక్రమ్ సుఖవాసి, బొడ్డు రామారావు, జేవీవీ సత్యనారాయణ, మలిరెడ్డి సత్యనారాయణ, నూతలపాటి నరేష్, కొడాలి సుధాకర్, మల్లేశ్వరరావు, టీడీపీ కార్యకర్తలు, అభిమానులు, ప్రవాసాంధ్రులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.








# 'నాట్స్' సేవా దృక్పథం

## చార్లెట్‌లో ఘనంగా ఉచిత వైద్య శిబిరం




**చార్లెట్:** అమెరికాలో భాషే రమ్యం.. సేవే గమ్యం అంటూ సేవలందిస్తున్న ఉత్తర అమెరికా తెలుగు సంఘం (నాట్స్) తాజాగా చార్లెట్ చాప్టర్ ఆధ్వర్యంలో స్థానిక ప్రవాస తెలుగు వారి కోసం ఉచిత వైద్య శిబిరం నిర్వహించింది. సమాజంలో ఆరోగ్య అవగాహనను పెంపొందించడం, నివారణోపాయాలపై సరైన మార్గదర్శకత్వం అందించడమే లక్ష్యంగా 'క్రీష్యా కేర్స్' వేదికగా ఈ శిబిరం ఏర్పాటు చేశారు. 50 మందికి పైగా రిజిస్టర్ చేసుకుని ఉచిత వైద్య సేవలు, సలహాలు పొందారు. గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ వినీత్ కొర్రపాటి, ఫ్యామిలీ ఫిజిషియన్ డాక్టర్ కిషన్ మరమరాజ్, కార్డియాలజిస్ట్ డాక్టర్ కార్తీక్ శఠగోపం, ఆంకాలజిస్ట్ డాక్టర్ గీతా వల్లభనేని శిబిరానికి విచ్చేసిన వారికి ఉచితంగా వైద్య సేవలు అందించారు. గుండె జబ్బులు, జీర్ణక్రియ సమస్యలు, క్యాన్సర్ నివారణోపాయాలతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలిని ఎలా అలవర్చుకోవాలనే అంశాలపై రోగులకు సూచనలు అందించారు.



నిపుణులైన డాక్టర్లను నేరుగా కలిసి తమ ఆరోగ్య సమస్యలను నివృత్తి చేసుకునే అవకాశం కల్పించడంపై లబ్ధిదారులు 'నాట్స్' ప్రతినిధులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నాట్స్ చార్లెట్ చాప్టర్ ఆర్గనైజింగ్ టీమ్, వాలంటీర్లు సమిష్టి కృషితో శిబిరం విజయవంతమైంది.

# సిడ్నీలో ఘనంగా ఎన్టీఆర్ జయంతి


## టీడీపీ ఆస్ట్రేలియా విభాగం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం







**సిడ్నీ:** తెలుగు ప్రజల ఆరాధ్య దైవం నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) జయంతిని పురస్కరించుకుని ఆస్ట్రేలియాలోని సిడ్నీ నగరంలో టీడీపీ ఆస్ట్రేలియా విభాగం రక్తదాన శిబిరం నిర్వహించింది. ఆస్ట్రేలియన్ రెడ్‌క్రాస్ భాగస్వామ్యంతో ఏర్పాటుచేసిన ఈ మానవతా కార్యక్రమానికి ప్రవాస తెలుగువారి నుంచి విశేష స్పందన లభించింది. మహా నాయకుడు ఎన్టీఆర్ ఆశయాలకు అనుగుణంగా సమాజ సేవలో భాగంగా ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో సిడ్నీలోని తెలుగు సమాజం పెద్ద ఎత్తున పాల్గొని రక్తదానం చేసింది. ఈ శిబిరం విజయవంతం కావడానికి విజయ్ చెన్నుపాటి, శ్రీనివాస్ పల్లాపోతు, మహేష్ గద్దె, బాల మైనేని, శిరీష కోడూరి, రంజిత్ కావూరి, వసంత్ మన్నె, శ్రీనివాస్ కిలారు, ఉమ కాకుమాని, శశిధర్ జారుగుల, వీరబాబు వాసంశెట్టి కీలక పాత్ర పోషించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్టీఆర్ జయంతి వేళ ప్రాణ రక్షక సేవ కార్యక్రమాన్ని నిర్వహించడం గర్వంగా ఉందన్నారు. రక్తదానం చేసి ఎంతోమంది ప్రాణాలను కాపాడేందుకు ముందుకు వచ్చిన ప్రతి ఒక్కరికీ, కార్యక్రమ విజయవంతానికి కృషి చేసిన వాలంటీర్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.



# భారత్-అమెరికా భాగస్వామ్యం ప్రపంచానికి కీలకం



- యూఎస్ విదేశాంగ మంత్రి మార్క్ రుబియో
- ముడిచమురు సరఫరాకు సిద్ధంగా ఉన్నాం
- ముడిచమురు సరఫరాకు సిద్ధంగా ఉన్నాం
- సేవాతీర్థ్‌లో ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ

ఢిల్లీ: భారత పర్యటనలో భాగంగా అమెరికా విదేశాంగ మంత్రి రుబియో ముందుగా కోల్‌కతాను సందర్శించారు. అనంతరం ఢిల్లీలో విదేశాంగ మంత్రి జైశంకర్‌తో సమావేశమయ్యారు. క్వాడ్ కూటమి బలోపేతం, చైనా ప్రభావం, ప్రాంతీయ భద్రత వంటి అంశాలు ప్రధాన చర్చగా మారాయి. అనంతరం సేవా తీర్థ్ (పీఎంవో)లో ప్రధానితో గంట పాటు భేటీ అయ్యారు. ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం, రక్షణ, వాణిజ్యం, ఇండో-పసిఫిక్ భద్రత అంశాలపై చర్చలు జరిగినట్లు సమాచారం. ప్రధానితో భేటీ అనంతరం రుబియో మీడియాతో మాట్లాడారు. తమ దేశానికి భారత్ అత్యంత కీలక భాగస్వామి అని రుబియో పేర్కొన్నారు. 'భారత్-అమెరికా మధ్య బంధాలు మరింత బలపడనున్నాయి. భారతీయ కంపెనీలు అమెరికాలో 20 బిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడులు పెట్టాయి. భారత్‌కు ముడి చమురును సరఫరా చేయడానికి అమెరికా సిద్ధంగా ఉంది. ప్రపంచ ఇంధన మార్కెట్‌ను తన ఆధీనంలోకి తీసుకోవడానికి ఇరాన్ చేస్తున్న ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని రుబియో స్పష్టం చేశారు. కాగా, ప్రపంచ శ్రేయస్సు కోసం అమెరికాతో కలిసి పనిచేయడానికి భారత్ సిద్ధంగా ఉందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ఇరాన్‌తో నెలకొన్న ఉద్రిక్తతలను పరిష్కరించుకోవడానికి శాంతియుతంగా చర్చలు జరపాలని ప్రధాని సూచించారు.

**కోల్‌కతాలో మథర్‌థెరిసా ట్రఛారిటీ సందర్శన**

రుబియో ముందుగా కోల్‌కతాకు చేరుకుని మథర్ థెరిసా స్థాపించిన మిషనరీస్ ఆఫ్ ఛారిటీ ప్రధాన కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం ఢిల్లీకి చేరుకుని ప్రధాని మోదీతో సమావేశమయ్యారు. రుబియో భారత పర్యటనలో ముఖ్యంగా క్వాడ్ భాగస్వామ్యం, చైనా ప్రభావం, సరఫరా గొలుసులు, రక్షణ సహకారం, ఇంధన భద్రత వంటి అంశాలు ప్రధాన చర్చగా మారాయి. భారత్-అమెరికా సంబంధాలను మరింత బలోపేతం చేయడమే ఈ పర్యటన లక్ష్యంగా విశ్లేషకులు భావిస్తున్నారు.

**భద్రత, వాణిజ్యం, సాంకేతిక రంగాల్లో సహకారంపై చర్చలు**

ఇరుదేశాల మధ్య భద్రత, వాణిజ్యం, కీలక సాంకేతిక రంగాల్లో సహకారాన్ని మరింత పెంపొందించడంపై ప్రధాని మోదీ, అమెరికా విదేశాంగ మంత్రి రుబియో మధ్య చర్చలు జరిగినట్టు భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియో గోర్ వెల్లడించారు. అలాగే స్వేచ్ఛాయుత ఇండో-పసిఫిక్‌ను ముందుకు నడిపించే మార్గాలపై కూడా చర్చలు జరిగినట్టు తెలిపారు.

# చిన్నారుల అదృశ్యాన్ని కిడ్నాపింగ్‌గానే దర్యాప్తు చేయాలి

- 47,000 వేల మంది ఆచూకీ లభించకుండా పోయింది
- కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు సంచలన ఆదేశాలు
- ఐదు కీలక మార్గదర్శకాలు

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా నానాటికీ పెరిగిపోతున్న చిన్నారుల అదృశ్యం కేసులపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ప్రస్తుతం దేశంలో దాదాపు 47,000 మంది చిన్నారుల ఆచూకీ లభించకుండా పోయిందని, ప్రతి ఏటా ఈ బ్యాక్‌లాగ్ పెరుగుతుండటంపై తీవ్ర అసంతృప్తిని వెలిబుచ్చింది. ఈ వ్యవస్థాగత లోపాలను సరిదిద్దడానికి, అంతర్రాష్ట్ర మానవ అక్రమ రవాణా (హ్యూమన్ ట్రాఫికింగ్) ముఠాల నెట్‌వర్క్‌ను ఛేదించడానికి సుప్రీంకోర్టు సంచలన ఆదేశాలు జారీ చేసింది.

**ఐదు కీలక ఆదేశాలు**

జస్టిస్ అహసానుద్దీన్ అమానుల్లా, జస్టిస్ ఆర్. మహాదేవ న్‌లతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం.. చిన్నారుల అదృశ్యం కేసులను కేవలం 'మిస్సింగ్' కేసులుగా కాకుండా అంతర్రాష్ట్ర ముఠాల కిడ్నాప్ కోణంలోనే దర్యాప్తు చేయాలని స్పష్టం చేసింది. పోలీసుల వద్ద ఉన్న క్రిమినల్ ట్రాకింగ్ డేటాబేస్, చైల్డ్ వెల్ఫేర్ అథారిటీల వద్ద ఉన్న 'విశాల్ వాసిల్య' డేటాబేస్ మధ్య సమన్వయం లేకపోవడాన్ని కోర్టు తప్పు పట్టింది. ఈ క్రమంలో సుప్రీంకోర్టు ఐదు కీలక ఆదేశాలను జారీ చేసింది.

**డేటాబేస్‌ల అనుసంధానం**

దేశంలోని వివిధ సంస్థలు నిర్వహిస్తున్న చిన్నారుల డేటాబేస్‌లను అనుసంధానం (ఇంట గ్రేట్) చేయాలని కేంద్ర హోం మంత్రిత్వ శాఖను కోర్టు ఆదేశించింది. దీనివల్ల పోలీస్ అధికారులు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీలు, జిల్లా బాలల రక్షణ విభాగాలు చైల్డ్ కేర్ హోమ్‌ల మధ్య సమాచారం రియల్ టైమ్‌లో షేర్ అవుతుంది.

**ఏహెచ్‌టీ యూనిట్స్ పునరుద్ధరణ**

చాలా జిల్లాల్లో మానవ అక్రమ రవాణా నిరోధక విభాగాలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. దేశంలోని అన్ని ఏహెచ్‌టీయూలను తగిన అధికారాలు, మౌలిక సదుపాయాలతో 4 వారాల్లోగా పూర్తిగా అందుబాటులోకి తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.

**కిడ్నాపింగ్ కిందే కేసు నమోదు**

ఏదైనా చైల్డ్ మిస్సింగ్ కేసు నమోదైన వెంటనే.. అధికారులు ప్రాథమికంగా దానిని కిడ్నాప్ లేదా అపహరణగా భావించి దర్యాప్తు



ప్రారంభించాలి. దీనివల్ల ప్రొసీజర్ ఆలస్యం కాకుండా దర్యాప్తులో సీరియస్‌నెస్ వస్తుందని కోర్టు పేర్కొంది. ఒకవేళ ఆ కేసులో హ్యూమన్ ట్రాఫికింగ్ అనుమానాలు ఉంటే.. నిబంధనల ప్రకారం 4 నెలలు వేచి చూడకుండా వెంటనే కేసును ఏహెచ్‌టీయూ విభాగానికి బదిలీ చేయాలని స్పష్టం చేసింది.

**24 గంటల్లోగా కుటుంబానికి అప్పగింత**

రక్షించిన లేదా రికవరీ చేసిన చిన్నారులను సాధారణంగా 24 గంటల్లోగా వారి కుటుంబాలకు అప్పగించాలి. ఒకవేళ ఆ నిర్దిష్ట చైల్డ్ ట్రాఫికింగ్ లేదా దోపిడీ వెనుక కుటుంబ సభ్యుల ప్రమేయం ఉన్నట్లు అనుమానం వస్తే తప్ప, మిగిలిన సమయాల్లో తక్షణమే తల్లిదండ్రుల వద్దకు చేర్చాలి. కుటుంబసభ్యులపై అనుమానం ఉంటే ఆ బాధ్యతను చైల్డ్ వెల్ఫేర్ కమిటీలు చూసుకోవాలి.

**గుర్తింపు నిర్ధారణ, పర్యవేక్షణ**

రక్షించిన ప్రతి బిడ్డకు ఒకే గుర్తింపు ఉండేలా చూసు కోవడం, భవిష్యత్తులో వారి ఆచూకీని సులభంగా పర్యవేక్షించడం కోసం అవసరమైన అధికారిక రిజిస్ట్రేషన్, వెరిఫికేషన్ ప్రక్రియలను వేగవంతం చేయాలని డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్లను కోర్టు ఆదేశించింది. తద్వారా ఐడెంటిటీ డూప్లికేషన్‌ను నిరోధించవచ్చని పేర్కొంది.

**కేసు నేపథ్యం ఏమిటి?**

2011 సెప్టెంబరులో చెన్నైలోని విరుగంబాక్కం పరిధిలో 'కవిత' అనే చిన్నారి అదృశ్యమైంది. స్థానిక పోలీసులు, సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ దర్యాప్తు చేసినా ఆచూకీ లభించక పోవడంతో పోలీసులు ఈ కేసును అన్ డిటెక్టబుల్(ఆచూకీ లభించనిది)గా పేర్కొంటూ క్లోజర్ రిపోర్ట్ ఇచ్చారు. దీనిపై తండ్రి జి.గణేష్ దాఖలు చేసిన పిటిషన్‌ను 2025 మార్చిలో మద్రాస్ హైకోర్టు తిరస్కరించింది. చిన్నారి 2011లో మిస్ అయింది కావున, 2013లో వచ్చిన హోం శాఖ యాంటీ-ట్రాఫికింగ్ గైడ్‌లైన్స్ దీనికి వర్తించవని హైకోర్టు పేర్కొంది. ఈ తీర్పును సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. 'చిన్నారి ఆచూకీ లభించనంత కాలం చైల్డ్ ప్రొటెక్షన్ గైడ్‌లైన్స్, యాంటీ-ట్రాఫికింగ్ ప్రొటోకాల్స్ అమలు చేయాల్సిన బాధ్య త ప్రభుత్వాలపై ఉంటుంది' అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ కేసును సుమోటోగా స్వీకరించి దేశవ్యాప్తంగా ఉన్న మిస్సింగ్ చిన్నారుల సమస్యపై ఈ సమగ్ర ఆదేశాలు జారీ చేసింది. ఇక, ఈ కేసు తదుపరి విచారణ ఆగస్టు, 2026కు వాయిదా వేసింది. ఆ సమయంలోగా అన్ని రాష్ట్రాలు, అధికారులు దీనిపై నివేదిక సమర్పించాల్సి ఉంటుంది.



# భారత్‌ను ఏ శక్తి ఆపలేదు

**- కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్**

షిర్డి: ఒకప్పుడు ఆయుధాలు దిగుమతి చేసుకునే దశలో ఉన్న ఇండియా రాబోయే 25-30 ఏళ్లలో అతిపెద్ద ఆయుధాల సరఫరాదారుగా నిలవనుందని, దీనిని ఏ శక్తీ అడ్డుకోలేదని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. షిర్డీలో మందుగుడు సామగ్రి తయారీ కేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్షణ ఉత్పత్తుల్లో ప్రైవేటు రంగం పాత్ర ను 50 శాతానికి తీసుకువెళ్లడమే తమ లక్ష్యమని చెప్పారు. రక్షణరంగానికి కేవలం నట్లు, బోల్టుల సరఫరాదారుగానే ప్రైవేటు రంగం మిగిలి పోవడం లేదన్నారు. అత్యాధునిక ఆయుధాల వ్యవస్థలో కీలక తయారీదారుగా ఉండనుందని చెప్పారు. ప్రభుత్వ విజన్, ప్రైవేట్ సెక్టార్ వినూత్న ఆవిష్క రణల సమన్వయంతో దేశం కొత్త శిఖరాలను అధిరోహి స్తుందని రాజ్‌నాథ్‌సింగ్ ధీమా వ్యక్తం చేశారు. అందరం కలిసికట్టుగా పనిచేసి భారత్‌ను మందు గుండు సామగ్రి తయారీ, ఆటోమేషన్ హబ్‌గా రూపొందిద్దామని అన్నారు.

# రాజౌరిలో ఎన్‌కౌంటర్

**- బలగాల ఉచ్చుల్లో ముగ్గురు పాక్ ఉగ్రవాదులు**

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని రాజౌరి జిల్లా డొరిమల్ అటవీ ప్రాంతంలో ఉగ్రవాదులకు, భద్రతా బలగాలకు మధ్య శనివారంనాడు ఎదురెదురు కాల్పులు చోటుచేసుకున్నాయి. ఇంటెలిజెన్స్ సమాచారం ప్రకారం పోలీసుల సంయుక్త బృందం వలలో ఇద్దరు నుంచి ముగ్గురు పాక్ ఉగ్రవాదులు చిక్కుకున్నట్టు తెలుస్తోంది. మిలిటెంట్ల కోసం గాలింపు ఆపరేషన్ కొనసాగుతోంది. టెర్రరిస్టుల సంచారంపై సమాచారం రావడంతో భద్రతా బలగాలు అటవీ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టారని, ఇది గమనించిన టెర్రరిస్టులు కాల్పులకు దిగడంతో ఎన్‌కౌంటర్ చోటుచేసుకుందని చెబుతున్నారు. కాగా, కిష్ట్వార్ నుంచి టెర్రరిస్ట్ నెట్‌వర్క్‌ను సమూలంగా నిర్మూలించినట్టు గత ఫిబ్రవరిలో ఇండియన్ ఆర్మీ వైట్ నైట్ కార్ప్స్ ప్రకటించారు. ఏడుగురు టెర్రరిస్టుల ఫొటోలను సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 326 రోజుల తర్వాత కిష్ట్వార్‌లోని



టెర్రర్ నెట్‌ఫర్క్‌ను తుడిచి వేశామని పేర్కొన్నారు. హతుల్లో కిష్ట్వార్ టెర్రర్ ఆపరేషన్ మాస్టర్‌మైండ్ జైషే కమాండర్ సైఫుల్లా కూడా ఉన్నాడు.

**పాక్‌కు ఆర్మీ జనరల్ ఉపేంద్ర ద్వివేది వార్నింగ్**

ఇండియన్ ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది గత వారంలో ఇస్లామాబాద్‌కు గట్టి వార్నింగ్ ఇచ్చారు. టెర్రరిస్టులకు ఆశ్రయం ఇవ్వడం, ఇండియాకు వ్యతిరేకంగా టెర్రర్ ఆపరేషన్లు నిర్వహించడం మానకపోతే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుందని, ప్రపంచపటంలో పాకిస్థాన్ ఉనికినే ప్రశ్నార్థకం చేస్తామని హెచ్చరించారు.

# ఒప్పందం కుదరకుంటే.. యుద్ధమే!

## - మళ్లీ దాడికి అమెరికా రెడీ.. గగనతలాన్ని మూసేసిన ఇరాన్

పశ్చిమాసియాలో పరిస్థితులు ఎప్పటికప్పుడు వేగంగా మారిపోతున్నాయి. ఓవైపు చర్చలు కొనసాగుతుండగానే ఇరాన్‌పై మరోసారి దాడికి దిగేందుకు అమెరికా సన్నద్ధమవుతుందంటూ వార్తలు వెలువడ్డాయి. ఈ క్రమంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇరాన్ తన గగనతలాన్ని మూసివేసింది. దేశంలోని పశ్చిమ ప్రాంతం వైపువున్న గగనతలాన్ని మూసివేస్తున్నట్టు ఇరాన్ పౌర విమానయాన సంస్థ సిబ్బందికి నోటమ్ జారీచేసింది. ఈనెల 25 వరకు అన్ని విమానాల రాకపోకలను నిలిపివేస్తున్నట్టు తెలిపింది. ఈ నోటమ్ జారీచేసే సమయంలో ఖతార్ ప్రభుత్వానికి చెందిన ఓ వీఐపీ విమానం ఇరాన్ గగనతలాన్ని దాటింది. ఆ విమానం శాంతి ఒప్పందానికి సంబంధించిన చర్చల కోసం టెహ్రాన్‌కు వచ్చిన ఖతార్ ప్రతినిధి బృందానికి చెందినదిగా తెలుస్తోంది. ఇక అమెరికా– ఇరాన్ మధ్య చర్చలు తుదిదశకు చేరుకున్నాయని, ఒప్పందానికి సంబంధించిన చాలా అంశాల్లో ఇరుదేశాల మధ్య సయోధ్య



కుదిరినట్టు తెలుస్తోంది. దీంతో ఏ క్షణమైనా ఒప్పంద ప్రకటన వెలువడే అవకాశముంది.

అదే సమయంలో ఈ దౌత్య ప్రయత్నాలు చివరి నిమిషంలో విఫలమైతే.. టెహ్రాన్‌పై మళ్లీ దాడులు చేసే విషయాన్ని అధ్యక్షుడు ట్రంప్ తీవ్రంగా పరిశీలిస్తున్నట్లు వార్తలు వచ్చాయి. ఈ క్రమంలో ఇరాన్ కూడా తన గగనతలాన్ని మూసివేయడంతో.. పశ్చిమాసియాలో ఏ క్షణాన ఏం జరుగుతుందోననే భయాందోళనలు నెలకొన్నాయి.

# ఇవాంకా హత్యకు కుట్ర?

## ఇరాన్‌తో సంబంధాలున్న ఉగ్రవాది అరెస్టు



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పెద్ద కుమార్తె ఇవాంకా ట్రంప్ హత్యకు కుట్ర జరిగినట్టు ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ కోర్ (ఐఆర్జీసీ)తో సంబంధాలున్న ఓ ఇరాకీ వ్యక్తి ఈ పథకం పన్నినట్టు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. 2020లో ఇరాన్ అగ్రశ్రేణి కమాండర్ ఖాసీం సులేమానీ హత్యకు ప్రతీకారంగా ఆమెను హతమార్చేందుకు ఈ కుట్ర చేశాడని తెలిపాయి. 32 ఏళ్ల మహమ్మద్ బాఖర్ సాద్ దావూద్ అల్ సాదీ ఈనెల 15న టర్కీయేలో అరెస్టు అయ్యాడు. తర్వాత అతడిని అమెరికాకు తరలించారు. ఇరాన్ మద్దతుగల కతాయిబ్ హిజ్బొల్లా అనే సంస్థ తరఫున అతడు పనిచేసేవాడని, ఐరోపా, ఉత్తర అమెరికాల్లో 18 దాడులు, దాడి యత్నాల్లో అతడి పాత్ర ఉందని అధికారులు ఆరోపించారు. విచారణలో అతడి వద్ద ఫ్లోరిడాలోని ఇవాంకా నివాసం, ఆమె భర్త జేరెడ్ కుష్నర్‌తో కలిసి ఉంటున్న ఇంటి బ్లూప్రింట్ ఉన్నట్టు దర్యాప్తు అధికారులు గుర్తించారు. ఆమె నివాసం ఫొటోలు, మ్యాప్‌లను సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నాడని ఆరోపణ. 2020 జనవరిలో బాగ్దాద్ విమానాశ్రయం సమీపంలో అమెరికా డ్రోన్ దాడిలో సులేమానీ మరణించాడు. ఐఆర్జీసీ ఎలైట్ విభాగం ఖుద్స్ ఫోర్స్‌కు అతడు కమాండర్‌గా ఉన్నాడు. సులేమానీని తండ్రి సమానంగా భావించిన అల్ సాదీ ఆయన మరణానికి ప్రతీకారం తీర్చుకుంటానని పదేపదే ప్రకటించాడని వర్గాలు తెలిపాయి. బాగ్దాద్‌లో పెరిగిన అతడు ఐఆర్జీసీ శిక్షణ కోసం టెహ్రాన్‌కు వెళ్లాడని, మతపరమైన యాత్రల ట్రావెల్ ఏజెన్సీ ముసుగులో అంతర్జాతీయంగా ప్రయాణించాడని ఆరోపణ.

# రష్యా సైన్యంలో భారతీయుల మృతి



## సుప్రీంకోర్టుకు కేంద్రం నివేదిక

రష్యా–ఉక్రెయిన్ యుద్ధంలో పోరాడుతున్న భారతీయ సైనికులకు సంబంధించిన కీలక వివరాలను కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెల్లడించింది. విదేశాంగ శాఖ సమాచారం ప్రకారం, మొత్తం 217మంది భారతీయులు రష్యా సైనిక దళంలో చేరినట్టు నిర్ధారించబడింది. వారిలో 139 మందిని కాంట్రాక్టు నుండి విముక్తి చేయడం జరిగింది. 49 మంది యుద్ధంలో మృతి చెందారు. 6గురు మిస్సింగ్‌లో ఉన్నారు. 23మంది ఎక్కడున్నారో ఇంకా తెలియదు. 26 మందిని రష్యా తన ఆధీనంలో ఉంచుకొని యుద్ధంలో పోరాడేలా వత్తిడి చేస్తోందని ఆరోపణలు ఉన్నాయి.

**కోర్టు విచారణ**

బాధిత కుటుంబాలకు నష్టపరిహారం కల్పించాలని, రష్యా నిర్బంధంలో ఉన్న భారతీయులను స్వదేశానికి తీసుకురావాలని పిటీషనర్ కోర్టును కోరారు. ఈ పిటీషన్‌పై స్పందించిన ప్రభుత్వం, సుమారు 21మంది బాధిత కుటుంబాల డీఎన్‌ఏ శాంపిల్లను రష్యా అధికారులకు పంపినట్టు అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి, చీఫ్ జస్టిస్ సూర్యకాంత్‌కు తెలిపారు. మాస్కోలోని భారతీయ అంబసీ.. మిస్సింగ్ సైనికుల కోసం అన్వేషణ కొనసాగిస్తున్నట్లు నివేదికలో పేర్కొన్నారు.

# ఇకనైనా భారత్‌కు వచ్చేయండి



అమెరికాలో శాశ్వత నివాస హక్కు కోరే తాత్కాలిక వలసదారులు ఇకపై దరఖాస్తులు సమర్పించడానికి స్వదేశానికి వెళ్లాల్సిఉంటుందని అమెరికా పౌరసత్వ, వలస సేవల సంస్థ (యూఎస్ సీఐఎస్) స్పష్టం చేసింది. దీనిపై తాజాగా జోహో వ్యవస్థాపకుడు శ్రీధర్ వెంబు స్పందించారు. యూఎస్‌లో తాత్కాలిక వీసాలపై ఉంటున్న భారతీయులు ఇకనైనా స్వదేశానికి తిరిగి రావాలని సూచించారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు పెట్టారు. 'అమెరికాలో వీసాలపై ఉన్న భారతీయులకు మరోసారి విజ్ఞప్తి చేస్తున్నా. దయచేసి స్వదేశానికి తిరిగి రండి. వెనక్కి రావడం అనే నిర్ణయం మీకు కష్టంగా అనిపించినా.. ఆత్మగౌరవమే మీ మార్గాన్ని నిర్దేశించాలి' అని సూచించారు. ఈ సందర్భంగా భారత్‌కు గర్వకారణంగా నిలుద్దామని పిలుపునిచ్చారు. కాగా.. అమెరికాలోని భారతీయులు స్వదేశానికి తిరిగి రావాలంటూ శ్రీధర్ వెంబు కోరడం ఇదే మొదటిసారి కాదు. భారత్‌కు మీ ప్రతిభ అవసరమంటూ గత నెలలో కూడా ఆయన ఈ మేరకు పిలుపునిచ్చారు. గ్రీన్‌కార్డు ప్రక్రియలో ట్రంప్ యంత్రాంగం తీసుకొచ్చిన ఈ కొత్త మార్పుపై పలువురు ప్రముఖుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. లింక్‌ఇన్ సహ వ్యవస్థాపకుడు రీడ్ హాఫ్‌మన్ ఈ వ్యవహారంపై స్పందిస్తూ.. 'ఇప్పుడు ఏఐ పరిశోధకులు, ఉద్యోగులు, విద్యార్థులు దేశాన్ని విడిచివెళ్లాలా? గ్రీన్‌కార్డు ప్రక్రియ పూర్తయ్యేవరకు వేచి ఉండాలా? ఇది టెక్, వ్యాపార సంస్థలతో సహ మొత్తం అమెరికాకే హానికరమైన చర్య' అన్నారు. గతంలో గూగుల్లో కీలక బృందానికి నాయకత్వం వహించిన ఏఐ నిపుణుడు ఆంద్రూ ఎన్జ్.. ఈ కొత్త నిబంధనను తప్పుబట్టారు. దీని కారణంగా అమెరికాలో వైద్యులు, ఉపాధ్యాయులు, శాస్త్రవేత్తల సంఖ్య తగ్గిపోతుందని ఆందోళన వ్యక్తంచేశారు. ఏఐలో అమెరికా పోటీతత్వాన్ని కూడా దెబ్బతీస్తుందని హెచ్చరించారు.

# బొగ్గు గనిలో పేలుడు

## 82మంది కార్మికుల దుర్మరణం




చైనాలో ఘోర విషాదం చోటుచేసుకుంది. లియుషెన్యు బొగ్గు గనిలో జరిగిన పేలుడు ఘటనలో మృతుల సంఖ్య భారీగా పెరిగింది. ఈ ప్రమాదంలో తొలుత మృతుల సంఖ్య తక్కువేనని వార్తలు రాగా.. తాజాగా ఆ సంఖ్య 82కి చేరింది. మరో 9మంది ఆచూకీ గల్లంతైనట్టు తెలుస్తోంది. ఈమేరకు అక్కడి అధికారిక మీడియా ఈ వివరాలను వెల్లడించింది. షాన్సీ ప్రావిన్స్‌లోని టోంగ్‌జౌ గ్రూప్‌నకు చెందిన లియుషెన్యు బొగ్గు గనిలో శుక్రవారం రాత్రి 7:30 గంటలకు గ్యాస్ లీకై పేలుడు సంభవించింది. ప్రమాద సమయంలో గనిలో 247మంది కార్మికులు విధుల్లో ఉన్నట్టు తెలుస్తోంది. ప్రమాదం జరిగిన వెంటనే రెస్క్యూ బృందాలు ఘటనా స్థలానికి చేరుకొని.. సహాయక చర్యలు చేపట్టాయి. ఈ క్రమంలో కొందరిని రక్షించినట్టు సమాచారం. ఈ ఘటనలో ఎనిమిదిమంది మరణించగా.. 38మంది గల్లంతయ్యారని శనివారం తెల్లవారుజామున అక్కడి వార్తా సంస్థ పేర్కొంది. అయితే తాజాగా మృతుల సంఖ్య పెరిగిపోయినట్టు అక్కడి మీడియా పేర్కొనడం గమనార్హం. గనిలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ప్రమాదానికి గల కారణాలపై కూడా అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే చైనా అధ్యక్షుడు షీ జిన్పింగ్ స్పందించారు. గనిలో సహాయక చర్యలు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. గాయపడినవారికి పూర్తిస్థాయిలో చికిత్స అందించాలన్నారు. ఈ ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు నిర్వహించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

# గ్రీన్‌కార్డ్.. కొత్త నిబంధనలు




అగ్రరాజ్యం అమెరికాలో శాశ్వత నివాస హక్కు కోరే తాత్కాలిక వలసదారులు ఇకపై దరఖాస్తులు సమర్పించడానికి స్వదేశానికి వెళ్లాల్సి ఉంటుందని అమెరికా పౌరసత్వ, వలస సేవల సంస్థ ఇటీవల స్పష్టంచేసింది. అయితే ఈ రూల్ అందరికీ కాదని తెలుస్తోంది. తాజాగా అమెరికా ఆ రూల్స్‌లో కొన్ని మినహాయింపులు ప్రకటించింది. అమెరికా జాతీయ ప్రయోజనాలు లేదా ఆర్థిక ప్రయోజనాలు ముఖ్యం అనుకునే వలసదారులకు ఈ రూల్స్ నుంచి మినహాయింపులు ఇస్తామని తెలిపింది. గ్రీన్‌కార్డ్ ఆశావహులు సమర్పించిన దరఖాస్తుల ఆధారంగా తమ దేశానికి ప్రయోజనం ఉందని భావిస్తే.. వాటిని తాము పరిగణనలోకి తీసుకుంటామని పేర్కొన్నది. దాంతో వారు ప్రస్తుత నిబంధనల ప్రకారమే కొనసాగే అవకాశం ఉంటుందని చెప్పింది. మిగతా వారిని వారి మాతృదేశానికి వెళ్లి దరఖాస్తు చేసుకోమని సూచిస్తామని యూఎస్‌సీఐఎస్ ప్రతినిధి జాక్ కహ్లర్ వెల్లడించారు. అవి తమ దేశానికి ప్రయోజనం కలిగించే వ్యక్తులనుంచి వచ్చిన దరఖాస్తులు అని ఎలా నిర్ణయిస్తారో మాత్రం ఆయన వెల్లడించలేదు.

స్పోర్ట్స్
చైతన్యరథం

# రోహిత్ శర్మ, యశస్వి జైస్వాల్‌లకు వైభవ్ టెన్షన్!




రాజస్థాన్: వన్డే వరల్డ్‌కప్ 2027 టోర్నీకి ఇప్పటినుంచే ఓపెనింగ్ జోడీపై టీమిండియా యాజమాన్యం ప్రణాళికలు సిద్ధం చేస్తోందని సమాచారం. దిగ్గజ ఓపెనర్ రోహిత్ శర్మను ఫిట్‌నెస్ కారణాల దృష్ట్యా టోర్నీ నుంచి తప్పించాలని బీసీసీఐ సెలక్టర్లు భావిస్తున్నట్లు ఇటీవల వార్తలు వైరల్ అయ్యాయి. ఈ క్రమంలో కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు జోడీగా ఇషాన్ కిషన్‌ను ఆడిస్తూ.. బ్యాకప్ ఓపెనర్‌గా యశస్వి జైస్వాల్‌ను ఎంపిక చేస్తారనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ క్రమంలో తాజాగా ఓ వార్త బయటకు వచ్చిం ది. రోహిత్ శర్మ ఫిట్‌నెస్‌కు లోబడి.. అఫ్ఘానిస్థాన్‌తో స్వదేశంలో జరిగే వన్డే సిరీస్‌లో ఆడతాడని బీసీసీఐ తెలిపింది. మరోవైపు.. అఫ్ఘాన్‌తో ఏకైక టెస్టుకు ఎంపికైన యశస్వి జైస్వాల్‌ను వన్డేలకు మాత్రం పక్కనపెట్టారు. ఈ నేపథ్యంలో శ్రీలంకలో భారత్-ఎ జట్టు తరపున గనుక యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ నిలకడగా రాణిస్తే.. వన్డే వరల్డ్‌కప్ 2027 నేపథ్యంలో వైభవ్ పేరును సెలక్టర్లు పరిగణనలోకి తీసుకుంటారనే టాక్ వినిపిస్తోంది. ఈ విషయం గురించి బీసీసీఐ సన్నిహిత వర్గాలు ఓ స్పోర్ట్స్ బ్లాగర్‌కు తెలిపారు. 'వైభవ్ సూర్యవంశీ త్వరలోనే భారత జట్టులో ఆడబోతున్నాడు. భారత్-ఎ తరపున అతడి ప్రదర్శనను బట్టి ఎంత త్వరగా జాతీయ జట్టులోకి వస్తాడన్నది తెలుస్తుంది. సెలక్టర్లు అతడి ఆట తీరును నిశితంగా పరిశీలిస్తున్నారు. వైభవ్ ఇలాగే నిలకడగా ఆడుతూ.. ఫామ్ కొనసాగిస్తే వన్డే వరల్డ్‌కప్ 2027 ఆడే భారత జట్టులో చోటు దక్కించుకోవడం పెద్ద కష్టమే మీ కాదు' అని బీసీసీఐ వర్గాలు పేర్కొన్నాయి. ఒకవేళ వైభవ్ గనుక ఊహించని రీతిలో ఈ జట్టులోకి వస్తే.. భారత క్రికెట్‌లో అదొక సంచలనమే అవుతుంది. ప్రస్తుతం ఐపీఎల్ 2026 సీజన్‌లో వైభవ్ సూర్యవంశీ రాజస్థాన్ రాయల్స్ తరపున అద్భు తమైన ప్రదర్శన కనబరుస్తున్నాడు. అతడు 13 ఇన్నింగ్స్‌ల్లో 44.53 సగటుతో, 236కు పైగా స్ట్రైక్ రేట్‌తో 579 పరుగులు సాధించాడు. అతడికి ఈ సీజన్‌లో ఒక సెంచరీ, మూడు హాఫ్ సెంచరీలు ఉన్నాయి.



# '3డీ' విజయ్ శంకర్ క్రికెట్‌కు గుడ్‌బై




న్యూఢిల్లీ: ఆల్‌రౌండర్ విజయ్ శంకర్ దేశవాళీలతోపాటు ఐపీఎల్‌కు వీడ్కోలు పలుకుతున్నట్టు శుక్రవారం ప్రకటించాడు. కొత్త అవకాశాలను అందిపుచ్చుకొనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు వివరించాడు. తమిళనాడుకు చెందిన 35 ఏళ్ల విజయ్ 2018-2019 మధ్య 12 వన్డేలు, 9 టీ20లలో టీమిండియాకు ప్రాతినిధ్యం వహించాడు. 'క్రికెట్ నా జీవితం. 10 ఏళ్ల వయస్సు నుంచే ఆడడం ప్రారంభించిన నేను.. 25 సంవత్సరాల తర్వాత క్రికెట్‌లో అన్ని స్థాయిల్లో ఆడినందుకు గర్విస్తున్నా.. మీ 3డీ విజయ్ శంకర్' అంటూ సోషల్ మీడియా లో అతడు పోస్ట్ చేశాడు. 2019 వన్డే వరల్డ్‌కప్‌లో మాంచెస్టర్‌లో వెస్టిండీస్‌తో ఆడిందే అతడి చివరి అంతర్జాతీ య మ్యాచ్. కాలి వేలి గాయంతో ఆపై మెగా టోర్నీ మొత్తానికి దూరమయ్యాడు. ఐపీఎల్‌లో చెన్నై, సన్‌రైజర్స్, ఢిల్లీ, గుజరాత్ జట్లకు విజయ్ ప్రాతినిధ్యం వహించాడు. 2019 వరల్డ్‌కప్‌లో తెలుగు క్రికెటర్ అంబటి రాయుడుకు స్థానం ఖాయమని భావించగా, చివరి నిమిషంలో అతడిని కాదని ఆల్‌రౌండర్ విజయ్ శంకర్‌కు జట్టులో చోటు కల్పించడం వివాదాస్పదమైం ది. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ విభాగాల్లో సత్తాచాటే 3డీ క్రికెటర్‌గా విజయ్‌ను ఎంపిక చేసినట్టు అప్పట్లో చీఫ్ సెలెక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్ వివరణ ఇచ్చుకున్నాడు. దీంతో తాను 3డీ కళ్లద్దాలతో వరల్డ్ కప్ మ్యాచ్‌ను చూస్తానంటూ రాయుడు నాడు వ్యంగ్యంగా పోస్ట్ చేయడం వైరల్‌గా మారింది.

# చరిత్ర సృష్టించిన పాటిదార్..

## అత్యంత వేగవంతమైన భారత బ్యాటర్



*బెంగళూరు: ఐపీఎల్ 2026లో భాగంగా సన్ రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూ రు కెప్టెన్ రజత్ పాటిదార్ ఓ అరుదైన రికార్డును సృష్టించాడు. ఐపీఎల్ చరిత్రలో అత్యంత వేగంగా 100 సిక్సర్లు పూర్తి చేసిన భారత ఆటగాడిగా నిలిచాడు. శుక్రవారం ఎస్‌ఆర్‌హెచ్‌తో జరిగిన మ్యాచ్‌లో అతను బాదిన ఏకైక సిక్సర్‌తో సిక్సర్ల సెంచరీ పూర్తి చేశాడు. పాటిదార్ 50 ఇన్నింగ్స్‌ల్లో 100 సిక్సర్లు కొట్టాడు. గతంలో ఈ రికార్డు చెన్నై సూపర్ కింగ్స్ ఆటగాడు శివమ్ దూబె పేరిట ఉండేది. సిక్సర్ల సెంచరీ పూర్తి చేసేందుకు దూబెకు 59 ఇన్నింగ్స్‌లు అవసరమయ్యాయి. ఐపీఎల్ చరిత్రలో ఓవరాల్‌గా, ఈ రికార్డు విండీస్ విధ్వంసకర వీరుడు క్రిస్ గేల్ పేరిట ఉంది. అతడు 37 ఇన్నింగ్స్‌ల్లోనే 100 సిక్సర్లు పూర్తి చేశాడు. విండీస్‌కే చెందిన ఆండ్రీ రసెల్ రెండో స్థానంలో ఉన్నాడు. రసెల్ 100 సిక్సర్ల మార్కును 47 ఇన్నింగ్స్‌లు అందుకున్నాడు. వీరిద్దరి తర్వాత మూడో స్థానం లో పాటిదార్ ఉన్నాడు. బంతుల పరంగానూ అత్యంత వేగంగా 100 సిక్సర్లు పూర్తి చేసిన ఆటగాళ్ల జాబితాలో కూడా పాటిదార్ మూడో స్థానంలో ఉన్నాడు. 100 సిక్సర్ల ఫీట్‌ను సాధించేందుకు పాటి దార్‌కు 933 బంతులు అవసరం కాగా.. రసెల్ 657 బంతులు, నికోలస్ పూరన్ 884 బంతుల్లోనే ఈ ఘనత సాధిం చాడు. ఈ జాబితాలో క్రిస్ గేల్ పాటిదార్ తర్వాతి స్థానంలో ఉండటం విశేషం. గేల్ 943 బంతుల్లో ఈ ఫీట్ సాధించాడు.*

# నిమిషాల వ్యవధిలోనే రికార్డులు బద్ధలు




రాంచీ: జాతీయ సీనియర్ అథ్లెటిక్స్ ఫెడరేషన్ కప్ (ఫెడ్ కప్) సంచలన ప్రదర్శనతో మొదలైంది. శుక్రవారం జరిగిన తొలిరోజు పోటీల్లో పురుషుల 100 మీటర్ల రేసులో నిమిషాల వ్యవధిలోనే రెండు రికార్డులు నమోదయ్యాయి.

తొలి సెమీఫైన ల్స్ హీట్స్‌లో గుర్విందర్‌వీర్ సింగ్ 10.17 సెకన్లలోనే రేసు ముగించి.. పదినెలల క్రితం 10.18 సెకన్లతో అనిమేశ్ కుజుర్ నెలకొల్పిన జాతీయ రికార్డును బద్దలు కొట్టాడు. ఆ వెంటనే జరిగిన రెండో సెమీఫైనల్ హీట్స్‌లో గుర్విందర్ రికార్డును అనిమేశ్ తిరగరాయడం విశేషం. తన హీట్స్‌ను అనిమేశ్ కేవ లం 10.15 సెకన్లలోనే ముగించి మళ్లీ తనపేరిట సరికొత్త రికార్డును నెలకొల్పాడు. దీంతో శనివారం ఈ ఇద్దరూ పోటీపడే ఫైనల్ రేసులో ఎలాంటి రికార్డు నమోదవుతుందన్నది మరింత ఆసక్తికరంగా మారింది.

# చరిత్ర సృష్టించిన సన్ రైజర్స్ యువ పేసర్

హైదరాబాద్: సన్ రైజర్స్ హైదరాబాద్ యువ పేసర్ సకిబ్ హుస్సేన్ సరికొత్త చరిత్ర సృష్టించాడు. 19 ఏళ్ల ఐపీఎల్ చరిత్రలో ఏ భారత బౌలర్‌కు సాధ్యంకాని రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. ఒక సీజన్‌లో తొలి 10 మ్యాచ్‌ల్లో కనీసం ఒక వికెట్ తీసిన తొలి ఇండియన్ బౌలర్‌గా రికార్డుల్లోకె క్కాడు. శుక్రవారం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన మ్యాచ్‌లో స్టార్ ప్లేయర్ విరాట్ కోహ్లీ వికెట్ తీయడంతో సకిబ్ ఈ ఫీట్‌ను సాధించాడు. ఓవరాల్‌గా ఈ బిహార్ కుర్రాడి కంటే ముందు ఫిల్ఫిన్వాస్ (13 వికెట్లు), ఎంగిడి (13) ఈ ఘనత సాధించారు. ఈ సీజన్‌లో ఏప్రిల్ 13న రాజస్థాన్ రాయల్స్ మ్యాచ్‌తో ఐపీఎల్ అరంగేట్రం చేసిన ఈ బిహార్ కుర్రాడు.. ఇప్పటివరకు 10 మ్యాచ్‌లు ఆడి 15 వికెట్లు పడగొట్టాడు. తొలి మ్యాచ్‌లోనే నాలుగు వికెట్లు సాధించి అదిరిపోయే ప్రదర్శనతో అందరినీ ఆకట్టుకున్నాడు. ఆ మ్యాచ్‌లో 57 పరుగుల తేడాతో రాజస్థాన్‌పై సన్ రైజర్స్ విజయం సాధించింది. ఈ సీజన్‌లో ఎస్‌ఆర్‌హెచ్ సాధించిన విజయాల్లో సకిబ్ కీలకపాత్ర పోషించాడు. యార్కర్లు, స్లో బాల్స్‌తో చెలరేగి పోయే ఈ నయా పేస్ సెన్సేషన్.. ఎస్‌ఆర్‌హెచ్ ప్లే ఆఫ్స్‌కు చేరడంలో ప్రధాన పాత్ర పోషించాడు. ఇక మ్యాచ్ విషయానికి వస్తే.. శుక్రవారం ఆర్సీబీతో జరిగిన మ్యాచ్‌లో ఎస్‌ఆర్‌హెచ్ 55 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ విజయం సాధించినా పాయింట్ల పట్టికలో మూడో స్థానానికే పరిమితమైన ఎలిమినేటర్ గండాన్ని దాటాల్సి ఉంది. తొలి రెండు స్థానాల్లో నిలిచిన ఆర్సీబీ, గుజరాత్ క్వాలిఫయర్-1లో తలపడనున్నాయి. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు నేరుగా ఫైనల్‌కు చేరనుండగా.. ఓడిన జట్టుకు క్వాలిఫయర్-2 రూపంలో మరో అవకాశం ఉంటుంది.



# బాధపెట్టారు.. బాధ్యులను వదలను



స్విమ్మింగ్ పూల్ వద్ద బికినీతో ఫొటోషూట్ జరిగినట్టు ఆన్‌లైన్ వేదికగా వైరల్ అవుతున్న తన ఫొటోలు, వీడియోలు అన్నీ ఫేక్ అని నటి రుక్మిణి వసంత్ స్పష్టం చేశారు. ఏఐ సాయంతో అసభ్యకర రీతిలో తన ఫొటోలను క్రియేట్ చేసి, సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయడం అత్యంత బాధ్యతారాహిత్యమని ఆగ్రహం వ్యక్తంచేశారు. అంతేకాదు, వ్యక్తిగత గోప్యతను ఉల్లంఘించడమే అవుతుందని మండిపడ్డారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. “ఏఐ సాయంతో క్రియేట్ చేసిన నా ఫొటోలు ఆన్లైన్ వేదికగా వైరల్ అవడం నేను, నా టీమ్ గుర్తించాం. అవన్నీ ఫేక్, ఏఐ సాయంతో చేసినవని స్పష్టం చేయదలుచుకున్నా. ఇలా చిత్రాలు, సమాచారం క్రియేట్ చేయడం నిజంగా బాధ్యతారాహిత్యమే. అంతేకాదు, మా వ్యక్తిగత గోప్యతను ఉల్లంఘించడమే అవుతుంది. ఈ వ్యవహారాన్ని నేను తీవ్రంగా పరిగణిస్తున్నా.

ఫొటోలను క్రియేట్ చేసిన వారితో పాటు, ఆన్లైన్ వేదికగా వైరల్ చేస్తున్న వారిపైనా న్యాయ, సైబర్ క్రైమ్ ద్వారా చర్యలు ప్రారంభించాం. ఇలాంటి కంటెంట్, ఫొటోలను ఆన్లైన్ వేదికగా పంచుకోవడం మానుకోవాలని ప్రతిఒక్కరికీ విజ్ఞప్తి చేస్తున్నా” అని రుక్మిణి వసంత్ అన్నారు. ఏఐ సాయంతో తయారుచేసిన ఫేక్ ఫొటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల వేదికగా వైరల్ అవుతుండటం ప్రస్తుతం నటీమణులకు తలనొప్పిగా మారింది. సినిమా, పబ్లిక్ ఈవెంట్స్‌కు హాజరయ్యే హీరోయిన్స్, నటీమణులను అభ్యంతరకర రీతిలో ఫొటోలు తీయడంపైనా రుక్మిణి వసంత్ గతంలో మండిపడ్డారు. జూమ్ చేసి మరీ తమ శరీరాలను ఫొటోలు తీయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. ఇప్పుడు ఏఐ సాయంతో ఏకంగా బికినీలో ఫొటో షూట్ జరిగినట్టు వీడియోలు క్రియేట్ చేయడం గమనార్హం. గత కొన్ని రోజులుగా సినీతారలు, యాంకర్లకు సంబంధించిన ఫొటోలు ఆన్లైన్లో దర్శనమిస్తున్నాయి. అవి ఏఐ ఫొటోలంటూ నటీమణులే స్వయంగా పోస్ట్ పెడితే తప్ప, ఫేక్‌వని తెలియడం లేదు.

# లైఫ్‌లో మర్చిపోలేని రోజు ఇది!




తన జీవితంలో ‘మే 23’ ఎప్పటికీ ప్రత్యేకమేనని అగ్ర కథానాయకుడు నాగార్జున అన్నారు. అందులోనూ ఈ ఏడాది మరీ స్పెషల్ అన్నారు. తన మొదటి చిత్రం ‘విక్రమ్’ విడుదలై నేటికి 40 ఏళ్లు అయిన సందర్భంగా ఆయన పోస్ట్ పెట్టారు. తనను ఆదరిస్తున్న అభిమానులకు ధన్యవాదాలు తెలిపారు. “అందరికీ ధన్యవాదాలు. మే 23.. నేను ఎప్పటికీ మర్చిపోలేని రోజు.. మా నాన్న చివరి చిత్రం (మనం) 2014లో ఈరోజే విడుదలైంది. నాన్నతో పాటు నాగచైతన్య, అఖిల్‌తో నటించే అవకాశం ఆ సినిమాతోనే దక్కింది. ఇక 40 ఏళ్ల క్రితం ఇదే రోజు నా మొదటి చిత్రం ‘విక్రమ్’ విడుదలైంది. మిమ్మల్ని అలరించడం కోసం, మీ ప్రేమాభిమానాలు పొందడం కోసం నేను ఇండస్ట్రీకి వచ్చాను. ‘విక్రమ్’ నాకు ఎంతోమంది అభిమానులను దగ్గర చేసింది. ఇన్నేళ్లుగా నాకు అండగా నిలిచిన అభిమానులందరికీ నా కృతజ్ఞతలు. భవిష్యత్తులో మరిన్ని మే 23లను ఇలానే సెలబ్రేట్ చేసుకోవాలని కోరుకుంటున్నా” అని నాగార్జున తన పోస్టులో పేర్కొన్నారు. నాగార్జున హీరోగా మధుసూధనరావు తెరకెక్కించిన చిత్రం ‘విక్రమ్’. 1986 మే 23న విడుదలై విజయాన్ని అందుకుంది. 1983లో బాలీవుడ్‌లో విడుదలైన ‘హీరో’ సినిమాకు రీమేక్. ప్రస్తుతం కింగ్ తన 100వ సినిమాతో బిజీగా ఉన్నారు. తమిళ దర్శకుడు రా. కార్తీక్ తెరకెక్కిస్తున్నారు. ‘కింగ్ 100’ అనే వర్కింగ్ టైటిల్‌తో ప్రచారంలో ఉంది. నాగార్జున ఇందులో పలు రకాల గెటప్పుల్లో కనిపిస్తారని, ఆయన పేరు చెప్పగానే శివ, రక్షకుడుతోపాటు, ‘కూలీ’లో పోషించిన సైమన్‌లాంటి స్టైలిష్ పాత్రలు గుర్తొస్తాయని, వాటన్నిటినీ గుర్తుచేసేలా ‘కింగ్ 100’ ఉంటుందని దర్శకుడు ఇటీవల తెలిపారు.



## ఇంకా సెన్సార్ కాని.. జన నాయగన్

విజయ్ కథానాయకుడిగా హెచ్. వినోద్ దర్శకత్వంలో రూపొందిన యాక్షన్ థ్రిల్లర్ ‘జన నాయగన్’. సంక్రాంతి కానుకగా రావాల్సిన సినిమా ఇప్పటికీ విడుదలకు నోచుకోలేదు. సెన్సార్ విషయంలో కోర్టుల చుట్టూ తిరగ్గా, ఫైనల్ కమిటీ ఈ మూవీని చూసి, సర్టిఫికెట్ ఇవ్వాల్సిఉంది. ఈ ప్రక్రియ ఇప్పటికీ పూర్తికాలేదని నిర్మాత వెంకట్ కె నారాయణ అన్నారు. విజయ్ సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత కూడా వ్యవహారం కొలిక్కి రాకపోవడం గమనార్హం. తొలుత ఈ విషయమై స్పందించడానికి నిర్మాత నారాయణ సంశయం వ్యక్తంచేయగా, ఆ తర్వాత సెన్సార్ అవ్వలేదని స్పష్టంచేశారు. “జన నాయగన్” గురించి మాట్లాడానికి ఇది సరైన వేదిక కాదు. నేను ఆలయ దర్శనానికి వచ్చాను. కానీ, ఒక విషయం చెప్పాలనుకుంటున్నా. ఇప్పటికీ సెన్సార్ సర్టిఫికెట్ రాలేదు. దానికోసమే వేచి చూస్తున్నాం. త్వరలోనే సమస్యను పరిష్కరించి, సినిమాను ప్రేక్షకుల ముందుకుతీసుకొస్తాం. ఇంతకుమించి మాట్లాడటానికి ఇది వేదిక కాదు” అని అన్నారు.

# టీజర్‌తో లెనిన్ జోష్...



అక్కినేని యంగ్ అండ్ టాలెంటెడ్ హీరోస్‌లో అఖిల్ అక్కినేని చేస్తున్న కొత్త ప్రాజెక్టు ‘లెనిన్’. దర్శకుడు మురళీ కిషోర్ అబ్బూరు తెరకెక్కించిన మాస్ విలేజ్ డ్రామానుంచి మేకర్స్ లేటెస్ట్‌గా టీజర్‌ని విడుదల చేశారు. అయితే టీజర్ మాత్రం సినిమాపై బజ్‌ని మరింత పెంచేలా ఉంది. మొన్నామధ్య హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సేపై వదిలిన పోస్టర్ లుక్‌లోనే స్టార్ట్ అయిన టీజర్‌లో సీనియర్ ఎన్టీఆర్ డైలాగ్‌తో మగ వేషంలో ఆమె అదరగొట్టింది. ఇక అక్కడనుంచి ఇద్దరి మధ్య బ్యూటిఫుల్ కన్వర్జేషన్ అలా సినిమా విలేజ్ నేపథ్యంలో సీన్స్‌తో ఆకట్టుకునే విధంగా వెళ్ళిపోయింది. అఖిల్ కూడా మంచి మాస్ లుక్స్ మంచి పెర్ఫామెన్స్‌ని ఇందులో కనబరచగా బ్రహ్మాజిలాంటి వారు తమ కొత్త లుక్‌తో ఆశ్చర్యపరిచారు. అయితే ఇందులో అంతా బాగానే ఉంది కానీ అఖిల్ డబ్బింగ్ మాత్రం డిఫరెంట్‌గా వచ్చిందని చెప్పాలి. రాయలసీమ యాసలో కొనసాగుతున్న పాత్రల సంభాషణలు ఇందులో అఖిల్ ఒరిజినల్ డబ్బింగ్ మిస్సయినట్టు ఇందులో వినిపిస్తుంది. మరి ఇది టెక్నికల్ పొరపాటా లేక డబ్బింగ్ మార్చారా? అనేది తెలియాల్సి ఉంది. ఇక ఈ చిత్రానికి థమన్ సంగీతం అందిస్తుండగా సితార ఎంటర్టైన్మెంట్ నిర్మాణం వహించారు. జూన్ 26న సినిమా గ్రాండ్‌గా విడుదల కానుంది.

# ‘నో రెంటల్.. ఓన్లీ పర్సంటేజీ’

## తెలంగాణ ఎగ్జిబిటర్ల కీలక నిర్ణయం



రాష్ట్రంలో పర్సంటేజ్ ప్రకారమైతేనే ఇకపై సినిమాలు ఆడిస్తామని తెలంగాణ ఎగ్జిబిటర్లు స్పష్టం చేశారు. శనివారం తెలుగు ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్‌లో సమావేశమైన ఎగ్జిబిటర్స్ కీలక నిర్ణయం ప్రకటించారు. రామ్‌చరణ్ కథానాయకుడిగా బుచ్చిబాబు దర్శకత్వంలో రాబోతున్న ‘పెద్ద’ మూవీకి కూడా పర్సంటేజ్ కావాల్సిందేనన్నారు. తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ సెక్రటరీ శ్రీధర్ తదితరులు మాట్లాడుతూ.. “తెలుగు ఫిల్మ్ ఛాంబర్ కమిటీతో రెండు మూడుసార్లు చర్చలు జరిగాయి. ‘హరిహర వీరమల్లు’ విడుదల సమయంలో రెండు నెలల్లో సమస్యను పరిష్కరిస్తామన్నారు. కానీ, ఏడాది అయ్యింది. నిర్మాతలు కావాలనే ఆలస్యం చేస్తున్నారు. ముందు మూడు వారాలన్నారు. కానీ, ఇప్పుడు మళ్లీ ఇంకొక మూడు వారాలు వాయిదా వేస్తున్నారు. పర్సంటేజ్ ప్రకారమే సినిమాలు ఆడిస్తాం”

“120మంది థియేటర్ల యజమానులు దీనస్థితిలో ఉన్నారు. 10, 15 ఏళ్ల కింద థియేటర్లకు మంచి ఆదాయం ఉండేది. ఇప్పుడు ఎగ్జిబిటర్కి రెవెన్యూ రావడం లేదు. కానీ, నిర్మాతలకు 14 రకాలుగా ఆదాయం వస్తోంది. దేశవ్యాప్తంగా థియేటర్స్‌లో పర్సంటేజ్ విధానమే నడుస్తోంది. ఇక్కడ మాత్రం రెంటల్ ఉంది. సమస్యను రోజురోజుకీ ఆలస్యం చేస్తున్నారు. మా థియేటర్లలో రెంట్ ట్రాక్ అమలు చేయడానికి సిద్ధంగా ఉన్నాం. మా దగ్గర ఎక్కడా తప్పు జరగడం లేదు. థియేటర్ల సౌండ్ సిస్టమ్, ఏసీలను బట్టి కాదు, అక్కడ వచ్చే కలెక్షన్లను బట్టి గ్రేడింగ్ చేయాలి. అలాంటి గ్రేడింగ్‌కు మాత్రమే మేము సిద్ధం. మాకు పర్సంటేజ్ విధానం కావాల్సిందే. అది ఎంత ఇస్తారో చెప్పండి”

### తెలంగాణలో ‘పెద్ది’ టికెట్ రేట్లు పెంచొద్దని కోరాం!

“ఆంధ్రాలో మాత్రమే ‘పెద్ది’ టికెట్ రేట్ల పెంపు ఉండొచ్చు. తెలంగాణలో పెంపులేదు. రేట్లు పెంచొద్దని, ప్రేక్షకులను చంపొద్దని సీఎం రేవంత్‌రెడ్డి, ఎగ్జిబిటర్లు, ఛాంబరు లేఖ ఇచ్చాం. ఒకవేళ పెంచుతూ నిర్ణయం తీసుకుంటే, డిమాండ్, సప్లయ్ ఆధారంగా మా నిర్ణయం ఉంటుంది. మేము ‘పెద్ది’లాంటి సినిమాలకు సెల్యూట్ చేస్తాం. దానిమీద మాకు పగ ఏమీ లేదు. ‘పెద్ది’ని ఈ గొడవ నుంచి మినహాయించాలని అనుకున్నాం. కానీ, ఆ సినిమా తర్వాత కూడా మళ్లీ ఎప్పుడు మమ్మల్ని పట్టించుకుంటారనేది అర్థం కాకనే ఈ మూవీని కూడా పర్సంటేజ్ శ్లాబ్‌లో చేర్చాలని నిర్ణయించుకున్నాం. అవసరమైతే అగ్ర కథానాయకుడు చిరంజీవి దృష్టికి మా సమస్యను తీసుకెళ్లి పరిష్కారం దిశగా కృషి చేస్తాం” అని అన్నారు. ఎగ్జిబిటర్ల నిర్ణయంతో నైజాంలో ‘పెద్ది’ విడుదల, టికెట్ రేట్ల పెంపుపై సందిగ్ధత కొనసాగుతోంది.

ఈ సందర్భంగా తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ నూతన అధ్యక్షుడిగా జువ్వాడి శేఖర్‌ను ఎన్నుకున్నారు. విలేకరుల సమావేశంలో తెలంగాణ ఎగ్జిబిటర్స్ ప్రెసిడెంట్ విజయేందర్ రెడ్డి, తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ సెక్రటరీ శ్రీధర్, సుదర్శన్ థియేటర్ బాలగోవింద్ రాజ్, రవీంద్ర గోపాల తదితరులు పాల్గొన్నారు.